www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 195 | సోమవారం 07-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



గిన్నిస్‌లో పోలవరం

అర్ధరాత్రికే దుబాయి రికార్డు బ్రేక్

- నేడు 8 గంటలకు 30 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు
- 24 మంది గిన్నిస్‌బుక్ ప్రతినిధుల పర్యవేక్షణ
- గంటలోనే 1382 క్యూబిక్ మీటర్ల పనులు

విశాలాంధ్ర-పోలవరం : బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరం నిర్మాణంలో మరో అరుదైన రికార్డు ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ చానల్‌లో రికార్డుస్థాయిలో కాంక్రీట్ వేసేందుకు చేపట్టిన పనులు ఆదివారం ఉదయం ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 8 గంటల వరకు ఈ పనులు కొనసాగుతాయి. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో దీన్ని నమోదు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధి విశ్వనాథ్ పనులు పరిశీలించారు. దుబాయ్ రికార్డును అధిగమించేందుకు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 24 గంటల్లో 30వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసేందుకు ఏర్పాటు చేసినట్లు నవయుగ ఎండీ బి.శ్రీధర్ చెప్పారు. గిన్నిస్‌బుక్ ప్రతినిధులు 24 మంది ఈ కాంక్రీట్ పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి 15 నిమిషాలకోసారి గణాంకాలను గిన్నిస్‌బుక్ ప్రతినిధులు నమోదు చేసుకుంటున్నారు. నేడు పనులను

- మిగతా 2 లో



ఇకపై రైల్వేస్టేషన్లలోనూ సెక్యూరిటీ చెక్
ఎయిర్‌పోర్టుల తరహాలో... 20 నిమిషాల ముందే బోర్డింగ్ 9లో

బంగారు కలకు

బానిసలం

రికార్డుల సృష్టికర్తలపై నిర్లక్ష్యం





- రోజా దుమ్మూ, ధూళిలోనే పనులు
- ప్రమాదం జరిగినా పట్టించుకోరు
- ప్రాజెక్టు పరిగెత్తినా బతుకులు దుర్భరమే
- కనీస సౌకర్యాలు, వేతనాలకు నోచుకోలేదు
- ఇరుకిరుకు రేకుల షెడ్లల్లోనే నాలుగేళ్లుగా జీవనం
- పోలవరం ప్రాజెక్టు వలస కార్మికుల అష్టకష్టాలు
- నేడు ప్రాజెక్టు పనులను సందర్శించనున్న చంద్రబాబు

రాష్ట్రానికి అది జీవనాడి, ప్రజల బంగారు కల పోలవరం ప్రాజెక్టు. ఆ కలను సాకారం చేసేందుకు వేలాది మంది కార్మికులు రేయింబవళ్లు కష్టించి రోజుకు 15 గంటలపైనే పని చేస్తున్నారు. ఫలితంగానే అది రికార్డులను సొంతం చేసుకుంటుంది. సీఎం చంద్రబాబు ఎక్కడకు వెళ్లినా ప్రాజెక్టు గురించే ప్రస్తావన. ఒకటి కాదు రెండు కాదు పదుల సార్లు ప్రాజెక్టును సందర్శించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కానీ, అందులో పని చేసే కార్మికుల బతుకులలో మాత్రం ఎలాంటి మార్పు రావటంలేదు. ఉపాధి కోసం పొట్టచేతబట్టుకుని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారంతా ప్రమాదకర పరిస్థితుల్లోనూ సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నారు. దుమ్మూ, ధూళీ మధ్య చెమటోడ్చి కష్టపడుతున్నా కడుపు నిండటంలేదు. రికార్డుస్థాయిలో కాంక్రీట్ పనులు, తక్కువకాలంలో ప్రాజెక్టును పూర్తి చేయటం భవిష్యత్‌లో ఉండబోదని, కరవు కనిపించదంటూ ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోంది. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ప్రతిసారీ పనులే తప్ప, అందులో పని చేస్తున్న కార్మికుల వెతలు చంద్రబాబుకు పట్టటంలేదు. కనీస వసతులు, చాలీ చాలని వేతనాలకు నోచుకోని కార్మికుల బతుకులు మట్టిలోనే మగ్గిపోతున్నాయి. సీఎం చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు రానున్న నేపథ్యంలో కార్మికుల వెతలపై 'విశాలాంధ్ర' ప్రత్యేక కథనం.



దుమ్ము, ధూళితో కూడిన నిర్మాణ పనుల్లో కార్మికులు

11లో

పట్టణాలకు దీటుగా గ్రామాలు

పునాదిపాడు ఆదర్శం కావాలి



- బందరు పోర్టుతో జిల్లా అభివృద్ధి
- 'జన్మభూమి-మాఊరు'లో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలో నగరాలకు దీటుగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కృష్ణాజిల్లా పునాదిపాడు గ్రామంలో ఆదివారం జరిగిన 6వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారితో సీఎం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పునాదిపాడు గ్రామం 2030 నాటికి అభివృద్ధిని మరింత మెరుగుపరచుకుని రాష్ట్రంలోని గ్రామాలకు ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ గ్రామం నాయకులు గ్రామ ప్రతిష్టను పెంచే విధంగా పని చేయాలని సూచించారు. ఇప్పటికే గ్రామాల్లో సీసీ రోడ్లు, ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ, మరుగుదొడ్ల నిర్మాణం, 30 లక్షల ఇళ్ల నిర్మాణానికి నాంది పలికామన్నారు. భూమి కొరత కారణంగా గ్రామాల్లో కూడా ప్రజల అంగీకారంతో జీ ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ పని చేసే ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తల సేకరణ, గురుకులాల ఏర్పాటు, సామూహిక గోకులాలు, సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ షెడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో సోలార్‌తోనే విద్యుత్ వస్తుందని, రాష్ట్రం తూర్పున ఉండడంతో సూర్యోదయ ఆంధ్రప్రదేశ్ పేరు పెట్టినట్లు ఆయన వివరించారు. మెరుగైన ప్రకృతి సేద్యం చేయడం వల్ల

- మిగతా 2 లో

అతి వేగమే...

11 మంది దుర్మరణం



- తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం
- మృతుల్లో 10 మంది అయ్యప్ప భక్తులు
- ఐదుగురి పరిస్థితి విషమం
- అందరూ తెలంగాణవారే

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పుదుకొట్టై సమీపంలో కంటైనర్, వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ సహా 11 మంది దుర్మరణంగా చెందగా వారిలో 10 మంది అయ్యప్ప భక్తులు ఉన్నారు.

2లో

ఐటీ కంపెనీలకు గ్లోబల్ ఇక్కట్లు

- ప్రపంచ ఆర్థికవ్యవస్థ వృద్ధిపై మేఘాలు
- తగ్గిన బీఎఫ్ఎస్ఐ ఆదాయం
- రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గించిన అంతర్జాతీయ కంపెనీలు

7లో

ఇదీ లోకం!



'ఫారిన్'లోన్ కావాలి సార్... సంక్రాంతికి ఫ్యామిలీతో ఊరికి బయలుదేరాలి..

14 నోటిఫికేషన్లకు..

రిమార్కులు..!

1521 పోస్టుల పెండింగ్

- ప్రభుత్వానికి ఏపీపీఎస్సీ ఆలస్యంగా నివేదిక
- అభ్యర్థులకు వయోపరిమితి గండం..
- కమిషన్ వైఖరిపై సర్వత్రా నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీపీఎస్సీ నుంచి విడుదలవ్వాల్సిన 14 నోటిఫికేషన్లు పెండింగ్‌లో నిలిచాయి. వాటికి వివిధ సాంకేతిక కారణాల్ని చూపుతూ ప్రభుత్వానికి కమిషన్ కార్యాలయం ఇటీవల నివేదించింది. ఇంతకాలం అధికారులు మౌనంగా ఉండి..నోటిఫికేషన్ల సమయంలో పోస్టులపై రిమార్కులు పంపడంపై విమర్శలున్నాయి. ఏపీపీఎస్సీ నుంచి మొత్తంగా 35నోటిఫికేషన్ల ద్వారా 4,776 పోస్టులు విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకూ 21నోటిఫికేషన్లు(3,255 పోస్టులు) ఇచ్చారు. మిగిలిన 14విభాగాలకు చెందిన 1521 పోస్టులకు నోటిఫికేషన్లు ఇవ్వడంపై కమిషన్ కార్యాలయానికి పలు సందేహాలు నెలకొన్నాయి. శాఖల వారీగా వాటికి రిమార్కులు రాసి..ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. ఈ జాప్యంపై నిరుద్యోగ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే వరుస వారీగా నోటిఫికేషన్లు విడుదల చేయడంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. విడుదల చేసిన 21 నోటిఫికేషన్ల దరఖాస్తుల ప్రక్రియ విడతల వారీగా ఫిబ్రవరి 12వ తేదీతో ముగియనుంది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు

- మిగతా 2 లో



రాష్ట్రానికి భారీ కాగిత పరిశ్రమ

- రూ. 24,500 కోట్ల ఎఫ్‌డీఐ
- రామాయపట్నంలో ఏర్పాటు
- 15,000 మందికి ఉపాధి అవకాశాలు
- 50వేల మంది కలప రైతులకు మేలు
- ఏటా 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలో రూ. 24,500 కోట్ల భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) పెట్టేందుకు ప్రపంచంలో పేరొందిన ఇండోనేషియాకు చెందిన ఏసియా పల్ప్, పేపర్ గ్రూప్ (ఏపీపీ) ముందుకొచ్చింది. ఈ మొత్తం 3.5 బిలియన్ల అమెరికన్ డాలర్లతో సమానం. దేశ చరిత్రలో ఏకకాలంలో ఇంత పెద్ద మొత్తంలో ఎఫ్‌డీఐ రావడం ఇదే ప్రథమంగా తెలుస్తోంది. ప్రకాశంజిల్లా రామాయపట్నంలో 2,500 ఎకరాల్లో కాగిత పరిశ్రమను ఏపీపీ నెలకొల్పనుంది. ఏటా 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ ద్వారా 15వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు చెపుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే యూనిట్ నుంచి ప్యాకేజింగ్ పేపర్‌తోపాటు రాతకు ఉపయోగించే పేపర్, ప్రింటింగ్ పేపర్ ఉత్పత్తి చేస్తామంటున్నారు. వాస్తవానికి

- మిగతా 2 లో

అణ్వాయుధాల నియంత్రణవాది బ్రౌన్ మృతి

వాషింగ్టన్ : జిమ్మీకార్టర్ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో రక్షణ మంత్రిగా పనిచేసి అణ్వాయుధాలను నియంత్రించితీరవలసిందేనని గట్టిగా తన వాణిని వినిపించిన హెరాల్డ్ బ్రౌన్ (91) మృతిచెందారు. అణ్వాయుధాల నియంత్రణ కోసం అప్పటి సోవియట్ యూనియన్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందామని బ్రౌన్ చేసిన ప్రకటనను సెనెట్ తిరస్కరించింది. న్యూయార్క్‌కు చెందిన బ్రౌన్ రక్షణ మంత్రిగా పనిచేసిన మొదటి సైంటిస్టు. ఆయన భౌతికశాస్త్రవేత్త. 18వ ఏటనే బ్యాచిలర్స్ డిగ్రీని పొందారు. 22 ఏళ్లకు డాక్టరేట్ డిగ్రీని పొందారు. మొదట ఆయన అణ్వాయుధాల ఉత్పత్తి శాస్త్రవేత్తగా వృత్తిజీవితాన్ని ప్రారంభించారు. ఆ తరువాత అణ్వాయుధాల వల్ల ముప్పును గ్రహించిన బ్రౌన్ వాటిని నియంత్రించాలని ప్రభుత్వంతో పోరాటం చేశారు. పాంక్రియాస్ కేన్సర్ వ్యాధితో కాలిఫోర్నియాలోని రాంచోశాంటాఫిలో శుక్రవారం మరణించినట్టుగా సంబంధిత అధికారులు తెలిపారు. జీవిత చరమాంకం వరకు శాంటామోనికాకు చెందిన రాండ్ కార్పొరేషన్‌లో పనిచేశారు. ఆధునిక యుద్ధ ప్రమాదాన్ని, తాజా సాంకేతికతలను, తద్వారా కలిగే సంక్లిష్టతలను బ్రౌన్ తెలుసుకున్నంతగా మరే ఇతర రక్షణ మంత్రి తెలుసుకోలేదని రాండ్ కార్పొరేషన్ అధ్యక్షుడు మైకెల్ డి రిచ్ తెలిపారు. బ్రౌన్ 1977లో పెంటగాన్ అధిపతిగా బాధ్యతలు స్వీకరించి 1981లో అక్కడి నుంచి వైదొలిగారు. అణ్వాయుధాలను నియంత్రించాలని సెనెట్‌ను ఒప్పించడంలో విఫలమైన బ్రౌన్ ఎంతగానో అసంతృప్తి చెందారు. ప్రపంచం అత్యంత ప్రమాదకరమైన స్థావరం, ఎల్లవేలలా అది ప్రమాదకరంగానే కొనసాగుతోందని బ్రౌన్ చేసిన వ్యాఖ్యను 1980 డిసెంబరులో వాషింగ్టన్ పోస్టు ప్రచురించింది. సహేతుకమైన మార్పును మాత్రమే తాను కోరుకుంటున్నానని ఆయన వ్యాఖ్యానించారు. పోలారిస్ మిసిలి అణువార్‌హెడ్‌ను రూపొందించడంలో క్రియాశీలపాత్ర వహించిన బ్రౌన్ తన ప్రాథమిక లక్ష్యం జాతీయ భద్రతమాత్రమేనని చెప్పారు.



2029 నాటికి చైనా జనాభా144 కోట్లు



షాంఘై : చైనా జనాభా 2029 నాటికి 144 కోట్ల20 లక్షలకు చేరుతుందని అంచనావేశారు. ఆ తరువాత 2030 నుంచి నిరంతరం జనాభా తగ్గిపోతుందని ప్రభుత్వ పరిశోధకులు అధ్యయనం అనంతరం విడుదల చేసిన నివేదికలో స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం ఈ నివేదికను విడుదల చేశారు. 2030 తరువాత కార్మికశక్తి తగ్గిపోనున్నందున అందుకు అనుగుణంగా తగిన విధానాలను రూపొందించుకోవాలని ఆ నివేదిక సూచించింది.

వృద్ధుల సంఖ్య వేగంగా పెరగనున్నదని చైనా అకాడమి అఫ్ సోషల్‌సైన్సెస్ ప్రచురించిన 'గ్రీన్‌బుక్ ఆఫ్ పాపులేషన్ అండ్ లేబర్' తాజా ఎడిషన్‌లో పేర్కొన్నారు. కార్మికుల సంఖ్య పెరుగుదల ప్రస్తుతం నిలిచిపోయిందని నివేదిక తెలిపింది. పెరుగుతున్న వృద్ధుల సంఖ్య దేశంలో సామాజిక, ఆర్థిక రంగాలపై ఎంతో ప్రభావం చూపుతుందని, ప్రత్యేకించి సంతానోత్పత్తి రేటు తగ్గిపోతున్నందున ఈ పరిణామం సంభవిస్తుందని ఆ నివేదిక పేర్కొన్నది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ దీర్ఘకాలంలో జనాభా రేటు తగ్గిపోతుందన్న సిద్ధాంతం సరైందేనని, దీనివల్ల సామాజిక ఆర్థిక పరిణామాలు ప్రతికూలంగా ఉంటాయని నివేదిక తెలిపింది. ఈ శతాబ్ది మధ్య కాలంనాటికి చైనా జనాభా 136 కోట్లకు తగ్గిపోతుందని నివేదిక అంచనావేసింది. దీని అర్థం పనిచేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. సంతానోత్పత్తి రేటులో మార్పులేకపోయినప్పటికీ జనాభా సంఖ్య 2065నాటికి 117 కోట్లకు తగ్గిపోతుందని అధ్యయనవేత్తలు అంచనావేశారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం గతంలో ఉన్న ఒకే బిడ్డ విధానాన్ని 2016లో మార్పు చేసి ఒకరికంటే ఎక్కువ సంతానాన్ని తల్లిదండ్రులు పొందవచ్చునని పేర్కొన్నది. 2017లో సంతానోత్పత్తి రేటు 3.5 శాతం తగ్గింది. ఇది ఇంకా తగ్గిపోవచ్చునని భావిస్తున్నారు. పదవీవిరమణ చేసే వారి సంఖ్య 2060 నాటికి చాలా ఎక్కువగా తగ్గిపోనున్నది.

ట్రంప్ ప్రభుత్వం మూతపై పెన్స్ చర్చలు



వాషింగ్టన్ : దాదాపు రెండు వారాలుగా ట్రంప్ ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి 5.6 బిలియన్ డాలర్లు మంజూరు చేయాలని ట్రంప్ ప్రభుత్వం కోరగా అమెరికా ప్రతినిధుల సభ తిరస్కరించింది. దీనితో ప్రభుత్వాన్ని పాక్షికంగా మూసివేశారు. తాజాగా మెజారిటీ పొందిన డెమోక్రాట్లు ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరిస్తూ, కచ్చితమైన ప్రకటన చేశారు. కాంగ్రెస్‌కి, ప్రభుత్వానికి మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించేందుకు దేశ ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్, ప్రభుత్వ ఇతర ఉన్నతాధికారులు శనివారం డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అయితే, ఈ చర్చలు ఫలించలేదు. గోడ నిర్మాణానికి నిధులను అందించే సమస్యలేదని ఆ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం మూతపడిన కారణంగా 8 లక్షల మందికిపైగా సిబ్బందికి వేతనాలు అందలేదు. రెండు పక్షాలు తమతమ వైఖరులను విడిచిపెట్టలేదు. గోడ నిర్మాణానికి అదనంగా నిధులు మంజూరుచేయకపోతే సంబంధిత బిల్లుపైన తాను సంతకం చేయబోనని ట్రంప్ స్పష్టం చేశారు. చర్చలకు ముందు పెన్స్ మాట్లాడుతూ, ప్రభుత్వం మూతను పరిష్కరించుకోవడమేకాక, అదనపు నిధుల కోసం తాను ప్రయత్నిస్తున్నానని తెలిపారు. గోడను నిర్మిస్తేనే అసలైన భద్రత ఉంటుందని ఆయన అన్నారు. వైట్‌హౌస్‌లో జరిగిన చర్చలలో ట్రంప్ అల్లుడు, సీనియర్ సలహాదారు అయిన జారెడ్ కుష్నర్ తదితరులు పాల్గొన్నారు. తాజాగా స్పీకర్‌గా ఎన్నికైన నాన్సీ పెలోసి మాట్లాడుతూ, ట్రంప్ ప్రతిపాదన అనైతికం, డబ్బు దుర్వినియోగం మాత్రమేనని వ్యాఖ్యానించారు. అదనపు నిధులు కేటాయించాల్సిందేనంటూ ట్రంప్ శనివారం కూడా పలు ట్వీట్లు చేశారు. తనకున్న అత్యవసర అధికారాలను వినియోగించి కాంగ్రెస్ ఆమోదంలేకుండానే గోడ నిర్మిస్తానని ట్రంప్ తాజాగా ప్రకటించారు.

నేడు హసీనా పదవీ స్వీకారం



ఢాకా : బంగ్లాదేశ్ ప్రధాన మంత్రిగా షేక్ హసీనా సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. గత డిసెంబరు 30వ తేదీన 11వ పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో హసీనా నాయకత్వంలోని అవామీలీగ్ పార్టీ అఖండ విజయం సాధించింది. హసీనాతో పాటు మంత్రివర్గం కూడా ప్రమాణస్వీకారం చేస్తుంది. దేశాధ్యక్షుడు అబ్దుల్ హమీద్ లాంఛనప్రాయంగా నూతన ప్రభుత్వం ఏర్పాటు కోసం హసీనాను ఆహ్వానించారు. హసీనా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఇది మూడోసారి. ప్రమాణస్వీకారోత్సవానికి తాము హాజరుకాబోవడంలేదని ప్రతిపక్ష జాతీయ ఐక్యా ఫ్రంట్ ప్రకటించింది. ప్రస్తుత పార్లమెంట్ గడువు ఈ నెల 28తో ముగుస్తుంది. ఆ తరువాత హసీనా నాయకత్వంలో పార్లమెంట్ సమావేశమవుతుంది.

థాయ్‌లాండ్‌లో బస్సు ప్రమాదం

బ్యాంకాక్ : థాయ్‌లాండ్‌లోని ఖలాంగ్ లువాంగ్‌లో ఆదివారం ప్రయాణీకులతో వెళుతున్న బస్సు తిరగబడి ఆరుగురు మృతి చెందగా, 50మంది గాయపడినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఫహోన్ యోతిన్ జాతీయ రహదారిపై స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుఝామున 3.20 గంటలకు ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ బస్సు ప్రైవేట్ టూర్ కంపెనీకి చెందింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనకుండా తప్పించేందుకు డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేయడంతో బస్సు బోల్తాపడినట్టు తెలుస్తోంది. ప్రమాద సమయంలో భారీ వర్షం కురుస్తోంది. మృతి చెందిన వారిలో ఒక పసిబిడ్డ కూడా ఉన్నది. ప్రమాదం జరిగిన తరువాత బస్సు డ్రైవర్ కనిపించడంలేదని పోలీసులు తెలిపారు.

అట్లాంటిక్‌లో ఇరాన్ నౌకా దళాలు

టెహ్రాన్ : ఇరాన్‌పైన అమెరికా చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నదా? జరుగుతున్న పరిణామాలు ఈ భావనకు దోహదం చేస్తున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా నావికాదళాలు వచ్చి తిష్టవేశాయి. ఈ విషయాన్ని గ్రహించిన ఇరాన్ కూడా అట్లాంటిక్ మహాసముద్రం ప్రాంతంలో తన నావికాదళాలను నిలిపివుంచనున్నది. నౌకాదళాధిపతి తౌ రాజ్ హసని మాట్లాడుతూ, ఇస్లామిక్ రిపబ్లిక్ సైనిక శక్తిని ప్రదర్శించేందుకు మార్చిలో తమ యుద్ధనౌకలను అట్లాంటిక్ ప్రాంతానికి నడిపిస్తామని తెలిపారు. ఇటీవల ఉత్పత్తిచేసిన షహంద్ డెస్ట్రాయర్ యుద్ధనౌకను కూడా అట్లాంటిక్ ప్రాంతానికి పంపిస్తామని ఆయన వెల్లడించారు. ఈ యుద్ధనౌకలు ఆధునిక సాంకేతికతో రూపొందించారని, దీనికి రక్షణకు సంబంధించిన శక్తి రెండు రెట్లు ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. భూతలం నుంచి భూమిపైకి, గగనతలానికి ఆయుధాలను ప్రయోగించే అవకాశం దీనికి ఉంటుందని వెల్లడించారు. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా వైమానిక దళాలు నిలిపివుంచడంతో ఇరాన్ ఆందోళన చెందుతోంది. పర్షియన్ గల్ఫ్‌లో చమురు ట్యాంక్‌ల రవాణాను నిరోధించేందుకు బహుశా అమెరికా ఈ చర్య తీసుకుని ఉండవచ్చునని కూడా ఇరాన్ భావిస్తున్నది. అట్లాంటిక్ మహాసముద్రం చాలా దూరంగా ఉన్నందున ఆ ప్రాంతానికి యుద్ధనౌకలు చేరుకోవడం దాదాపు ఐదు నెలల కాలం పట్టవచ్చునని హసని తెలిపారు. వెనిజులా ప్రాంతానికి రెండు లేదా మూడు యుద్ధనౌకలు త్వరలో చేరుకుంటాయని గతంలో ఆయన చెప్పారు. ఇటీవల కాలంలో హిందూమహాసముద్ర ప్రాంతానికి కూడా ఇరాన్ యుద్ధనౌకలు చేరాయి. వాణిజ్య నౌకలు, దారిదోపిడీ ముఠాల దాడులను నిలువరించేందుకే తమ నౌకలు ఆ ప్రాంతానికి చేరుకుంటున్నాయని తెలిపారు.

ఫ్రాన్స్‌లో మళ్లీ 'ఎల్లోవెస్ట్' ఉద్యమం



పారిస్ : ఫ్రాన్స్‌లో మళ్లీ 'ఎల్లోవెస్ట్' (పచ్చచొక్కాలు) నిరసన ఉద్యమం ప్రారంభమైంది. ప్రభుత్వాన్ని కూలదోసేందుకే ఈ ఉద్యమం ప్రారంభమైందని ప్రభుత్వ ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. శనివారం దాదాపు వెయ్యిమందికిపైగా నిరసనకారులు సెంట్రల్ పారిస్‌లో సమీకృతులయ్యారు. దాదాపు 15 పోలీసు బృందాలను ఈ ప్రాంతంలో ఏర్పాటుచేశారని ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది. ఏఎఫ్‌పీ ప్రధాన కార్యాలయం వెలుపల కొద్దిసేపు మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులపైన వివిధ వస్తువులను విసిరివేయడంతో పోలీసులు నిరసనకారులపై బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. మధ్యాహ్నానికి నిరసనకారుల సంఖ్య 4వేలకు చేరి తమతో ఘర్షణపడ్డారని పోలీసులు తెలిపారు. నిరసనకారులు చెత్తబుట్టలకు నిప్పుపెట్టారు. ఈ మంటలలో కొన్ని మోటారుసైకిళ్లు పాక్షికంగా దహనమయ్యాయి. నిరసనకారుల తరఫున 58 ఏళ్ల క్రిస్‌లైన్ మాట్లాడుతూ, తన భార్య వారానికి 25 గంటలు పనిచేస్తోందని, కుమార్తె నెలకు 800 యూరోలు సంపాదిస్తోందని అయినప్పటికీ నెలకు సరిపడా ఖర్చులకు ఈ ఆదాయం సరిపోవడంలేదని అన్నారు. ఫ్రాన్స్‌లోని అనేక చిన్న, పెద్ద పట్టణాలలో శనివారం నిరసన ప్రదర్శనలు జరిగాయి. రౌఎన్ పట్టణంలో 2వేల మందికిపైగా నిరసనలో పాల్గొన్నారు. దాదాపు రెండు నెలలుగా ఎల్లోవెస్ట్ ఉద్యమం జరిగిన తరువాత పెంచిన పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గిస్తానని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన తరువాత ఉద్యమం కొంతమేర చల్లారింది. ప్రభుత్వం చేపడుతున్న పొదుపు చర్యల వల్ల తమ ఆదాయాలు తగ్గిపోతున్నాయని పేర్కొంటూ తిరిగి ఉద్యమాన్ని ప్రారంభించారు. మీడియా పోలీసులతో కుమ్మక్కైందని నిరసనకారులు ఆరోపిస్తున్నారు.

రిమార్కులు..!

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది.

అభ్యర్థులకు వయోపరిమితి గండం..!

ప్రభుత్వ అనుమతి కోసం పంపిన 14 నోటిఫికేషన్ల విడుదలలో జాప్యం జరిగితే.. వేలాది మంది అభ్యర్థులకు వయోపరిమితి మించి పోయే ప్రమాదముంది. ఓసీ అభ్యర్థులకు 42 ఏళ్లలోపు వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించారు. పెండింగ్‌లో ఉన్న 1521 పోస్టుల నోటిఫికేషన్లలో ఆలస్యమైతే వేలాది మంది దరఖాస్తు చేసేందుకు అనర్హులవుతారు. ఏపీపీఎస్సీ పంపిన రిమార్కులను ప్రభుత్వం పరిశీలించి నోటిఫికేషన్ల విడుదలకు ఉత్తర్వులు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏపీపీఎస్సీ రిమార్కులు పంపిన పోస్టులివీ..

14 నోటిఫికేషన్లలోని 1521పోస్టులకు వివిధ కారణాలు, సిలబస్, ఇంటర్వ్యూల అంశాలపై సూచనలు, అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి ఏపీపీఎస్సీ రిమార్కులు పంపింది. ఇందులో జూనియర్ అసిస్టెంట్లు, రీసెర్చ్ ఆఫీసర్లు, లెజిస్లేటివ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు (గ్రేడ్-3), సెక్యూరిటీ ఆఫీసర్లు, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్లు తదితర విభాగాలలో పోస్టులున్నాయి. వాటన్నిటికీ ప్రభుత్వం ఆమోదముద్ర వేశాకే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు విడుదలవుతాయి.

పంచాయతీ కార్యదర్శులకు పోటెత్తిన దరఖాస్తులు

ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించబోయే పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-4 పోస్టులకు ఇప్పటివరకూ 50 వేలకుపైగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 19వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ పోస్టులకు పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశముంది. ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లలో పోస్టులు అతి తక్కువగా ఉన్నాయి. డీఎస్సీ పరీక్షల తరహాగా ఒక్కో అభ్యర్థి వారి అర్హతలకు అనుగుణంగా ఏపీపీఎస్సీలోనూ నాలుగైదు పోస్టులకు దరఖాస్తు చేసే అవకాశముంది. డీఎస్సీ కంటే ఏపీపీఎస్సీకి భారీగా దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నారు. ఏపీపీఎస్సీలో అన్ని కేటగిరీలకు తగినన్ని పోస్టులు లేనందున అభ్యర్థుల నుంచి అసంతృప్తులు వెల్లువెత్తుతున్నాయి.

కంప్యూటర్ టెస్ట్ క్వాలిఫై కావాల్సిందే..

ఏపీపీఎస్సీ నిర్వహించబోయే దాదాపు అన్ని పరీక్షలకూ కంప్యూటర్ టెస్ట్‌లో అర్హతను తప్పనిసరిగా కమిషన్ నిర్ణయించింది. గ్రూప్-1, గ్రూప్-2, పంచాయతీ సెక్రటరీ తదితర పోస్టులకు పోటీపడే వారంతా చివరలో కంప్యూటర్ పరీక్షలో నెగ్గాలి. 50 మార్కులకు నిర్వహించే కంప్యూటర్ టెస్టులో ఆయా కేటగిరీల వారీగా అభ్యర్థులు అర్హత మార్కులు సాధించాలి.

ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలతోపాటు కంప్యూటర్ టెస్టును అర్హతగా నిర్ణయించడంతో వారిపై మరింత భారం పడుతోంది. ఇప్పటివరకూ కంప్యూటర్‌పై అవగాహనలేని గిరిజన, గ్రామీణ ప్రాంత అభ్యర్థులు అసౌకర్యానికి గురవుతారు.

గిన్నిస్‌లో పోలవరం

(మొదటిపేజీ తరువాయి)



సీఎం చంద్రబాబు పరిశీలించనున్నారు. నవయుగ కంపెనీకి చెందిన నాలుగు వేల మంది కార్మికులు మూడు షిఫ్టులుగా...షిఫ్టుకి తొమ్మిది వందల మంది చొప్పున కాంక్రీట్ పనులు వేగవంతంగా చేస్తున్నారు. 76 మంది జలవనరుల శాఖ ఇంజనీర్ల ఆధ్వర్యంలో కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 15 వందల మంది జలవనరుల శాఖ అధికారులు, సిబ్బంది పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ చానల్‌లో 310 బ్లాకుల్లో.. బ్లాక్‌కి 100 క్యూబిక్ మీటర్ల చొప్పున కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. ఈ కాంక్రీట్ పనుల్లో జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక యంత్రాలు ఆరు టెలీ బెల్టులు, 80 సిమెంట్ మిక్సర్ యంత్రాలు, 7 క్రషర్లు, పది బ్లాచింగ్ ప్లాంట్ల నుంచి కాంక్రీట్ వేగవంతంగా సరఫరా అవుతుంది. ఒక్కో బ్లాచింగ్ ప్లాంట్ నుంచి గంటకు 1560 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ సరఫరా చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులో కాంక్రీట్ పనికి సరిపడా 50,000 క్యూబిక్ మీటర్ల సిమెంటును అందుబాటులో ఉంచారు.

ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు గిన్నిస్ బుక్ నిపుణులు రిషినాథ్ కాంక్రీట్ పనులు ప్రారంభించారు. గంటలోనే 1382 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు విజయవంతంగా పూర్తి చేశారు. అత్యంత వేగంగా పనిచేయడం ద్వారా ఆదివారం అర్ధరాత్రికే దుబాయిలో సృష్టించిన రికార్డును నవయుగ కంపెనీ అధిగమించిందని పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, పోలవరం ప్రాజెక్టు గౌరవ సలహాదారుడు రమేష్‌బాబు తెలిపారు. పనులు ప్రారంభించిన 10 గంటల్లో 13,692 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని జరిగిందని, మిగిలిన 14 గంటల్లో అనుకున్న లక్ష్యం సాధిస్తామని, 24 గంటల్లో 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని పూర్తవుతుందని శ్రీధర్ తెలిపారు. నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, జలవనరుల శాఖ అధికారులు, కాంక్రీట్ పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి గిన్నిస్ బుక్ అధికారుల చేతుల మీదుగా ప్రపంచ రికార్డు పత్రాన్ని చంద్రబాబు ఖచ్చితంగా తీసుకుంటారన్నారు. చంద్రబాబు పోలవరం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ కాటంనేని భాస్కర్ స్వయంగా సమీక్షిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సీఈవో ఆర్కే జైన్, సీఈ ఏకే ప్రధాన్, సభ్యులు ఆర్కే గుప్తా, ఇంజనీరింగ్ చీఫ్ ఎం వెంకటేశ్వరరావు, గేట్ల తయారీ నిపుణుడు కన్నయ్య నాయుడు, ఏబీ పాండ్యా, వైకే హోండా, సెంట్రల్ వాటర్ కమిషన్ సీఈ ఎస్ మున్నీలాల్, ఫ్రెంచ్ ఇంజనీర్ అనిల్ జైన్ పాల్గొన్నారు. దుబాయ్‌లో ఒక టవర్ నిర్మాణానికి 36 గంటల్లో 21,580 ఘనపు మీటర్ల(ఘ.మీ.) కాంక్రీట్ వేశారని, ఇప్పుడా రికార్డును అధిగమించేందుకు 24 గంటల్లోనే 30 వేల ఘ.మీ. కాంక్రీట్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు చెబుతున్నారు.

భారీ కాగిత పరిశ్రమ

(మొదటిపేజీ తరువాయి)

2018 ఫిబ్రవరిలో ఏపీపీ నిపుణులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయి రాష్ట్రంలో కాగిత పరిశ్రమను నెలకొల్పేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ముడి సరుకు దిగుమతి చేసుకోవడం, ఉత్పత్తి అయిన పేపర్‌ను ఎగుమతి చేసేందుకు నౌకాశ్రయం సమీపంలో 2,500 ఎకరాలను కేటాయించాలని కోరారు. రోజూ ఇక్కడ నుంచి సుమారు 30 వేల టన్నుల ప్యాకింగ్ పేపర్‌ను విదేశాలకు నౌకల ద్వారా ఎగుమతి చేయనున్నట్లు వివరించారు. దీంతో కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, మచిలీపట్నం రేవుల సమీపంలో అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రకాశంజిల్లా ఉలవపాడు మండలం రామాయపట్నం అయితే తమకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని ఏపీపీ ప్రతినిధులు స్పష్టం చేయడంతోపాటు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన సవివర ప్రాజెక్టు నివేదికను ఇటీవల సమర్పించారు. భూమిని సేకరించి ఏపీపీకి అందచేసే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కార్పొరేషన్ (ఏపీఐఐసీ)కు ముఖ్యమంత్రి అప్పగించారు. ఇప్పటి వరకూ సగం భూమి సేకరణ పూర్తయిందని, మిగిలిన భూమిని సేకరించాల్సి ఉన్నట్లు ఏపీఐఐసీ అధికారులు తెలిపారు. పరిశ్రమ ఏర్పాటుకు కావలసిన అన్ని రకాల అనుమతులు కేంద్రం నుంచి ఈ ఏడాది చివరి నాటికి రావచ్చన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందన్నారు. పరిశ్రమ వల్ల సుమారు 50 వేల మంది కలప చెట్లను పండించే రైతులకు మేలు చేకూరుతుందని తెలిపారు.

పట్టణాలకు దీటుగా గ్రామాలు

(మొదటిపేజీ తరువాయి)

పండించిన పంటను తింటే రోగాలు దూరమవుతాయన్నారు. ప్రపంచంలోనే అమరావతిని ఒక ఆరోగ్య రాష్ట్రంగా చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. బందరు పోర్టు వస్తే జిల్లా అభివృద్ధి చెంది భూముల విలువ ఇంకా పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో 63 ప్రాజెక్టుల పనులు చేపట్టామని, ఇందులో 17 ప్రాజెక్టులు పూర్తవ్వగా, ఆరు ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగిలిన ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వర్షపు నీటితో భూగర్భాన్ని జలాశయాలుగా మార్చడానికి పెద్ద ఎత్తున చెరువుల నిర్మాణం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, పంట కుంటలు, రిజర్వాయర్ల పూడిక తీయడం వంటి పనులు చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికీ స్మార్ట్ ఫోన్ నుంచి అన్ని పనులు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ముందుగా జన్మభూమి సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. పునాదిపాడు గ్రామ అభివృద్ధిపై ప్రదర్శించిన వీడియోను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన రైతులు, సాగునీటి సారథులు వరి కంకులతో ప్రత్యేకంగా తయారు చేసిన మాల, గుచ్ఛాన్ని సీఎంకు అందచేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ఎంపీ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్సీలు బచ్చుల అర్జునుడు, బాబూ రాజేంద్రప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఆప్కాబ్ చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, ముడా చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్, రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ, జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న తెలంగాణ కేబినెట్ విస్తరణ ?



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :

శాసనసభ సమావేశాల తేదీలు ఖరారవడంతో అందరి దృష్టి కేబినెట్ విస్తరణపై కేంద్రీకృతమైంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు దీనిపై విస్తృతంగా కసరత్తు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో మంత్రివర్గ విస్తరణ తేదీలను ప్రకటించనున్నారు. అయితే, ఈనెల 18 అనుకూలమని కేసీఆర్ భావిస్తోన్నట్టు తెలుస్తోంది. రెండు దఫాలుగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, తొలి విడతలో ఎనిమిది మందికి అవకాశం లభిస్తుందన్న ప్రచారం సాగుతోంది. ఖమ్మం మినహా మిగిలిన జిల్లాలకు ప్రాతినిధ్యం ఉంటుందనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఇక మంత్రివర్గంలోకి తీసుకునేవారిగా కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, పల్లా రాజేశ్వరరెడ్డి, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, రేఖానాయక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, తలసాని శ్రీనివాస్ యాదవ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్, ఆరూరి రమేశ్, వినయ్ భాస్కర్, నరేందర్‌రెడ్డి తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. ఈనెల 19న శాసనసభనుద్దేశించి గవర్నర్ ప్రసంగించనుండటంతో ఆ సమయానికి సభలో మంత్రులు తప్పనిసరిగా ఉండాలి. మర్నాడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం చేసే సమయంలోనూ మంత్రులు మాట్లాడాల్సి ఉంటుంది. శాసనసభ వ్యవహారాల మంత్రి కూడా ఉండాలి. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు ఈనెల 18 అనుకూలమని కేసీఆర్ భావిస్తోన్నట్టు తెలుస్తోంది. అదే రోజు స్పీకర్ ఎన్నిక; బీఎస్సీ సమావేశం జరుగుతాయని సమాచారం. ఈ నెల16న సాయంత్రం ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం రాజ్‌భవన్‌లో జరగనుంది. ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్‌ఖాన్‌ను ఖరారు చేశారు. ఈ నెల 16, 17, 18వ తేదీల్లో ఏదో ఒక రోజు మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఉన్నట్టు టీఆర్ఎస్ వర్గాల సమాచారం. అదే రోజే పార్లమెంటరీ కార్యదర్శులనూ నియమిస్తారని తెలుస్తోంది.

అతి వేగమే...

11 మంది దుర్మరణం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పుదుకొట్టై సమీపంలో కంటైనర్, వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ సహా 11 మంది దుర్మరణం చెందగా వారిలో 10 మంది అయ్యప్ప భక్తులు ఉన్నారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మృతులను తెలంగాణలోని మెదక్ జిల్లా నర్సాపూర్, హత్నూర మండలాల్లోని కాజీపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్న చింతకుంట, మంగాపూర్ గ్రామాలకు చెందిన మహేష్, నాగరాజు, కుమార్, శ్యామ్, ప్రవీణ్, కృష్ణసాయి, ఆంజనేయులుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో వ్యాన్‌లో 16 మంది ఉన్నట్లు తెలిసింది. ఈనెల 5న శబరిమలో అయ్యప్ప స్వామి, ఆ తర్వాత మధురైలో మీనాక్షి అమ్మవారిని దర్శించుకున్న వీరంతా సొంతూరికి బయలుదేరిన క్రమంలో పుదుకొట్టై వద్ద ప్రమాదానికి గురయ్యారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నాడా, లేక ఎదురుగా వస్తున్న వాహనాన్ని అంచనా వేయలేకపోయాడా.. అనేది తెలియాల్సి ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించనున్నారు. విషయం తెలుసుకున్న తమిళనాడు ఆరోగ్య శాఖమంత్రి.. మృతదేహాలను స్వస్థలాలకు పంపించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

పుదుకొట్టైకు తెలంగాణ బృందం :

సమాచారం అందిన వెంటనే తెలంగాణ అధికారులు తమిళనాడు అధికారులతో మాట్లాడారు. పుదుకొట్టై జిల్లా కలెక్టర్‌తో మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు నర్సాపూర్ నుంచి ప్రత్యేక అధికారుల బృందం పుదుకొట్టైకు బయలుదేరింది. మెదక్ జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడు మురళీ యాదవ్, తహసీల్దార్ భిక్షపతి, సీఐ సైదులుతో పాటు మృతుల కుటుంబాలకు చెందిన మరో ఇద్దరు విమానంలో చెన్నై వెళ్లినట్టు తెలిసింది.

కేసీఆర్, హరీశ్‌రావు దిగ్భ్రాంతి :

ఈ ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ ప్రమాదం దురదృష్టకరమని, భక్తులు ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. మృతదేహాలు స్వస్థలాలకు చేరేలా ఏర్పాట్లు చేయాలని పుదుకొట్టై కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. కాగా, ఏపీ ప్రతిపక్షనాయకుడు, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఒక ప్రకటనలో మృతులకు సంతాపం ప్రకటించారు.

పరిశోధనా సంస్థల్లో మహిళా సిబ్బంది పెరగాలి

మహిళా సైన్స్ కాంగ్రెస్‌లో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ



విశాలాంధ్ర-విశాఖసిటీ: దేశంలోని పరిశోధనా సంస్థల్లో పనిచేస్తున్న 2.8 లక్షల మందిలో మహిళలు కేవలం 14 శాతం మంది మాత్రమే ఉన్నారని ఈ పరిస్థితిలో మార్పురావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా విశాఖ వచ్చిన మంత్రి స్మృతి ఇరాని ముందుగా జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళా సైన్స్ కాంగ్రెస్‌లో ఎల్‌పీయూ ఛాన్సలర్ అశోక్ మిట్టల్, డాక్టర్ సమితా గుప్తాలు, డాక్టర్ శకుంతలాదాస్‌లు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా శాస్త్రవేత్తలు ప్రతిభా పాటవాలకు అద్దంపట్టేలా సదస్సు ఉందన్నారు. సైన్స్ ప్రపంచంలో మహిళలు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారన్నారు. సైంటిఫిక్ జర్నల్స్ లేదా అధ్యయన సమాచారం అంతా ఇంగ్లీష్‌లో ఉంటుందని, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి ఉపయుక్తంగా భారతీయ భాషల్లో ముద్రించేలా అసోసియేషన్ ముందుకు రావాలన్నారు. ఎల్‌పీయూలో 50 శాతం మహిళలు పనిచేయడం శుభపరిణామమన్నారు. మహిళలకు సైన్స్‌పై మరింతగా ఆసక్తి కలిగిలే సదస్సులు నిర్వహణ ఉండాలన్నారు. ఎనిమిదవ ఎడిషన్‌గా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అగ్రగామి మహిళా శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతమైన కేరళలో

ఉద్రిక్తతలు పెంచుతున్నారు

బీజేపీపై చంద్రబాబు ఫైర్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రశాంతమైన కేరళ రాష్ట్రంలో బీజేపీ ఉద్రిక్తతలు పెంచుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాంబులతో దాడులకు పాల్పడుతూ అల్లర్లు చేసి భయోత్పాతాన్ని సృష్టిస్తోందని ఆయన దుయ్యబట్టారు. జన్మభూమి ఐదవ రోజు ఆదివారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ బీజేపీ నాయకులు దేశంలో దుష్ట రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. అఖిలేష్, మాయావతి పొత్తు పెట్టుకుంటే మరుసటి రోజే సీబీఐ కేసులు పెట్టడం దారుణమ న్నారు. బీఎస్పీ, ఎస్పీ నేతలపై దాడులు చేయిస్తూ పద్ధతి లేని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ ప్రజల హక్కులను కాలరాస్తూ నిధులు ఇవ్వడం లేదని ఆయన ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ నేతలు పని చేయరని, పని చేయమంటే కేసులతో బెదిరింపు లకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. లాలూచీ రాజకీ యాలు చేస్తున్నప్పటికీ వాటిని అధిగమించి పనులు చేస్తున్నామన్నారు. 'ధర్మం మన వైపే ఉంది, అందుకే అన్నీ సానుకూల ఫలితాలు ఇస్తున్నాయి.. జాతీయంగా, అంతర్జాతీయంగా అవార్డులు వస్తున్నాయి' అని అన్నారు.

పండగకు అదనంగా మరో రోజు సెలవు

ఆదివారం కూడా జన్మభూమి కార్యక్రమంలో ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని, సంక్రాంతి పండగకు మరో రోజు అదనంగా సెలవు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. తిత్లీ తుపాను బాధితుల సేవల్లో చూపిన స్ఫూర్తే జన్మభూమి కార్యక్రమంలో కూడా చూపుతున్నారని ప్రశంసించారు. ప్రజల భాగస్వామ్యం నాలుగో రోజున బాగా పెరిగిందన్నారు. మండల కేంద్రాల్లో 7.18 లక్షలు, గ్రామాల్లో 25.46 లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు దాదాపు 5 లక్షల మంది పాల్గొన్నారన్నారు. పరిష్కార మార్గాలను అక్కడికక్కడే అన్వేషించాలని ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, నోడల్ అధికారులకు చంద్రబాబు సూచించారు.

విశ్వవిద్యాలయాల్లో రాజకీయ జోక్యంపై

గవర్నర్ సీరియస్!

- మంత్రి పట్టాల ప్రదానంపై ఫిర్యాదులు
- 9న ఏయూ స్నాతకోత్సవంపై సర్వత్రా ఆసక్తి

విశాలాంధ్ర-విశాఖసిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లోని వ్యవహారాల్లో కొన్నేళ్లుగా రాజకీయ నాయకుల జోక్యం పెరగడంపై మేధావులు, విద్యావేత్తలు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వర్శిటీల వీసీలతో గవర్నర్ ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి, ప్రతీ విశ్వవిద్యాలయానికి ఆకస్మిక తనిఖీలకు వస్తానని ఆయన చెప్పారు. గతేడాది నవంబర్‌లో రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ స్నాతకోత్సవానికి గవర్నర్ హాజరు కాలేకపోవడంతో ఆ వర్శిటీ వీసీ ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు ఛాన్సలర్ హోదాలో అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని నడిపించడంతో పాటు విద్యార్థులకు వివిధ డిగ్రీల పట్టాలు ప్రధానం చేశారు. ఇదే సమయంలో వేదికపై ఉన్న మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు కొంత మందికి పట్టాలు ప్రదానం చేశారు. మంత్రి కాన్వొకేషన్‌లో పట్టాలు ప్రధానం చేయడం వివాదాస్పదమైంది. దీంతో ఈ అంశాన్ని పలువురు గవర్నర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన సీరియస్ అయ్యారని తెలుస్తోంది. ఈ నెల 9న జరగనున్న ఆంధ్రవిశ్వవిద్యాలయం 85, 86వ స్నాతకోత్సవానికి తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఛాన్సలర్ హోదాలో హాజరు కానుండడం సర్వత్రా చర్చనీయాంశమయింది.



గతేడాది జరిగిన నన్నయ్య వర్శిటీ స్నాతకోత్సవంలో విద్యార్థికి పట్టా అందజేస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు (ఫైల్‌ఫోటో)

స్నాతకోత్సవ నిబంధనలు

విశ్వవిద్యాలయాల చట్టాలు, నిబంధనల ప్రకారం ఆయా వర్శిటీలలో కాన్వొకేషన్ నిర్వహించేటప్పుడు వేదికపై ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్, ముఖ్య అతిథి, వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్‌తో పాటు వర్శిటీ పాలకవర్గ సభ్యులు, సెనేట్ సభ్యులు, గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేసినట్లయితే స్వీకరించేవారు ఆసీనులవుతారు. స్నాతకోత్సవానికి ఛాన్సలర్ హాజరుకాలేనిపక్షంలో వైస్‌ఛాన్సలర్ అధ్యక్షత వహిస్తారు. ముఖ్యఅతిథికి అందజేసే గౌరవ డాక్టరేట్‌తో పాటు విద్యార్థులకు అందజేసే వివిధ పట్టాలు కూడా వారిద్దరిలో ఒకరు మాత్రమే అందజేయాలనే నిబంధన ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన తొలి కాన్వొకేషన్ ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరగగా, ఆ వేదికపై ఉన్న రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు ఒక అడుగు ముందుకేసి స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారంటూ విద్యావేత్తలు మండిపడుతున్నారు. చాలాఏళ్లుగా వర్శిటీలు పాటిస్తున్న గొప్ప సంప్రదాయాన్ని తుంగలో తొక్కి మంత్రి పట్టాలు ప్రదానం చేయడంపై వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గవర్నర్ చాలా సీరియస్‌గా తీసుకున్నారని, ఈ కారణంగానే ఆయన ఈ నెల 9న జరగనున్న ఏయూ కాన్వొకేషన్‌కు హాజరవుతున్నారని వారు వాఖ్యానిస్తున్నారు.

ఏయూ గౌరవ డాక్టరేట్ల జాబితా తిరస్కరణ

ఆంధ్రవిశ్వవిద్యాలయం గతంలో తన ప్రతీ స్నాతకోత్సవంలో సంగీత, సాహిత్య, నటనా, క్రీడారంగాలకు చెందిన ప్రముఖులకు క్రీడా, కళాప్రపూర్ణలు (గౌరవ డాక్టరేట్లు) ప్రదానం చేసేవారు. ప్రస్తుతం ముఖ్య అతిథికి ఇచ్చే గౌరవడాక్టరేట్‌కు మాత్రమే పరిమితం చేశారు. దీంతో ఆయా రంగాలకు చెందిన వారిలో నిరాశ నెలకొంది. ఈ ఏడాది కాన్వొకేషన్‌లో వర్శిటీ అధికారులు ఎంపికచేసిన జాబితాలోని పేర్లను గవర్నర్ తిరస్కరించి శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు పేర్లు సూచించడంటూ ఆదేశాలు ఇచ్చారని విద్యావర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. ఏటా అధికార పార్టీకి చెందిన కొంతమందికి గౌరవ డాక్టరేట్లకై సిఫార్సులు వస్తున్నాయని ఈ కారణంగానే గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేయడం లేదని వారు చెబుతున్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 8, 9 తేదీలలో రెండు రోజులపాటు జరుపతలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సీపీఐ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశ ఆర్థిక పరిస్థితి దారుణంగా క్షీణించిందన్నారు. దీని దుష్ప్రభావం కార్మికవర్గంపై పెద్ద ఎత్తున పడుతోందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తోందని, కనీస వేతనాలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మార్పు చేయడంలేదన్నారు. మరోవైపు కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందన్నారు. కార్మికవర్గానికే కాక దేశంలోని రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు నష్టం కలిగించే విధానాలను మోడీ ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఆత్మహత్యలు చేసుకొనే దుస్థితి నెలకొని ఉందన్నారు. దేశ ప్రజలకు నష్టం కలిగించే విధంగా పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, ప్రభుత్వ రంగ బ్యాంకులను నాశనం చేసేలా ఎఫ్ఆర్‌డీఐ చట్టం.. తదితర విధానాలను అవలంబిస్తోందని తెలిపారు. ఉద్యోగులకు నష్టం కలిగించే సీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తోందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేయడంలో భాగంగా 15మంది కోటీశ్వరులకు రూ.4.50 లక్షల కోట్లు బ్యాంకు రుణాలను మాఫీ చేసిందన్నారు. రాష్ట్రంలోనూ తెలుగుదేశం ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా పాలన సాగిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. 50 లక్షల మంది కార్మికులకు సంబంధించిన షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో ధరలకనుగుణంగా కనీసవేతనాలను పెంచకుండా, కొన్నింటిలో తగ్గిస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను జారీ చేసిందన్నారు. గతంలోనే టీడీపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా సవరించిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని పక్కదోవ పట్టించడమే కాకుండా అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకు నష్టం కలిగించే కార్మికచట్ట సవరణలను ఆపాలి, కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించాలి, ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలి, తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనే పలు డిమాండ్లతో జాతీయ కార్మిక సంఘాలు రెండ్రోజులు చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి మద్దతు తెలుపుతోందన్నారు. ఈ సమ్మెను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని సీపీఐ పిలుపునిస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు.

బాబు పాలన అవినీతిమయం : బాలశౌరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అవినీతి, అక్రమాలు పరాకాష్టకు చేరాయని వైసీపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ వల్లభనేని బాలశౌరి విమర్శించారు. విజయవాడలోని వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరానికి అనుమతులు తెచ్చి, శంకుస్థాపన చేశారని, రూ.5వేల కోట్లతో కాలువలు తవ్వించారని గుర్తుచేశారు. పోలవరానికి అవార్డులు వచ్చాయంటూ చంద్రబాబు పెద్దఎత్తున అసత్య ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరిట చంద్రబాబు, లోకేష్ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. అటు ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం ఇసుక, మట్టితో వేల కోట్ల రూపాయిలు దోచుకుంటున్నారని ఎండగట్టారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కేసును ఎన్ఐఏకు అప్పగిస్తే.. టీడీపీ నేతలు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు పరిపాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఆయన అధికారం కోల్పోవడం తథ్యమని చెప్పారు.

సాహితి



తరుదేవోభవ

తన వేళ్ళని ద్వేషించే చెట్టు
తారసపడలేదు ఇప్పటివరకూ నాకు
శిశిరఋతువులో విలపించే
వసంతఋతువులో ఆనందించే
దగ్గరగా మొలకెత్తిన గడ్డిని చూసి
పరిహాసం చేసే
లేక పక్కనే సొగసైన తీగని చూసి
ఊరకనే శతృత్వం పెంచుకునే
ఏ చెట్టూ నాకు ఇప్పటివరకూ ఎదురవలేదు
కోయిలపై ముగ్ధమయ్యే
కాకిపై కోపగించే
జాతిభేదం వల్ల
తన నీడలో పడుకున్న బాటసారిని
హత్య చేసే
ఏ వృక్షమూ నాకు
ఇప్పటివరకూ ఎదురవలేదు
నేను బాధలు పడి పడి
జనజీవితం యొక్క
చేదుని సహించి సహించి
ఓడిపోయిన వాడిని
ఓ తల్లి ధరిత్రీ!
మూసుకుపోతూన్న నా కళ్లు
పూర్తిగా మూసుకుపోయిన తరువాత
నన్ను చెట్టుగా పుట్టించు ఈసారి!

హిందీమూలం :
డా॥ కైలాశ్ వాజపేయీ
తెలుగు అనువాదం : పారనంది నిర్మల,
✆:0891-2504986

డా. అద్దేపల్లి సామాజిక చైతన్య కవిత్వాంతర్జ్వాల



'నాకు కవిత్వం జీవితం వేరువేరు కాదు, జీవితం నన్ను ఉక్కుగోళ్ళతో రక్కితే కారే నెత్తురు నా అక్షరాల్లో ప్రవహిస్తుంది. బతుకు నన్ను పోరాటానికి రెచ్చగొడితే రగిలే రవ్వలు నా అక్షరాల్లో మండిపడతై నాకు కవిత్వం నేను పీల్చే ఊపిరి నా బతుకులోని పోరాటం అంటూ ఆవేదన చెందిన డా. అద్దేపల్లి అన్న మాటలు 'మెరుపు పువ్వు' దీర్ఘకవితలో మనకు కనిపిస్తాయి. పై వాక్యాలు పరిశీలిస్తే ఆయనకు కవిత్వంపై ఉన్న నిబద్ధత, సమాజంపై ఆయన చెందిన ఆవేదన ఏమిటో విశదపడుతుంది.

డా. అద్దేపల్లి రామమోహనరావు కవి, విమర్శకుడు. కవిత్వారంభదశలో ప్రాచీన కవిత్వంపై ఉన్న ఆసక్తితో ఉమర్ ఖయ్యాం అరబ్బీ భాషలో రాసిన రుబాయిల అనువాద గ్రంథాన్ని 'మధుజ్వాల' అనే పేరుతో పద్య కావ్యంగా రాసినప్పటికీ, అనంతర వేదనామయ సామాజిక పరిస్థితులు డా. అద్దేపల్లిని పద్య కవిత్వం నుండి వచన కవిత్వంవైపు మళ్ళించాయి. కుందుర్తి ఆంజనేయులు, దేవరకొండ బాలగంగాధరతిలక్‌ల కవిత్వాన్ని డా. అద్దేపల్లి అమితంగా ప్రేమించేవారు. తిలక్ వచనకవితా శైలిలోని భావచిత్రాలకు, ప్రతీకలకు, ఆవేదనలకు, అలంకారాలకు ఆకర్షితుడయ్యాడు. వీరిద్దరూ డా. అద్దేపల్లి కవితాప్రస్థానంపై మంచి ప్రభావాన్ని చూపారు.

1965-66 సంవత్సరాల్లో వచన కవితలను రాయడం మొదలెట్టారు. అవి భారతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి మొదలైన ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. అవే 1970వ సం.లో 'అంతర్జ్వాల' అనే కవితా సంపుటిగా వచ్చింది. అంతర్జ్వాల నిండా సామాజిక అభ్యుదయమే! ఆ సంపుటి వెలువరించే నాటికి ఆయనకు మార్క్సిజం భావజాలం గురించి ఏమీ తెలియదు. కానీ సామాజిక వైరుధ్యాలంటే మార్క్సిజమే కదా! అంతర్జ్వాలలో చక్కని రచనా శిల్పం, ధ్వని ఉంది. తీవ్రమైన భావజాలంతోపాటు ప్రతీకాత్మకత, తీవ్రవేదన ఉంది. దీనిలో గతితార్కికతా, మార్క్సిజం సిద్ధాంతపరమైన విషయాలు ఏమీ లేకపోయినప్పటికీ ఆ రోజుల్లో మార్క్సిస్టులందరినీ ఎక్కువగా ఆకర్షించింది. అంతర్జ్వాలకు మంచి గుర్తింపు లభించింది.

డా. అద్దేపల్లి మాటల్లో చెప్పాలంటే 'అభ్యుదయ కవిత్వంలోని తీవ్రత, నిబద్ధత తగ్గిపోయిన తర్వాత స్తబ్దతను చీల్చుకుంటూ సామాజిక ప్రగతిశీల ఆవేశాన్ని వచన కవితల్లో పలికించిన అతి కొద్దిమంది కవుల్లో నేనొకణ్ణి, అంతర్జ్వాల కవితల్లో కడుపుమంట ఉందని, ఆ రోజుల్లో కొందరు పెద్దలు అన్నారు గానీ 'కడుపుమండి రాయడమే అభ్యుదయావేశం అవుతుంది. భావాల తీవ్రత మాట ఎలా ఉన్నా, మొదటి నుంచీ నాకు అభివ్యక్తిపై ప్రత్యేక శ్రద్ధ ఉంది. నేను హేతువాదినైనా, ప్రగతిశీలనైనా, సిద్ధాంత అవగాహన వల్లకాలేదు. నా జీవిత సంఘటనలే నన్ను అలా మలచినై. సిద్ధాంత అవగాహనతో అనుభవాల్ని సమ్మిళితం చెయ్యడం తర్వాతికాలంలో జరిగింది. పై వాక్యాలను జాగ్రత్తగా గమనిస్తే అద్దేపల్లి శైలిగానీ, భావాలుగానీ, అభివ్యక్తిగానీ ఎవరినీ అనుకరించినవి కావు. అన్నీ ఆయన జీవితానుభవానికి చేరువగా ఉన్నవే అన్న విషయం బోధపడుతుంది. ఒక కవి రాసిన కవిత్వాన్ని మనం పరిశీలిస్తున్నప్పుడు 'అనుశీలన' అంటాం. అద్దేపల్లి కవితా ప్రస్థానంలో తొలిమెట్టు ఈ 'అంతర్జ్వాల'. ఆయన హృదయాంతర్జ్వాలానుశీలనకు ముందు ఆయన కవిత్వంపై అనేక సాహితీ సభల్లో సందర్భానుసారంగా చెప్పిన కొన్ని వాక్యాలను స్మరించుకోవలసి ఉంది. 'అవినీతి అక్రమాలు జరిగినప్పుడు ఎదురుతిరిగి ఏ మాత్రం అధైర్యపడకుండా కవి తన కవితావేశాన్ని సమాజానికి చాటిచెప్పవలసిన అగత్యం ఎంతైనా ఉంది. కవిత్వాన్ని అంతర్గతానందం కోసమేకాక అనంత మానవాళి చైతన్యం కోసం కూడా కృషి చెయ్యాలి. సమాజం అంటే కవికి సమకాలీనంగా ఉన్న సమాజమే. వర్తమాన కాలమే ఆధునిక కవికి అత్యవసరం. అతని చూపు సదా దానిమీదే ఉండాలి' అన్నారు. అంతర్జ్వాలకు ఆరంభం పలుకుతూ డా. అద్దేపల్లి 'ఇది అంతర్జ్వాల! కవి హృదయంలో ఈ అక్రమలోకాన్ని చూడగా జ్వలించిన జ్వాల లేదా.. సమాజంలో నిరంతరం సమస్యలరూపంగా మండుతున్న జ్వాల. ఈ సమాజం యొక్క నిజస్థితిని పాఠకుడు గుండెపై హత్తుకోవాలి. కవి నిరసించే భావాల మీద పాఠకుడికీ నిరసన కలగాలి. సమాజ పునర్నిర్మాణానికవసరమైన కొన్ని భావాల ఉత్తేజన అతనిలో స్ఫురించాలి' అంటారు.

అంతర్జ్వాల కవితలో వేదనామయ జీవనవిధానంలో మనిషి వాస్తవిక స్థితి ఏమిటి? అనేది మనకు కళ్ళకు కట్టినట్టు సాక్షాత్కారం చేస్తాడు డా. అద్దేపల్లి. సమాజం పట్ల పెరిగిన అనుబంధం ఆత్మీయత అవగాహన లతో హేతుబద్ధమైన దృక్పథంతో, స్వార్థప్రయోజనాలకై సమాజాన్ని భ్రష్టుపట్టించే విధానాన్ని దహించే అంతర్జ్వాలగా అక్షరీకరించిన ప్రజాకవి డా. అద్దేపల్లి. అద్దేపల్లి వచన కవిత్వంలోని వస్తు వైవిధ్యం గురించో, శిల్ప చాతుర్యం గురించో, పదాల పోహళింపు గురించో అందరూ సాధారణంగా చెప్పే దృష్టికోణంలో కాదు మనం అద్దేపల్లిని దర్శించవలసినది. ఆయన తన పదాల వెనుక ఉన్న ఊపిరిని చైతన్య క్షేత్రాల్లో వదలిన విధానం, అనేక క్షోభలతో ప్రవహించే సమాజాన్ని మార్పుదిశగా నడిపించిన విధానం, వర్గ సంఘర్షణ, ఆర్థికదోపిడీ, వ్యాపార నాగరికత మొదలైన విషయాలపై సమాజానికి అవగాహన కలిగించిన విధానం మనం గమనించవలసి ఉంది. అద్దేపల్లి తన ఆవేశానికి ఆలోచనలను జోడించి సామాజిక ప్రగతిని రంగరించి తన తర్వాతితరం కవులకు మార్గదర్శకుడు ఎలా అయ్యాడో గమనించాలి.

'ఇది అంతర్జ్వాల/మనిషనే అగ్గిపుల్లని ఏ రోడ్డుమీద గీసినా భగ్గుమండే

సమాజ బాధామయ వాతావరణం/గుండెల్లో రాజుకుంటున్న మహాజ్వాల'

సమాజ పరిస్థితిని, మనిషి ఎదుర్కొంటున్న బాధామయ నేపథ్యం కవి గుండెల్లో ఓ అంతర్జ్వాలను రగిలించాయి. అయినా ఆయనకే ఎందుకీ ఆవేదన? అంటే సమాజ దుర్నీతులను ఎండగట్టడానికి జరుగుతున్న దోపిడీలను చూసి వ్యథచెంది వెలువరించిన ప్రకంపనలే భాష, భావం, శైలి సమ్మేళనంతో అద్దేపల్లి సమాజంపై వదలిన జ్వాలే 'అంతర్జ్వాల.'

'పెద్దపెద్ద ఇనప్పెట్టెల్లో/కన్నీళ్ళూ/చిన్నకార్ల టైర్ల అడుగున/గుండెకాయలూ

ఎయిర్ కండిషన్ మేడల పునాదుల్లో / స్వేదప్రవాహాలూ / బంగారు గుమ్మాలమీద కుంకుమ బొట్లలో

నెత్తురు జీరలూ / విందుభోజనాల విస్తళ్లకింద / ఆకలిచావులూ / తాగితూలే వాళ్ల అరికాళ్ల కింద

సన్నని అరుపులూ / రాజకీయాల కత్తి అంచుల పాదుగునా / నిండు బ్రతుకులూ'

ఆయనకు కనిపిస్తున్న సమాజాన్నీ, జీవితాలనూ పరిశీలించి కళ్లముందు వాస్తవ రూపాన్ని నిలబెట్టారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అవినీతి ప్రతి హృదిలో వ్యాపించి జ్వాలామయం చేస్తున్నాయి. అయితే ఎలా ఆర్పాలి ఈ మంటలను, ఎలా తరిమికొట్టాలి ఈ జ్వాలలను? మనందరి ఊపిరి బలంలోనుండి / కంఠనాదంలో గర్జించే సంకల్పంలో నుండి

గట్టిగా విసురుతున్న చేతులలోనుండి / ఒక మహా ఝంఝూమారుతాన్ని సృష్టించాలి

కన్నీటితో గట్టిపడ్డ హృదయంలోనుండి / ఒక పెను తుఫాను కనిపించాలి.

ప్రతి మనిషీ మానవత్వపు సంచలనమైనప్పుడు / ప్రతి మనిషీ వ్యక్తిత్వపు వికాసమైనప్పుడు

అనంతకోటి మానవుల మహాచైతన్య వేగానికి / ఆ మంటలారిపోకతప్పదు/ఈ గుండెలోపూలు వికసింపక తప్పదు.

'భయంకర వర్తమానం' అనే కవితలో వడ్డీ వ్యాపారస్తులు వడ్డీకి వడ్డీ వక్రవడ్డీ వేసి సామాన్య ప్రజల మెడకు ఎలా ఉరితాళ్ళయ్యారో కనిపిస్తుంది. 'భయంకరమైన వడ్డీలతో ఉరితాడు పేని / గొంతుచుట్టూ గట్టిగాబిగించి రక్తం కక్కిస్తూ

చావనివ్వక బతకనివ్వక / సాటిమనిషి నెత్తురు బొట్లని రూపాయలుగా మార్చుకునే

దుర్మార్గులైన వడ్డీ వ్యాపారులు కక్కించిన నెత్తురు / వీధివీధిలో నా అడుగుల్లో వెచ్చగా ఇంకిపోతుంటే...'

భూస్వాములు, బడా వ్యాపారస్తులు, వడ్డీ వ్యాపారులు వడ్డీలకు డబ్బులప్పులిచ్చి సామాన్యులను పీడించుకుని తినే ధోరణి కనిపిస్తుంది. రోజంతా కష్టించి పనిచేసినప్పటికీ వడ్డీ డబ్బులు కట్టలేక, అసలు ఎప్పటికీ తీరక ఆ వ్యాపారులకు జీవితాంతం తమ రక్తమాంసాలను ధార పోస్తూ శవాలుగా మారిపోతున్నారు. వారందరినీ సంఘటితం చేస్తూ ఇచ్చే ఆవేశపూరిత ఆవేదనామయ ఆదేశం ఏమిటంటే ... 'ఓ మిత్రుడా.... భవిష్యగధాలలో తలపగిలిన మనిషి వేసే జాలికేక / నా గుండెను పిండి వేస్తున్నది. భవిష్యద్భూతాన్ని నామరూపాలు లేక నశింప జెయ్యటానికి / భవిష్యన్మానవుని సంపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దడానికి / నీ హృదయరక్తాన్ని దానం చేస్తానని / నీ నరాల సత్తువ నా జోలెలో నింపుతాననీ నీ సర్వ చైతన్యాన్నీ నా వూపిరిలో నిండిస్తాననీ / నా ప్రియతమా మిత్రమా! నాకీక్షణమే వాగ్దానం చెయ్యి..' అని ప్రతి దగాపడ్డ మిత్రులను ఓదారుస్తూ సంఘటితం కమ్మని ఆదేశిస్తున్నాడు. వాగ్దానం చెయ్యమంటున్నాడు. ఇంకా ముగింపులో 'నీ వాగ్దానమందుకునే దాకా / నా కంఠనాళం నిర్భయంగా విచ్చుకోదు / నాగుండెకు కదలిక రాదు / ఈ అనంత సమస్యా పరిపీడిత భయంకర వర్తమాన కాలం మీద / నేను నిర్భయంగా ముందడుగు వేయలేను అంటాడు.

సామాజిక చైతన్యమే కవిత్వానికి వాహిక అని నమ్మే కవి డా. అద్దేపల్లి కవిత్వానికి వస్తు, రూపాలు ఏవేవి ఎన్నెన్ని పాళ్లలో కలిస్తే కవిత్వం రక్తికడుతుంది. కొన్నేళ్లపాటు జనంలో నిలుస్తుంది అనే విషయాలపై డా. అద్దేపల్లికి ఉన్న ఖచ్చితమైన అభిప్రాయాలను కొందరు ఎగతాళిగా మాట్లాడడం సహించని డా. అద్దేపల్లి 'గదిలో మేధావులు కూర్చుని/సంక్షోభం లోపలికి రాకుండా తలుపులు మూసుకుని/ కవితా స్వరూపాన్ని చర్చిస్తున్నారు/ సాహిత్యంలో సామాజిక స్పందన అవసరమా కాదా? అని' అంటూ నీరో చక్రవర్తుల వంటి పనికిమాలిన కవుల డొల్లతత్వం బయటపెట్టాడు.

సుమధురమైన స్వరంతో గేయాలను మన గుండెలకు తాకేట్టు విసురుతాడు. ఆ గేయం సమాజంలోని ఎన్నో గాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. నిరంతరం సమాజం గురించే ఆయన చింత. ఎనభై సంవత్సరాల సుదీర్ఘ యానం చేసిన ఆయన కలంఆగింది. ఆయన అంతర్జ్వాలా శకటాన్ని ఆనందంగా యువకవులు నడిపిస్తున్నారు. బోయీలుగా మోస్తున్నారు. అద్దేపల్లి అంతర్జ్వాలకు ఆలవాలమై నిలుస్తున్నారు.

ఈ సర్వత్ర వైషమ్య భాదిత ప్రపంచంలో అద్దేపల్లి శ్వాసరుద్ధుడు, క్షుదార్త అధివాస్తవికుడు. సామాజిక చరిత్ర గదిలో నేడు సామాజిక చైతన్యం తెరచిపెట్టిన అనంత పథాల వైకల్పిక ఎరల ఎదుట నిలబడి కూడా అచలితుడు. తన జాతి జనులు జీవితాల్లో పాడుకునే పాటల్లో పలికిన అపశృతులకి గుండెలను బాదుకుని గొంతెత్తిన నిరంతర జ్వలిత 'జ్వాల' కవి డా. అద్దేపల్లి.

భగవాన్ డా. అద్దేపల్లి ఆశయాన్ని గురించి మాట్లాడుతూ 'చీకటిపొరల్లో ఆత్మబలంతో అడుగుముందు కేసి కదిలిపోయే మనిషి కావాలంటాడు' అద్దేపల్లి. అడుగడుగునా ఎదురయ్యే కంచెల్నీ, సంకెళ్ళనీ, బంధాల్నీ, చెరసాలలనీ, గోడవలయాల్నీ ఛేదించుకుని దూసుకుపోయే మనిషి కావాలంటాడు. ఎంత నిరాశామయ వాతావరణంలో నైనా నమ్మకాలన్నీ నశించి సమాజమంతా కాల ధూమాల పొరలు గప్పినా, కాలానికి మనిషిమీద నమ్మకం నశించదని అద్దేపల్లి తన కవిత్వంలో వివరిస్తాడు. మనిషిని నమ్ముదామని, ఒక మనిషి పూనికతో వందల మంది జ్వలిస్తారని, సమాన మానవ వినూత్న సమాజాన్ని నిర్మించాలని అందర్నీ పిలుస్తాడు అంటూ వివరిస్తాడు. కవిత్వమే ఆయన జీవితం. జీవితమే కవిత్వం. యావజ్జీవితమూ సామాజిక సమస్యలే. సామాజిక చైతన్యమే, సామాజిక వికాసమే... కవిత్వ వస్తువులుగా శ్వాసించిన ప్రజాకవి డా. అద్దేపల్లి. ఆ కవిత్వం నిలిచినంతకాలం డా. అద్దేపల్లి సాహిత్య పుటల్లో చిరస్థాయిగా నిలుస్తాడనడంలో ఎటువంటి సందేహం లేదు.

(13.1.19-డా. అద్దేపల్లి రామమోహనరావు వర్ధంతి సందర్భంగా)

టేకుమళ్ళ వెంకటప్పయ్య,
పరిశోధక విద్యార్థి, ✆: 94904 00858

వివిన మూర్తికి పురస్కారం
కథా నిలయానికే సత్కారం



'పులిపంజా' గా ప్రసిద్ధగాంచిన పురిపండ అప్పలస్వామి పేరిట స్మారక సాహితీ పురస్కారం 2007 నుండి ప్రతి సంవత్సరం ఒక ప్రముఖ సాహితీవేత్తకు అభ్యుదయ రచయితల సంఘం (విశాఖ శాఖ) సన్మానిస్తూ బహుమతి ప్రదానం చేస్తోంది. ఆ ప్రణాళికలో భాగంగా 2018కి ప్రముఖ రచయిత, కథానిలయం ట్రస్టీ బోర్డుమెంబరు వివిన మూర్తిని ఎంపికచేసి 29డిసెంబరు-2018న విశాఖ పౌరగ్రంథాలయంలో, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం, జన సహకార సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా పురస్కార సభ జరిగింది.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, ఆచార్య ఇక్బాల్ చేతుల మీదుగా అనేక సాహితీ మిత్రుల సమక్షంలో వివిన మూర్తి ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

సభ అధ్యక్షత వహించిన ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ నాడు మూడు భాషల్లోను సాహిత్యమనే వాదానికి ఊపిరి పోసిన వ్యక్తి పురిపండ పురస్కారం వివిన మూర్తికి లభించడం ఎంతో అభినందనీయంగా భావిస్తున్నాను అన్నారు. వివిన మూర్తి కథలు, నవలలు సమీక్షిస్తూ కొత్తతరం సాహితీపరులకు గొప్ప ఉపశమనాన్ని కల్పిస్తాయని, వైవిధ్యభరితమైన కథా వస్తువులతో కథలు రాయడం వీరి ప్రత్యేకత అని ఆచార్య అయ్యగారి సీతారత్నం తన ప్రసంగంలో పేర్కొన్నారు. కాళీపట్నం సుబ్బారావు మాట్లాడుతూ వివినమూర్తి కథానిలయానికి చేస్తున్న సేవలు మాటలతో చెప్పలేనిది. కారా మాస్టారుకు కుడిభుజం లాంటి వారని ప్రశంసించారు.

కథానిలయం నిర్వహణ భారాన్ని భుజాలకు ఎత్తుకున్న వివినమూర్తి ట్రస్టు సభ్యులుగా ఉన్నారు. కాళీపట్నం రామారావు చేసిన కృషి జన బాహుళ్యానికి సుపరిచితం. మొత్తం కథానిలయాన్ని ప్రత్యేక తరహా రిఫెరెన్స్ కేంద్రంగా రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే కొన్ని వేల కథల వివరాలన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తమైనది. ప్రత్యేక వెబ్‌సైట్‌తో కథలను మైక్రోఫిల్ములు, సీడీ రూపంలో భద్రపరిచే ప్రక్రియ జరుగుతూనే ఉంది. నిత్యం అనేక పత్రికల నుంచి అమూల్యమైన కథలను సేకరించి, భద్రపరిచి కథాభిమానుల ముంగిట చేర్చుతున్నారు.

గత దశాబ్దాల కాలంగా తెలుగు సమాజం అనేక మార్పులకు లోనవుతూనే ఉంది. ఆ సామాజిక పరిణామాలను కథా సాహిత్యం చక్కగా విశ్లేషిస్తూనే ఉంది. 'దర్గామిట్టా కథలు' భజంత్రీ కథలు, మల్లెల గొడుగు వంటి కథలన్నీ ఆయా సామాజిక వర్గాల జీవన దృశ్యాలు. అలాగే ప్రళయ కావేరి, మా పసలపూడి కథలు వంటివి ఆయా ప్రాంతాలకు సంబంధించినవి. మారుమూల ప్రాంతాలు, వెనుకబడిన వర్గాల ఆవేదనలు, ఆకాంక్షలు వీటిలో ప్రతిబింబించాయి. అవన్నీ కథా నిలయంలో సంరక్షింపబడ్డాయి. వివిన మూర్తి మాట్లాడుతూ 'పరిపూర్ణమైన మార్పు పట్ల దృష్టి ఉన్నప్పుడే సామాజిక సంస్కరణలకు చైతన్యానికి దోహదపడే కథలు వస్తాయి' అన్నారు. జరుగుతున్న అన్యాయాల పట్ల ఆగ్రహంతోకొన్ని కథలు రచయితలు రాస్తున్నారు. చాలదు. ఇంకా మార్పురావాలి. పాఠకుల్లో చైతన్యాన్ని పెంచే నవలలు పరిమితంగా వస్తున్నాయి. కమర్షియల్ నవలలు తగ్గిపోయాయి. దళిత స్పృహ కలిగిన సాహిత్యం మాత్రం బాగానే వస్తోంది. సమాజాన్ని ప్రతిబింబించే సాహిత్యం ఇంకా బాగా రావాలి. ఒక వాదానికి పరిమితమైతే కొంతవరకు లక్ష్యానికి దూరమవుతుందని భావించాలి.

తెలుగు సాహిత్యంలో ప్రధానంగా శిల్పం కన్నా వస్తువు ముఖ్యం అని అందరూ అంగీకరించాలి. అయితే శిల్ప చాతుర్యంతో కళాత్మకంగా చెప్పడంపై శ్రద్ధ వహించలేదన్నది వాస్తవం. సంఖ్యాపరంగా కథలు తగ్గలేదు. సాంకేతిక సామర్థ్యం వల్ల కథలు మరింత ఎక్కువమందికి చేరుతున్నాయి. ఇంటర్నెట్ పత్రికల్లో కథలు సంఖ్య ఎక్కువగా కనిపించడం ఆహ్వానించతగినదే.

కథా నిలయం ఏడాదికేడాది అభివృద్ధి చెందుతూనే ఉంది. ఆర్థిక సహాయం అంతంత మాత్రమే. కాళీపట్నం రామారావు కథా నిలయానికి కర్త, కర్మ, క్రియ అన్నీ తానే అయి ఇప్పటి వరకు నడిపిస్తూనే ఉన్నారు. అయితే విశ్రాంతి తీసుకునే వయసు మీద పడింది. ఆ పరిస్థితిలో వివిన మూర్తి తన భుజ స్కంధాలపై ఎత్తుకుని, తన కుటుంబ బాధ్యతల్ని పక్కనపెడుతూ ఆరునెలలు బెంగుళూరు, ఆరునెలలు శ్రీకాకుళం కథానిలయంలో సేవకు కంకణం కట్టుకున్నారు.

"నేను పడమటి పొద్దునున్నాను' అని కారా మాస్టారు నిస్సహాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేసినప్పుడు, అభయ హస్తం ఇచ్చినట్లు 'నేనున్నాను' అంటూ వివిన మూర్తి తన సంపూర్ణ మద్దతు పలకడమే గొప్ప వెసులుబాటుగా, కథానిలయానికి మరో పాతికేళ్ళు, వెనక్కు తిరిగి చూడనవసరం లేనంత భరోసా, వివిన మూర్తితో కుదుటపడింది. కథా నిలయానికి గొప్ప అండ దొరికింది.

ఇటువంటి గొప్ప సమయంలో అరసం పురిపండ సాహితీ పురస్కారం వివిన మూర్తికి అందజేయడంతో కథా నిలయానికే గౌరవం దక్కినట్లయిందని చెప్పక తప్పదు. ఆ ఆనందంతో సభ హర్షధ్వానాలతో మిన్నుముట్టింది.

-అడపా రామకృష్ణ,
✆:9505269091

'నీలమొక్కటి చాలు' సుగమ్‌బాబు కవితకు దర్పణం

"ఇరవైఏళ్ళ క్రింద 'రెక్కలు' అనే లఘుకవితా ప్రక్రియని సృష్టించాడు. దానికొకస్థానం, ప్రాచుర్యం కల్పించాడు. భిన్న లఘు కవితా ప్రక్రియల్లో రెక్కలు విశిష్టంగా ఉండటానికి అతని చూపు, రూపం పట్ల అతనికున్న శ్రద్ధ, పట్టింపు కారణం. అంతేగాకుండా జీవన వ్యవసాయం నుంచి చేదుకొన్న తాత్త్విక అనుభవ పరంపర ఉన్నది. ఇటీవల 'రెక్కలు' అన్ని సంపుటాలు కలిపి సమగ్ర కవితా సంపుటం తెచ్చాడు అన్నారు శివారెడ్డి గారు. స్వర్ణవిద్య పీఠికలో వీరంతకు ముందు 'సుదీర్ఘ కవితా జీవితం' లో 'సూరీడు' పాటలు రాశారు. లెనిన్ ఆత్మకథకు కావ్యరూపం ఇచ్చారు. ఇంతేగాక పైగంబర కవితకు సారధి. సినీ ప్రపంచంలో అడుగుపెట్టారు. జర్నలిజంలోకి వచ్చి చివరకు కవితామార్గం వైపుకు నడిచారు.

చాలాకాలం తరువాత మనసు వచన కవిత్వంపై పడింది. 'నీలమొక్కటి చాలు' అను కవితా సంపుటి తెచ్చారు. కవి చెప్పదలచిన భావాన్ని సుడిగుండంల్లా త్రిప్పక, సూటిగానే చెప్పారు. ఆకుపచ్చని ఊహలు జోడించడం, పదాన్ని జరీతల పొగాలా ధరించటం, ప్రగతిపథగామియై తెలుగు కవితకు పరిమళాలు అద్దారు. 'ఎవరికి వారు కరక్టే/ ఎందుక్కాదు?/ మా ఆవిడ కరక్టే/ మా పిల్లలు కరక్టే/ నేనూ కరక్టే/

ఒక మాట అనటానికి నిండైన ఆత్మవిశ్వాసం ఉండాలి. మానవులకు రెండు రకములైన పరిజ్ఞానములు అవసరము. ఒకటి ఇహలోకము, రెండవది పరలోక పరిజ్ఞానమును జీవిత పరమావధి అంటారు. ఇందులో వ్యక్తిగతంగా చెప్పాలంటే కరక్టే. టాలాటోలీగా చెప్పేవాడి మాటలు కరక్టు అనటానికి అవకాశం లేదు. మన దృష్టికి కనిపించేది సత్యమే. ఈ సత్యాన్ని ఆచరించి చూపించినపుడే సత్యం యొక్క పరమార్థం అవగాహనవుతుంది. ఇదొక జీవన సత్య గీతిక.

'ఎందుకబ్బా/ అంతగా తవ్వుకోవడం చుట్టూ గుంట చేసికోవడం/ అందులో దిగబడటం/ మామూలే తప్పదు. ప్రత్యేక హోదాను పురస్కరించిన వచన గీతం. తవ్వకం మొదలైనప్పట్నుంచి/ వింటూనే ఉన్నా/ రాళ్ళు తగిలే శబ్దమే/ ఖణేల్.. ఖణేల్..ఖణేల్/ బుజ్జగింపు మాటలు ఎక్కువయ్యాయి. ప్రత్యేక హోదా కంటే మించిన నిధులిస్తామంటే అంగీ కరించిన మన ముఖ్యమంత్రి సంతోషించారు. తీరాచూస్తే పైన పటారం, లోన లొటారం అని తేలిపోయింది. ఇప్పుడన్ని పార్టీలు ప్రత్యేకహోదా నినాదం ఎక్కువ య్యింది. ఈ వాస్తవాన్ని వామపక్షాలు ముఖ్యంగా సీపీఐ ముందుగానే గుర్తించి ఉద్యమబాట పట్టింది. 'బండరాళ్ళు/ నీటి ఊటలవుతాయా! అని కవి ప్రశ్నిస్తున్నారు. దేశ అధికారపార్టీ అరచేతిలో వైకుంఠం చూపిస్తోంది.

'నోరు తెరచి ముద్ద ఎత్తినపుడల్లా/ రైతన్నని/ బట్టలు తొడిగినప్పుడల్లా/ నేతన్నని/ స్మరించుకోవాలా?! అన్నీ డబ్బిచ్చి కొనుక్కున్నవే కదా!రైతు పంట పండించి నాలుగు మెతుకులు నోటికందించే వాడు. కాని నేడు పంటలు సరిగా పండక చేతిలో చిల్లిగవ్వ లేకుండా సతమతమై పోతున్నాడు. భూకామందులు అప్పులు తీర్చమని అవాకులు, చెవాకులు పేలుతున్నారు. ప్రభుత్వ రుణమాఫీ తనకు చేరటం లేదు. ఉన్న ప్రాణం హారతి కర్పూరంలా హరించుకొని పోతూంది. నేతన్న జీవితం సరేసరి. ఇంట్లో ఉన్న వారందరూ శ్రమించినా కడుపుకాలుతూనే ఉంటుంది.

'వారియర్ పొయెట్' కె.శివారెడ్డిగారు, సుగమ్‌బాబు వారిని గురువుగా భావించారు. వారి రూపాన్ని గీతంలో అమర్చారు. 'అతనితో కూచున్నా నడుస్తున్నా/ మాట్లాడుతున్నా నాకు/ యుద్ధభూమిలో ఉన్నట్టుంటుంది./ నెత్తురోడుతున్న పచ్చి గాయాల సైనికుడితో జీవితం పంచుకొన్నట్టే ఉంటుంది. శివారెడ్డిగారికి యుద్ధం అంటే అనుకూలం. ఆయన భావాలు సైనికుల ధైర్యసాహసాలు. నూతనత్వం కావాలంటారు. మానవతా విలువలను పాటిస్తూ ఆశలు నిరాశ చేసికోకుండా ముందడుగు వేయటమే వారి పరమార్థం. ఆయన కవిత/ కళ్ళు తిరిగే ఖడ్గ చలనం/ అతని కవిత్వం ప్రాక్పశ్చిమ తరాల్ని ముడివేసిన/ నవ్య మానవేతిహాసం/

శివారెడ్డిగారు కవితా కార్యక్రమంలో విరామమెరుగరు. ఆయన మాటలు అంతరాంతరాల్లో దాగిఉన్న అదృశ్య శక్తిని గమనించి, పదిమందికి తన కవితల ద్వారా విశ్లేషించటం వారి కవితోద్దేశం. అతనిసహనం/భుజాన వేలాడే/ అమ్ముల పొదిలా ఉంటుంది.శివారెడ్డిగారు భుజాన వ్రేలాడే సంచి ఉంటుంది. దానినే సుగమ్‌బాబు అంబులపొదిలా ఉంటుందని ఉపమించారు. కవిగారు గురుదక్షిణగా ఒకగీతాన్ని వారికి ఇచ్చారు.

"2002 నుంచి నేను పదిహేనేళ్ళ కాలం నా రెక్కల ప్రక్రియను అలంకరించడంలో గడిపాను. తెలుగు సాహిత్యానికి ఒక అద్భుతమైన ఆభరణంగా రెక్కల ప్రక్రియను అంకితం చేశాను. ఆ ఖ్యాతి నాకు గొప్ప సంతృప్తిని ఇచ్చింది." అన్నారు సుగమ్‌బాబు 'చత్తే చత్తే' లో. సుగమ్‌బాబు నిండైన కవితా మూర్తి. నిబద్ధత కలిగిన రచయిత. ఈనాడు కోకొల్లలుగా వచన కవితలు వస్తున్నాయి. అందులో కొన్ని మఖలో పుట్టి పుబ్బలో మాయమవుతున్నాయి. కాని 'నీలమొక్కటి చాలు' కవితా సంపుటి తెలుగునేలలో సంచరిస్తూనే ఉంటుంది. రెక్కలను బిగియకట్టక స్వేచ్ఛగా విహరించటానికి మార్గాన్ని సుగమం చేశారు. 'నీలమొక్కటి చాలు' వారి భావనా సామ్రాజ్యానికి ప్రతీక.

-గెల్లి రామమోహనరావు
✆: 0863-2357514



నీలమొక్కటి చాలు (కవిత్వం)
రచన: యం.కె.సుగమ్‌బాబు,
పేజీలు: 92, వెల: రూ॥100/-,
ప్రతులకు: యం.కె.సుగమ్‌బాబు,
502 సాయితేజ ఎన్‌క్లేవ్,
వెంకట్రామనగరు, సురారాం,
కుతుబుల్లాపూరు మండలం- హైద్రాబాదు.

విశాలాంధ్ర బతుకు The Life
సోమవారం
07 జనవరి 2019



పండగ పావడాలు!

పండగ అంటేనే పట్టు గుర్తుకొస్తుంది...మరి పెద్ద పండగ గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది. వీలైనంతవరకూ పట్టు బట్టలకే ప్రాధాన్యతనిస్తారు. అందులోనూ చిన్నారులకైతే మరీనూ. పిల్లలు అందునా ఆడపిల్లలు పట్టు బట్టల్లో మెరిసిపోతూ ఇల్లంతా కలతిరుగుతుంటే పండగ అంతా వారి మోముల్లోనే కనిపిస్తుంది. సంప్రదాయ పట్టుకి ఆధునిక బ్లౌజ్ లేటెస్ట్ ట్రెండ్. ఆ ట్రెండ్‌కి అనుగుణంగా వచ్చినవే ఈ పట్టు పావడాలు...పండగ పావడాలు. ఎదిగే పిల్లలకు ఈ పట్టు పావడాలు భలే నిండుగా ఉన్నాయి కదూ!

గృహవైద్యం

వాతావరణ కాలుష్యంవల్లనైతేనేమి, పండించే పంటల్లో ఎరువులు అధికంగా వాడటం వల్లనైతేనేమి ఇటీవలి కాలంలో ప్రతిఒక్కరూ ఏదోఒక అనారోగ్యానికి గురవుతూనే ఉన్నారు. దీర్ఘరోగాల సంగతి అటుంచితే ప్రతి చిన్న రుగ్మతకి మెడికల్ షాపుకు వెళ్లి బిళ్లలు కొని తెచ్చుకుని వాడటం లేదా డాక్టరు దగ్గరకు వెళుతుండటం చూస్తుంటాము. అంతగా అవసరం లేని ఆరోగ్య సమస్యలకు కూడా ఇలా చేయడం అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. చిన్నచిన్న అనారోగ్యాలకు ఇంట్లో లభించే వస్తువులతోనే నయం చేసుకోవచ్చు. సాధారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలను నయం చేసుకునేందుకు కొన్ని వస్తువులను సిఫారసు చేస్తారు. వీటిని పాటించడం ద్వారా ఆరోగ్యం పొంది ఆనందంగా ఉండవచ్చు.

చర్మవ్యాధి నిర్మూలనకు..



చర్మవ్యాధి (ఎగ్జిమా) కలిగినప్పుడు ఎక్కడయితే దురదలు వస్తాయో అక్కడ ఆలివ్ ఆయిల్ రాయాలి. ఈ నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎగ్జిమాతో వాపు, మంట తగ్గిస్తాయి. చర్మం చిట్లడం, గోధుమవన్నె మచ్చలు ఏర్పడటం జరుగుతుంటాయి. ఆలివ్ ఆయిల్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వీటిని నివారించడం లేదా దెబ్బతిన్న ప్రాంతాన్ని నయం చేస్తాయి. చర్మంపైన ఒక చదరపు అంగుళం ప్రాంతంలో ఒక స్పూను ఆయిల్ బాగా రుద్దాలి. దీనివల్ల చర్మం పాడవకుండా ఉంటుంది.

చర్మం మీద మచ్చలు లేదా మరేవిధంగానైనా చర్మం దెబ్బతిన్న తీవ్రమైన కేసులు ఉన్నట్లయితే ఆయిల్ మసాజ్ చేసి, చర్మంపైన ప్లాస్టిక్ కవరు కట్టి, రాత్రంతా ఉంచాలి. దీనివల్ల చర్మంలోకి ఆయిల్ ఇంకుతుంది. స్వస్థత చేకూరడానికి ఓట్‌మీల్ వాడాలనుకుంటే గోరువెచ్చని నీటిలో రెండు కప్పులు కొల్లాయిడల్ (ద్రావణాలు కలిపిన) ఓట్‌మీల్‌ను కలిపి చక్కగా స్నానం చేయాలి. అలాగే సింథటిక్స్ లేదా దురదలు కలిగించే దుస్తులు ధరించడం చేయరాదు. అలాగే విటమిన్ బి6 లభించే ఆహారాన్ని తీసుకోవాలి.

దుర్వాసన పోవాలంటే



యోగర్ట్‌లో సజీవ బ్యాక్టీరియా దుర్వాసన కలిగించే బ్యాక్టీరియాను అణచివేయడం వల్ల దుర్వాసన తగ్గిపోతుంది. యోగర్ట్‌లో ఉండే 'మంచి' జీవులు, చెడు బ్యాక్టీరియాను బయటకి నెట్టివేస్తాయని పరిశోధకులు విశ్వసిస్తున్నారు.

చెడు బ్యాక్టీరియా శ్వాసలో అనారోగ్యకర వాతావరణం వృద్ధి చెందడానికి దోహదం చేస్తుంది. మంచి బ్యాక్టీరియా ఈ వాతావరణంలో రూపుమాపేలా చేస్తుంది.

పాదాల రక్షణకు



పాదాలు నొప్పిగా ఉన్నట్లయితే ఉపశమనం కలగడానికి టెన్నిస్‌బాల్ లేదా గోల్ఫ్‌బాల్‌ను ఉపయోగించాలి. ముందుగా చెప్పులు లేదా బూట్లు వేసుకోకుండా బాల్ తీసుకుని దానిపైన కాలు ఉంచి బాగా అటూ ఇటూ తిప్పాలి. తర్వాత పాదం చల్లబడటానికి నీరు గడ్డకట్టిన బాటిల్‌ను తీసుకుని దానిపైన పాదం ఉంచి అటూ ఇటూ గుండ్రంగా తిప్పాలి.


లేదా వేడినీటిని బాటిల్‌లో నింపి, పాదాలు దానిపైన ఉంచి తిప్పాలి. పాదాలు నుండి వచ్చే వాసన భరించలేక ఎవరైనా తీవ్ర అసౌకర్యానికి గురి కావచ్చు. లేదా దూరంగా వెళ్లిపోవచ్చు. అలా జరగకుండా ఉండాలంటే ఓడ్కాలో ముంచిన గుడ్డతో పాదాలను శుభ్రంగా తుడుచుకోవాలి. అప్పుడు చెడువాసన రాదు. రుగ్మత నయమవుతుంది.

ఓడ్కాలో ఆల్కహాల్ ఉంటుంది. అది యాంటీ సెప్టిక్‌గా పనిచేసి చెడువాసన కలిగించే ఫంగస్‌ను, బ్యాక్టీరియాను నిర్మూలిస్తుంది. దీనివల్ల సమస్య తేలికగా పరిష్కారం అవుతుంది.

ఎక్కిళ్లు ఆగిపోవాలంటే

తక్షణం ఎక్కిళ్ల నుండి ఉపశమనం కలగాలంటే ఒక స్పూను పంచదార తినాలి. పంచదార తిన్నవెంటనే ఎక్కిళ్లు ఆగిపోతాయని నిపుణులు సూచిస్తున్నారు. పంచదార తినడంవల్ల నరాల వ్యవస్థ వెంట ఉండే కండరాలు సడలు తాయని ఇలా చేయకపోతే డయాఫ్రంలో ఉండే కండరాలు ముడుచుకుపోయి ఎక్కిళ్లు వస్తాయని విశ్వసిస్తున్నారు. అలాగే కొద్దిగా అల్లం ముక్క నమిలి చప్పరించినా, పైనాపిల్ జ్యూస్ తాగినా ఎక్కిళ్లు ఆగుతాయి.

రక్తపోటు తగ్గాలంటే



అధిక రక్తపోటు తగ్గడానికి ఒక్కసారి పొట్టనిండా తినకుండా పలుమార్లు తగినంత మోతాదులో ఆహారం తినాలి. అయితే అంతకంటే తేలికైన విధానం సంగీతం వినడం. రోజు కు ఇష్టమయిన సంగీతాన్ని 30 నిముషాలపాటు వినడంవల్ల అధిక రక్తపోటు తగ్గుతుందని ఓ పరిశోధనలో తేలింది.

బి.పి.కోసం మందులు వాడేవాళ్లు నెమ్మదిగా శ్వాస పీలుస్తూ సంగీతం వినడంవల్ల కూడా రక్తపోటు బాగా తగ్గిందని పరిశోధకులు గమనించారు.

వారంరోజులపాటు ఇలా క్రమంతప్పకుండా చేసినవారిలో సిస్టోలక్ స్థాయి సగటున 3.2 పాయింట్లు తగ్గాయని, నెల తర్వాత అయితే రీడింగ్స్ 4.4 పాయింట్లు తగ్గాయని పరిశోధకులు వెల్లడించారు.

దంతాల శుభ్రతకు

దంతాలు పచ్చగా ఉన్నట్లయితే బ్రష్‌లాగ పనిచేసే పండ్లు, కాయగూరలు తినాలి. నమిలి తినేవాటివల్ల దంతాలమీదగల పచ్చదనం తగ్గిపోతుంది. పండ్లు, కూరగాయలు దంతాలను సహజసిద్ధంగా శుభ్రం చేస్తాయి. దీనివల్ల ఎనామిల్ దెబ్బతినదు. దంతాలపైన గారవలె పట్టిన మురికి కూడా వదిలిపోతుంది. యాపిల్స్ తినడంవల్ల అందులోగల మాలిక్ యాసిడ్ మురికిని వదిలిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయల వల్ల దంతాలు శుభ్రం కావడమే కాదు, ఆరోగ్యంగా కూడా ఉంటాయి.

మగవారి మతిమరుపు



వయసుతోపాటు ఇబ్బందులొస్తుంటాయి. అందులో మతిమరుపు ఒకటి. అయితే ఇప్పుడు ఆయుర్దాయం పెరిగింది. గతంలో ఉన్న సరాసరి ఆయుర్దాయం కన్నా ఇప్పుడు ఐదు నుండి పదేళ్లు అధికంగా జీవిస్తున్నారు. కాని మెదడుకు సంబంధించిన ఇబ్బందులు త్వరగానే వస్తున్నాయి. వీటిలో ముఖ్యమైనది మతిమరుపు. మనుషుల ముఖాలు, పేర్లు గుర్తురాకపోవడం, కొన్ని ముఖ్యమైన సంఘటనలు మరిచిపోవడం జరుగుతుంది. ఇటువంటి సమస్య గతంలో ఆడవాళ్లలో అధికం అని అనుకునేవారు. కాని ఇప్పుడు మతిమరుపు ఇబ్బంది మగవారిలోనే అధికమని తేలింది. సాధారణంగా మతిమరుపు ఒక వయసు తర్వాత వచ్చి తీరుతుంది. కాని ఇప్పుడు ముందే రావడంవల్ల సామాజికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సరాసరిన ప్రతి 1000 మందిలో 64 మందికి మతిమరుపు వస్తుండగా, అందులో పురుషులు ప్రతి 1000 మందిలో 72 మంది, స్త్రీలు 57 మంది ఉండటం గమనించి మతిమరుపు పురుషుల ఇబ్బందని నిర్ధారించారు.

ఆదుర్దా తగ్గించే పచ్చదనం

ఏ విషయంలోనైనా అనవసరపు ఆదుర్దా పడు తున్నారా ! అందుకు మందు మన పరిసరాల్లోనే ఉంది. చుట్టూ పచ్చదనంఉంటే ఆదుర్దా ఇట్టే తగ్గిపో తుంది. ఇటీవలి కాలంలో యువతలో తమ ఉద్యోగం, ఉపాధి భద్రతమీద భయాందోళనలు అధికమ య్యాయి. అయితే ఆ ఆదుర్దా గ్రామీణ ప్రాంతంలో పెరిగిన విద్యార్థుల్లో తక్కువగా, పట్టణాలలో పెరిగిన వారిలో ఎక్కువగా, నగర జీవితంలో పెరిగినవారిలో మరింత అధికంగా ఉండటం గమనించారు. తర చుగా ప్రశాంత వాతావరణంలోకి వెళ్లి రావడమే గ్రామీణ ప్రాంతం వారికి ఆదుర్దా లేకపోవడానికి కార ణమని తేల్చారు. ఆఫీసుల్లో పచ్చదనానికి ప్రాధాన్యత నిచ్చి, గార్డెన్స్, లాన్స్ పెంచిన ప్రాంగణాలు కలిగిన ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగులు ప్రశాంతంగా పనిచేయ డం, సమర్థత ప్రదర్శించడం గమనించారు. కాబట్టి ఇంటిలో కుండీలలో పచ్చదనం పంచే మొక్కలు పెంచండి.





పూలతో హాయిగా

తలలో పూలు పెట్టుకునే భారతీయ సంప్రదాయం చాలా విశిష్టమైనదని ప్రపంచం నేడు అంగీకరిస్తున్నది. ఆ సంస్కృతి లేనిచోట్ల పూలను ఇళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవలసి వస్తున్నది. కళ్ళ ఎదుట పూలు రంగులు రంగుల్లో కనిపిస్తున్నా, వాటి వాసన తగులుతున్నా మానసిక ప్రశాంతత వస్తుంది. మనుషుల మూడ్‌ని మార్చే శక్తి పూలకి ఉంది. ఇంటిలోని వాతావరణం ప్రశాంతంగా తయారు చేస్తాయి. పనిచేయడంలో ఉత్సాహం ఇస్తాయి. ఇళ్లలో పూల గుత్తులు ఏర్పాటు చేసుకోవడం మంచిది. గులాబీలు, మల్లెలు, పొద్దుతిరుగుడు పూలు, లిల్లీలు, బంతి, చేమంతి వంటివి బాగా దట్టంగా ఉండేలా ఏర్పాటు చేయాలి. ఫ్లవర్‌వేజ్‌లనే ఆలోచన బాగా వృద్ధిచెందని కాలంలో ప్రతిరోజూ ఇంటిలోని దేవుని పటాలకు పూలదండలు వేయడం కూడా ఇటువంటి ఏర్పాటేనని తేల్చారు. ఆ సంప్రదాయాన్ని ప్రస్తుతం మరో రూపంలో అమలుచేసి తరతరాలుగా మన పూర్వీకులు పొందుతున్న పూలవల్ల మేలును మనమూ పొందవచ్చు.

నిద్రపోకుంటే..

రాత్రిపూట తగినంత నిద్ర లేకపోవడం చాలా పెద్ద ప్రమాదాలకు సంకేతం. పగలంతా మత్తుగా జోగుతుంటారు. కాని రాత్రిపూట నిద్రపట్టదు. ఎంత రాత్రి అయినా అటు, ఇటు దొర్లుతుం టారు. ఇటువంటి పరిస్థితి ఎప్పు డైనా ఒక్కసారి వస్తే ఫరవాలేదు. ఎక్కువ కాలం నిద్రపట్టని పరిస్థితి ఉంటే అదే శరీరంలో వస్తున్న మార్పులను సూచిస్తుంది. తగినంత నిద్ర పోకుంటే శరీరానికి విశ్రాంతి దొరకదు. పనిమీద దృష్టి నిలపలేరు. కోపం, చిరాకులు పెరుగుతాయి. బి.పి.పెరుగుతుంది. లోపలి అంగాల పనితీరు మారిపోతాయి. సామాజిక సంబంధాలు తెగిపోతాయి. మూడ్ సక్రమంగా ఉండదు. వృత్తిపరమైన నైపుణ్యం తగ్గుతుంది. ఇంటి పనులలో పొరపాట్లు పెరుగుతాయి. నిద్రపోకుండా ఇన్ని రకాల ఇబ్బందులు ఉన్నాయని తెలిసినపుడు హాయిగా నిద్రపోవడం మంచిది కదా!



నేను - సుడిగుండం (నవల) 8

పి.చంద్రశేఖర్ ఆజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి



"మార్పు కూడా పూర్తిగా మన చేతిలో వుండదు. కొన్ని లక్షల కోట్ల శక్తులు అంతర్గతంగా పని చేస్తుంటాయి. అవి క్లాష్ అవుతుంటాయి. అవన్నీ మనుషులు ఎప్పుడు అర్థం చేసుకుంటారో మనం చెప్పలేం. ఉదాహరణకి ఉత్పత్తికి - పంపిణీకి - డిమాండ్ కి మధ్య గ్యాప్ వుంటుంది. ఎంత అవసరం అనే దాన్ని బట్టి ఉత్పత్తి వుండదు. ఇది ఓ దేశ పరిధిలో అమలు చేయటం కష్టం. ప్రపంచ దేశాలన్నీ భవిష్యత్ లో ఓ ఉమ్మడి ప్రణాళిక తయారు చేయగల పరిస్థితి వచ్చినప్పుడు అది కుదురుతుంది"

"అలాంటిది ఏనాటికైనా వస్తుందంటారా?"

"అలాంటి నమ్మకం కోసమే కదా ఎవరయినా పని చేసేది"

తలూపాను - అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తూ.

"మతం కూడా అంతే. అన్ని మతాల మధ్య సమన్వయం కుదరనంత వరకు మనకు విధ్వంసాలూ, రక్తపాతాలే దర్శనం ఇస్తాయి. ఒకే మతంలో జరిగిన, జరుగుతున్న హింస చరిత్రలో వుంది. ఉంటుంది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఓ ద్వేష భావంతో దేన్నీ చూడకూడదు"

కొద్ది క్షణాలు మౌనంగా గడిచిపోయాయి.

"సోషల్ సైన్సెస్‌కీ, సైన్స్ కి ఏ సంబంధం లేదు అనుకుంటారు కొందరు. అది వాస్తవం కాదు. అందుకే మనం ఏ ఒక్కదానికో పరిమితం అయితే పూర్తి చిత్రం కనిపించదు" అంటూ నేను చదవాల్సిన పుస్తకాలను సూచించారు. అందులో అనేక రకాలున్నాయి.

"ఇవన్నీ మానవ జీవితానుభవం నుండి పుట్టాయి. వాటి వెనక పెయిన్ వుంది. శ్రమ వుంది. అన్నింటిలో ఓ సారం వుంది. మనం పాల నుండి నీళ్లను వేరు చేయగల శక్తిని పెంచుకోవాలి. అలాంటి సమన్వయం, నిర్మమకారం కావాలి"

ఇది జయదేవ్ గారిని కలిసిన మొదటిసారి చెప్పింది.

ఆ తర్వాత మేం అనేకసార్లు కలుసుకున్నాం. ప్రతి సందర్భమూ ప్రత్యేకమైనదే. నేను ఆయన చెప్పిన పుస్తకాలతో పాటు రకరకాల పుస్తకాలు చదువుతున్నాను. కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న పుస్తకాల్లో ఎన్నిక తప్పనిసరి. లేకపోతే ఎన్ని జన్మలెత్తినా అన్నీ చదవటం కుదరదు.

****

నా స్నేహితులు

నేను హాస్టల్లో చేరాక క్రమంగా మిత్రులు ఏర్పడ్డారు. స్నేహపరంగా అవంత గాఢమైనవి కాదు.

"ఈ రోజు నుంచి ఇంగ్లీష్ సినిమా వచ్చింది. చూద్దాం' అన్నారు మొదటిసారి. నేను రాను అన్నాను.

"మేం టిక్కెట్లు తీసుకుంటాం రామ్" "ఆ సినిమాలు నాకు అర్థం కావు మీరు వెళ్లండి" అన్నాను.

"మాకు మాత్రం అర్థం అవుతాయా.... కాలక్షేపానికి చూస్తాం. పోనీ తెలుగు సినిమా చూద్దాం" అన్నారు.

"నాకు ఏ సినిమా ఇష్టం లేదు" అన్నాను.

నన్ను వింతగా చూస్తూ వెళ్లిపోయారు. నా గురించి వారు ఏం మాట్లాడుకున్నా నాకు అనవసరం.

క్రమంగా నా గురించి ఓ అభిప్రాయానికి వచ్చారు.

ఓ రోజు నన్ను బీచ్ కి రమ్మన్నారు. నేను సమాధానం చెప్పేలోగా "నీకు సినిమాలంటే ఇష్టం లేదన్నావు. సముద్రం కూడా ఇష్టం వుండదా! మాతో రావటం ఇష్టం లేదని చెప్పు" అన్నారు కాస్త సీరియస్‌గా.

నన్ను టచ్ చేయొద్దు అని కూర్చుంటే కుదరదు. అందరినీ, అన్ని సమయాల్లో కాదనలేం. బలవంతాన ఒప్పుకున్నాను. స్విమ్ చేద్దాం అన్నారు. నాకు ఈత రాదని అంటే వెక్కిరిస్తారని వారితో పాటు సముద్రంలోకి వెళ్లాను. ముందు భయం అనిపించింది.

తర్వాత నీళ్లలోకి దిగాక ఆ అలల మీద నుండి ఎగురుతూ వుంటే ఆనందం అనిపించింది.

ఒకతను మాత్రం ఒడ్డున కూర్చున్నాడు. అతనికి నీళ్లంటే భయం. జల గండం వుందని జ్యోతిషం చెప్పారంట. అతన్ని కూడా ఏడ్పించారు.

"ఇక్కడ సుడిగుండాలున్నాయి. ఎక్కువ దూరం వెళ్ళొద్దు" అన్నాడతను నాతో.

నేను ఆ ఉత్సాహంలో ఎంత దూరం వెళ్తున్నానో గమనించలేదు. వెనక్కి తిరిగి చూసాను. మిత్రులు దూరంగా కనిపిస్తున్నారు.

అప్పుడు వణికిపోయాను. ఇప్పుడు అలలు నన్ను తమలోకి ఈడ్చుకుపోతే కాపాడేవారు దగ్గర్లో లేరు. అయినా నేను ఇలాంటి సాహసాన్నా చేయాల్సింది!

ఇప్పుడు నాకేమన్నా జరిగితే అమ్మ తట్టుకుంటుందా? ఈతలకు వెళ్లి చనిపోయిన పిల్లలు, యువకులు ఎంత మంది లేరు.

ఒకప్పుడు అమ్మకీ, మావయ్యకి ఏమన్నా జరిగితే చెరువులోకి దూకి చచ్చిపోవాలనుకున్న నేను ఇలా చేయటం ఏంటి! అతన్ని ఎన్ని మాటలన్నా ఒడ్డునే కూర్చున్నాడు. నేనూ అలానే చేయాలి కదా! నా ఆలోచనలే అమ్మకూ వస్తే, నాకోసం బతుకుతున్న అమ్మకి మరణాన్ని కానుకగా ఇస్తున్నానా!

ఓ నిముషంలో ఎన్నెన్నో ఆలోచనలు. నన్ను నేను నిగ్రహించుకుని ఒడ్డుకి ఈదుతున్నాను. ఓసారి ప్రాణభయం పట్టుకుంటే మనిషిలో ఎంత మార్పు వస్తుందో అప్పుడు తెలిసింది. నా మీద నాకు నమ్మకం పోయింది. చేతులు కదలవు. కొద్దిగా ఉప్పు నీళ్లు తాగాను. ఎలా ఒడ్డుకు చేరుకున్నానో నాకు తెలియదు.

"రాముడు గజ ఈతగాడ్రోయ్" అంటున్నారెవరో

"మనం అనుకున్నంత అమాయకుడు కాదురా' అన్నారు ఇంకొకరు. నా గుండెలు వేగంగా కొట్టుకోవటం తెలుస్తూనే వుంది.

అప్పుడు ఆనందంగా ఈలలు వేస్తున్నారు.

ఒకతను స్కూటర్ ఆపి ఓ గోతంలో ఏవో తీసుకు వస్తున్నాడు. ఉత్సాహంగా అతని దగ్గరకు కొందరు పరుగులు తీస్తున్నారు. గోతంలో నుండి బాటిల్స్ తీస్తున్నారు. అవి బీర్ బాటిల్స్ అని వారి మాటల ద్వారా తెలిసింది. నాకు ఒకటి అందించారు.

"ఇదేంటి?" అన్నాను.

"కూల్ కూల్ బీరమ్మా.... తాగు"

"నేను తాగను. ఆ వాసన నాకు పడదు" అన్నాను.

"ఇప్పటి వరకు నువ్వు బీరు కూడా తాగలేదా?"

తల అడ్డంగా వూపాను.

"ఏం ఫర్లేదు. ఇప్పుడు మొదలు పెట్టు"

"నేను తాగను"

"కనీసం స్మోక్ చేస్తావా?"

"చేయను"

"ఏది అడిగినా ఇదే ఆన్సరా. అసలు కెమిస్ట్రీ అంటే ఇదేరా. బీర్ కొడుతూ సిగరెట్ అందించాలి. ఆ తర్వాత చిప్స్ నమలాలి. బీచ్‌లో ఆడపిల్లలు కనిపిస్తారేమో వెతుక్కోవాలి. వారిని టీజ్ చేయాలి. నీకోసం చికెన్ తీసుకొచ్చాం. అది భోంచేయాలి" అన్నారు.

"సారీ... నేను సముద్రాన్ని చూడటానికి వచ్చాను" అన్నాను.

"అబ్బో... రాముడు మంచి బాలుడురా. వీడ్ని మనం చాలా మార్చుకోవాలి. ముందు నోరు తెరిచి పోయండ్రా" అన్నాడొకడు

అప్పుడు నాకు కోపం వచ్చింది.

"ప్లీజ్ అని రిక్వెస్ట్ చేస్తున్నా. ఇంకా బలవంతం చేస్తే నాకు కోపం వస్తుంది" అన్నాను.

ఏమనుకున్నారో నన్ను వదిలేసారు. నేను సముద్రం ఒడ్డున నడుచుకుంటూ వారికి దూరంగా వెళ్లాను. అలా నడుస్తుంటే ఓ గవ్వ కనిపించింది. అది చేతిలోకి తీసుకున్నాను.

అప్పుడు 'వెన్నెల' గుర్తొచ్చింది.

ఇంటికి వెళ్లినప్పుడు తనకి ఇవ్వాలనుకున్నాను. అప్పుడు 'అర్చన' గుర్తొచ్చింది. ఇంకొకటి దొరికితే బాగుండును అనుకుంటూ అలా వెతుకుతున్నాను. అలా ఎంత దూరం వెళ్లానో తెలియదు.

నేనూ - సముద్ర హోరు - వెతుకులాట. ఈ లోకంలోకి వచ్చాను. వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ కనిపించటం లేదు. వేగంగా నడుస్తూ వచ్చాను. మిత్రులెవరూ కనిపించటం లేదు. వాళ్లు వెళ్లిపోయారు!

****

రాత్రి ఎంత ప్రయత్నం చేసినా నాకు నిద్ర పట్టలేదు.

నన్ను బలవంతంగా తీసుకువెళ్లారు. నాకోసం ఒక్కరు కూడా ఆగలేదు కనీసం నేను ఏమైపోయానా అన్న ఆలోచన రాలేదు.

ప్రయాణం మొదలు పెట్టాక తుదికంటా ఎవరూ కలిసి వుండరు. మధ్యలోనే ఎవరి దారులు వారు చూసుకుంటారన్న మాట!

హాస్టల్ కి ఎలా చేరుకున్నానో నాకు తెలుసు. కొంత దూరం నడిచాను. కొందరిని దారి అడిగాను. నగరం అంతా నేను చూడలేదు. దారిలో లిఫ్ట్ అడిగాను. కొంత దూరం తీసుకు వెళ్లాడు. అతని దారి అతనిది. మళ్లీ నడక.... నడక.... ఒంటరి ప్రయాణం.... దానికి తోడు ఆకలి.

అసలు విషయం నేను జేబులో డబ్బులు వేసుకు రాలేదు.

విశాఖ సముద్రం ఏకకాలంలో నాకు రెండు అనుభవాల్ని యిచ్చింది.

****

కాస్త ఆలస్యంగా మావయ్య నుండి ఉత్తరం వచ్చింది.

"నీ ఉత్తరం చదివాను. నాకోసం నువ్వు చదువుతున్నానన్నావు. మంచిదే. నేను నీ కోసం నువ్వు చదవాలి అని ఆశించాను. మన చదువు మనల్ని విద్యావంతుల్ని చేస్తుంది. మనం బతకటానికి ఓ ఆధారం చూపిస్తుంది. అది చాలుతుందా? (ఇంకా ఉంది)

టెన్త్‌లో జీపీఏకు సులువైన మార్గాలు...



రెండు తెలుగు రాష్ట్రాల్లో.. పదో తరగతి పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్ విడుదలైంది. తెలంగాణలో మార్చి 16 నుంచి.. ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. దాంతో విద్యార్థులు తమ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా మెరుగైన గ్రేడ్ పాయింట్ల సాధనకు సాధ్యమైనంత ముందుగానే ప్రిపరేషన్ ప్రారంభించాలి. పదో తరగతిలో మంచి గ్రేడ్ వస్తే.. ఉజ్వల భవిష్యత్‌కు మార్గం సుగమం అవుతుంది. ఈ నేపథ్యంలో పదో తరగతిలో పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించేందుకు సబ్జెక్ట్ నిపుణుల ప్రిపరేషన్ గైడెన్స్...

పదో తరగతి విద్యార్థులు 10/10 గ్రేడ్ సాధించాలని కష్టపడి చదువుతున్నారు. పరీక్షల సమయం సమీపిస్తున్నకొద్దీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సైతం వారిని ప్రోత్సహిస్తుంటారు. ఫలితంగా తెలుగు రాష్ట్రాల్లో పదికి పది గ్రేడ్‌లు సాధిస్తున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కష్టపడి చదివి పదికి పది గ్రేడ్ పాయింట్లు సొంతం చేసుకుంటున్నారు. కాబట్టి ఇప్పటినుంచి అందుబాటులో ఉన్న ఈ మూడు నెలల సమయంలో పటిష్ట ప్రణాళికతో ఏరోజు పాఠ్యాంశాలు ఆరోజు శ్రద్ధగా చదివితే పదికి పది గ్రేడ్ పాయింట్లు పొందవచ్చని ఆయా సబ్జెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు. పదోతరగతిలో పొందిన మార్కులు(గ్రేడ్ పాయింట్లు) భవిష్యత్‌లో ఉన్నత విద్య పరంగా, ఉపాధి అవకాశాల రీత్యా ఎంతగానో ఉపయోగపడతాయని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని చెబుతున్నారు.

తెలుగు :

మన మాతృభాష కవడంతో తెలుగును విద్యార్థులు తేలిగ్గా తీసుకుంటుంటారు. ఇందులో ఫెయిల్ అయ్యే విద్యార్థుల సంఖ్య తక్కువే. కానీ.. తెలుగులో మంచి మార్కులు సాధించాలంటే మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిందే. అందుకోసం పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలను ఔపోసన పట్టాలి. పరీక్ష రోజు వరకూ వాటిని నిత్యం పునశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని కేవలం చదవడంతో సరిపెట్టకుండా..సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం ఎంతో ముఖ్యమైనది. కాబట్టి సొంతంగా ఆలోచిస్తూ చదవాలి. ఉప వాచకానికి సంబంధించి ఇతివృత్తం, ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. తెలుగు సబ్జెక్ట్‌లో వ్యాకరణం కూడా ముఖ్యమే. సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్యార్థాలు, జాతీయాలు బాగా చదవాలి.

ఇంగ్లిష్ :

ఇంగ్లిష్.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కొంత ఆందోళన చెందే సబ్జెక్ట్. కొద్దిగా కష్టపడితే.. ఇందులోనూ మంచి మార్కులు సాధించవచ్చు. ఇందుకోసం చేయాల్సిందల్లా.. ముందుగా ఇంగ్లిష్ పదజాలంపై అవగాహన పొందాలి. పాత ప్రశ్నపత్రాల సమాధానాలను పరిశీలించడం కూడా మేలు చేస్తుంది. పరీక్ష పరంగా విద్యార్థులు పేపర్-1, పేపర్-2 రెండింటిలోనూ.. రెండు విభాగాల్లో పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాబట్టి ప్రతిపాఠం చివర్లో ఉండే కాంప్రెహెన్సివ్ ప్రశ్నలపై ద ృష్టిసారించాలి.

ప్రతి పాఠానికి సంబంధించి సారాంశాన్ని గ్రహించి సొంతగా రాయడం అలవాటు చేసుకోవాలి. పొయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కులకు సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టిసారించాలి.

పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్‌ను చదవడంతోపాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందొచ్చు.

పేపర్-2 విషయంలో రీడింగ్ కాంప్రెహెన్షన్ పెరిగే విధంగా ప్రిపరేషన్ సాగించాలి. ఖఅఖఅశీఒఅ ప్యాసేజ్ కింద ఇచ్చే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ఆ ప్యాసేజ్ సారాంశాన్ని గుర్తించే విధంగా చదవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టుసాధించాలి.

మ్యాథమెటిక్స్ :

పదోతరగతి విద్యార్థులు కొంతమంది గణితం కష్టమైన సబ్జెక్టని భావిస్తుంటారు. కానీ, గణితంపై ఆసక్తి పెంచుకొని పట్టుసాధిస్తే.. పూర్తిస్థాయిలో మార్కులు సాధించేందుకు వీలుంటుంది.

గణితంలో పేపర్-1 నుంచి ఏడు చాప్టర్లు, పేపర్-2 నుంచి ఏడు చాప్టర్లలో ప్రతి చాప్టర్‌ను సమగ్రంగా అధ్యయనం చేయాలి. ఆయా చాప్టర్లకు సంబంధించిన సమస్యలను ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ; బీజగణితం; నిరూపక రేఖా గణితం; రేఖా గణితంబీ క్షేత్రమితి; త్రికోణమితి; సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించడం ఎంతో మేలు చేస్తుంది.



విద్యార్థులు ప్రిపరేషన్ సమయంలోనే సమస్య సాధనతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి.

ముఖ్య నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్‌కు ఉపయోగపడుతుంది. పాఠ్యపుస్తకంలో ప్రతి చాప్టర్ చివర ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి.

గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి.

వాస్తవ సంఖ్యలు; సమితులు; బహుపదులు; రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాల్లోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్య సమస్యలను సాధన చేస్తే తేలిగ్గానే 60 శాతం మార్కులు సొంతం చేసుకోవచ్చు.

ఫిజికల్ సైన్స్ :

సామాన్యశాస్త్రం పేపర్-1(ఫిజికల్ సైన్స్)లో మంచి మార్కులు సాధించాలంటే.. అనువర్తిత ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి. ఫిజిక్స్ నుంచి ఏడు, కెమిస్ట్రీ నుంచి ఏడు మొత్తం 14 చాప్టర్లు చదవాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన అంశాలను నిజజీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగించడం ద్వారా ఎక్కువకాలం గుర్తుండిపోతుంది. ఈ విధానం ద్వారా విషయ పరిజ్ఞానం మరింతగా పెంపొందించుకోవచ్చు.

ప్రశ్నించడం-పరికల్పన చేయడం; ప్రయోగాలు-క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు- ప్రాజెక్ట్ పనులు; పటాలు-వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా దృష్టిపెట్టాలి.

కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి.

మూలకాల ధర్మాలు-వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలివ్వొచ్చు.

జీవశాస్త్రం :

సామాన్య శాస్త్రంలో రెండో పేపర్.. జీవశాస్త్రం. ఇందులో మంచి మార్కులు పొందేందుకు అవగాహన, సొంత విశ్లేషణ నైపుణ్యాలు ముఖ్యం. ఇందుకోసం ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి.

విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యమివ్వాలి. ఒక అంశాన్ని నేర్చుకున్న తర్వాత దాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయించే నేర్పు సొంతం చేసుకోవాలి.

ప్రయోగాలకు సంబంధించి ప్రయోగం ఫలితంతోపాటు.. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. ఆయా అంశాలపై చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, భేదాలు తెలుసుకుంటూ చదవాలి.

డయాగ్రమ్స్‌లో భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వివరించగలిగేలా ప్రాక్టీస్ చేయాలి.

సోషల్ స్టడీస్ :

సీసీఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత సోషల్ స్టడీస్‌లో అడిగే ప్రశ్నల తీరులో మార్పు వచ్చింది. కాబట్టి విద్యార్థులు అందుకు అనుగుణంగా ప్రిపరేషన్ తీరు మార్చుకోవాలి.

సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన, ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలపై సాధన చేయడం ఎంతో అవసరం. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి, సొంత పరిజ్ఞానంతో రాసేలా నైపుణ్యం పెంచుకోవాలి.

జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో.. భారతదేశం-భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి-ఆదాయం తదితర పాఠ్యాంశాలకు ప్రాధాన్యమివ్వాలి.

హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధ కాలాల సమయంలో ప్రపంచం; సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టిపెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రను ప్రత్యేకంగా చదవాలి.

సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగల నుంచి అనుసరించారు అనే కోణాల్లో చదవాలి.

డయాగ్రమ్/ రేఖాచిత్ర, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

పిపరేషన్ టిప్స్...

- సీసీఈ విధానంలో పరీక్షలు జరగనున్నందున అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు పెంచుకోవాలి.
- ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యమివ్వాలి.
- అనువర్తిత నైపుణ్యం పెంపొందించుకునేలా చదవాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్‌ల్లో బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే నైపుణ్యం సొంతమయ్యేలా ప్రాక్టీస్ చేయాలి.

ప్రతి అంశంపై స్పష్టమైన అభిప్రాయం ఏర్పరచుకోవాలి. ఫలితంగా ప్రశంస/విమర్శలకు సంబంధించి ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానాలు సులువుగా రాయొచ్చు.

డిసెంబర్ మూడో వారం నుంచే అధిక సమయం పునశ్చరణకు కేటాయించాలి. దీనికి అనుగుణంగా టైమ్‌టేబుల్ రూపొందించుకోవాలి.

జనవరి చివరి నాటికి ప్రిపరేషన్, రివిజన్‌ను పూర్తిచేసుకోవాలి.

ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారం వరకు ప్రీ-ఫైనల్స్‌కు హాజరవ్వాలి.

తొలి పరీక్షకు వారం ముందు నుంచి పూర్తిగా ఆ పరీక్షకే సమయం కేటాయించాలి.

ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షలషెడ్యూల్ :


తేదీ	సబ్జెక్ట్
18-03-2019	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1
19-03-2019	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2
20-03-2019	సెకండ్ లాంగ్వేజ్
22-03-2019	ఇంగ్లిష్ పేపర్-1
23-03-2019	ఇంగ్లిష్ పేపర్-2
25-03-2019	మ్యాథమెటిక్స్ పేపర్-1
26-03-2019	మ్యాథమెటిక్స్ పేపర్-2
27-03-2019	జనరల్ సైన్స్ పేపర్-1
28-03-2019	జనరల్ సైన్స్ పేపర్-2
29-03-2019	సోషల్ స్టడీస్ పేపర్-1
30-03-2019	సోషల్ స్టడీస్ పేపర్-2

తెలంగాణ పదో తరగతి పరీక్షలషెడ్యూల్ :

తేదీ	సబ్జెక్ట్
16-03-2019	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1
18-03-2019	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2
19-03-2019	సెకండ్ లాంగ్వేజ్
20-03-2019	ఇంగ్లిష్ పేపర్-1
22-03-2019	ఇంగ్లిష్ పేపర్-2
23-03-2019	మ్యాథమెటిక్స్ పేపర్-1
25-03-2019	మ్యాథమెటిక్స్ పేపర్-2
26-03-2019	జనరల్ సైన్స్ పేపర్-1
27-03-2019	జనరల్ సైన్స్ పేపర్-2
28-03-2019	సోషల్ స్టడీస్ పేపర్-1
29-03-2019	సోషల్ స్టడీస్ పేపర్-2

మూలకాలు - ప్రత్యేకతలు

మూలకం (ఎలిమెంట్)	ప్రత్యేకత
➡ యురేనియం	- ప్రకృతిలో లభించే వాటిలో అతి భారయుతమైనది
➡ హైడ్రోజన్	- ప్రకృతిలో లభించే వాటిలో అతి తేలికైనది
➡ కార్బన్ డైమండ్	- ప్రకృతిలో లభించేవాటిలో అతి కఠినమైనది
➡ కార్బన్	- మూలకాలన్నింటిలో అత్యంత కాటనేషన్ సామర్థ్యమున్నది
➡ ఆక్సిజన్	- మూలకాలన్నింటిలో భూమి పొరల్లో అత్యధికంగా లభించేది
➡ క్లోరిన్	- మూలకాలన్నింటిలో అత్యధిక ధనవిద్యుదాత్మకత కలది
➡ ఫ్లోరిన్	- మూలకాలన్నింటిలో అత్యధిక అలోహ స్వభావం కలది
➡ సీజియం	- మూలకాలన్నింటిలో అత్యధిక లోహ స్వభావం కలది
➡ కాల్షియం	- మానవ శరీరంలో అత్యధికంగా ఉండే లోహం
➡ ఆస్మియా	- అత్యధిక సాంద్రత ఉండే లోహం
➡ లిథియం	- ప్రకృతిలో లభించే అతి తేలికైన లోహం
➡ సిల్వర్	- అత్యధిక విద్యుత్ వాహకత గల లోహం
➡ రేడియం	- అత్యధిక రేడియోధార్మికత గల లోహం
➡ అల్యూమినియం	- భూమి పొరల్లో అత్యధికంగా ఉండే లోహం
➡ టంగ్‌స్టన్	- అత్యధిక ద్రవీభవన ఉష్ణోగ్రత గల లోహం
➡ పాదరసం	- అత్యల్ప ద్రవీభవన ఉష్ణోగ్రతగల లోహం
➡ నైట్రోజన్	- గాలిలో అత్యధికంగా ఉండే వాయువు
➡ మాంగనీస్	- మానవ శరీరంలో అతి తక్కువగా ఉండే లోహం



➡ ఇనుము	- మానవుడు ఎక్కువగా ఉపయోగించే లోహం
➡ బంగారం	- రేకులుగా సాగే గుణం ఎక్కువగా ఉంటుంది
➡ వెండి	- అత్యధిక విద్యుత్, ఉష్ణ వాహకత ఉన్న లోహం
➡ మాంగనీస్	- స్త్రీ, పురుషుల్లో ప్రత్యుత్పత్తికి తప్పనిసరైన లోహం
➡ నికెల్	- నూనెల హైడ్రోజనీకరణలో ఉత్ప్రేరకంగా వాడే లోహం
➡ జిర్కోనియం	- వేడిచేసినప్పుడు సంకోచిస్తుంద
➡ టైటానియం	- ఉక్కులో సగం బరువు, గట్టిదనంలో సమానంగా ఉంటుంది
➡ హీలియం	- అన్నింటికంటే తేలికైన జడ వాయువు

బొగ్గు రకాలలో ఉన్న కార్బన్ శాతం

బొగ్గు రకం	కార్బన్ శాతం
➡ అంత్రసైట్	90
➡ బిట్యుమినస్	80
➡ లిగ్నైట్	70
➡ పీట్	60

ప్రమాదంలో సాంకేతిక విద్య

ఐఏసీటీఈ విధానాల ఎఫెక్ట్

న్యూఢిల్లీ: భారత దేశంలో సాంకేతిక విద్య క్లిష్టపరిస్థి తుల్లో ఉన్నది. విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకురావడం, ఉన్నత ప్రమాణాలు క్షీణించడం వంటి అంశాలను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) సమర్థవంతంగా నియంత్రించలేకపోయిందని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐఐటీ హైదరా బాద్ చైర్మెన్ బివిఆర్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పరిచిన కమిటీ.. జాతీయ సాంకేతిక విద్య మండలికి తాజాగా ఒక రిపోర్టును అందజేసింది. 2020 నుంచి కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేయరాదని, ప్రతి రెండేండ్లకు ఇంజనీరింగ్ విద్యను సమీక్షించాలని అందులో సూచించింది. సాంప్రదాయక ఇంజనీరింగ్ సబ్జెక్టులు మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, సివిల్‌లోని పరిమితికి మించి ఉన్న సామర్థ్యాలను సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణలు కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, డేటా సైన్స్‌లాంటి విషయాల్లోకి బదిలీ చేయాలని సిఫారసు చేసిం ది. అయితే ఈ రిపోర్టు సమస్య మూలాలు, దశాబ్దాలుగా అమలు చేస్తున్న ఏఐసీటీఈ అసంబద్ధ విధానాలపై ఎలాంటి సిఫారసులు చేయలేదు. 2016-17లో 3,921 ఇంజనీరింగ్ కాలేజీల్లోని 15.5లక్షల బీఈ/బీటెక్ సీట్లలో 51శాతం ఖాళీగా ఉన్నాయని, ఇది అవసరానికి మించిన కాలేజీలున్న విషయాన్ని వెల్లడిస్తున్నది. 1990 నుంచి 2010 మధ్య ఏఐసీటీఈ అనుమతితో ఇంజనీరింగ్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పెరిగాయి. ఈ కాలేజీల్లో చాలా వరకు మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను పర్యవేక్షించడంలో ఏఐసీటీఈ దారుణంగా విఫలమైందని నిపుణులు చర్చిస్తున్నారు. గత ఐదేండ్ల నుంచి ఇంజనీరింగ్ విద్య నాణ్యతపై ఈ రెగ్యులేటర్ మరింత నిస్సారంగా మారిందని చెబుతున్నారు. 2003లోనే పెరుగుతున్న కాలేజీలపై యుఆర్ రావు కమిటీ ఏఐసీటీఈని హెచ్చరిం చింది. పరిశ్రమకు కావల్సి న నైపుణ్యాలకు, విద్యా ర్థులకు బోధిస్తున్న సబ్జెక్టులో తీవ్ర వ్యత్యాసము న్నదని, దీన్ని నియంత్రించడం లోనూ రెగ్యులేటర్ విఫలమైనట్టు ఒక రిపోర్టు వెల్లడించింది. 95శాతం ఇంజనీరింగ్ పట్టభద్రులు సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఉద్యోగాలకు అనర్హులుగా ఉన్నట్టు ఆస్పైరింగ్ మైండ్స్ 2017 రిపోర్టు తేల్చడం గమనార్హం. ఉద్యోగాలకు అర్హులుగా ఉన్న టాప్ 10 ఇంజనీరింగ్ గ్రాడ్యుయెట్‌లలో టాప్ ముగ్గురికి మాత్రమే తమ రంగంలో జరుగుతున్న పరిశోధనలపై అవగాహన ఉన్నదని తేల్చిన ఓ రిపోర్టు.. దేశంలో సాంకేతిక విద్య ఏ స్థాయికి దిగజారిపోయిందో వెల్లడిస్తున్నది.



ఆసక్తికరంగా చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ఆసక్తికరంగా సాగుతోంది. ఈ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌ను నోబెల్ పురస్కార గ్రహీతలు ఎఫ్ డంకెన్ ఎం హల్డానె, అవ్రమ్ హెర్షోకో ప్రారంభించారు. మొత్తం 120 వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు సైన్స్ కాంగ్రెస్ జరగనుంది. ఈ ప్రదర్శనకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సహకారం అందిస్తోంది. డంకన్ హల్డానే మాట్లాడుతూ వైజ్ఞానిక అంశాల బోధనలో సైన్స్ ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. తాను ఈ స్థాయికి ఎదగడం వెనుక సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉందని చెప్పారు. సైన్స్ కాంగ్రెస్ అనేది విజ్ఞానపరంగా ఎదుగుతున్న దేశానికి దర్పణం పడుతున్నదన్నారు.

వాట్సప్ ద్వారా బీమా పాలసీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వాట్సప్ ద్వారా బీమా పాలసీలు అందిస్తున్నట్లు భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ వికాస్ సేథ్ నేడొక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఈ ఇన్‌స్టాంట్ మెసెంజర్ సర్వీసు ద్వారా తమ పాలసీదారులు రెన్యు వల్ ప్రీమియం రసీదులు పొందవచ్చన్నారు. క్లెయిమ్ ఇంటిమేషన్ సేవలు లభిస్తాయని, తమ కస్టమర్లు ఎస్ఎంఎస్, ఇ మెయిల్, మొబైల్ ఫోన్ల ద్వారా లింక్‌ను యాక్సెస్ చేయడం ద్వారా మూడు సులభమైన దశలను పూర్తి చేసి ఈ సేవలు పొందవచ్చని తెలిపారు.

వ్యాపారంపై గృహిణుల ఆసక్తి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వ్యాపారంపై భారతీయ మహిళల్లో ఆసక్తి పెరిగింది. గృహిణుల్లో దాదాపు సగం మంది వ్యాపారం చేయాలని, డబ్బులు సంపాదించాలని కోరుకుంటు న్నారు. బ్రిటానియా మారీగోల్డ్ భారత మహిళా సాధికారతపై సర్వే నిర్వహించగా అందులో ఈ విషయం వెల్లడైందని సంస్థ వైస్ ప్రెసిడెంట్ అలీ హారిస్ షేర్ వెల్లడించారు. 48 శాతం మంది గృహి ణులు డబ్బు సంపాదనపై వివిధ రకాల ఆలోచనల్లో ఉంటున్నట్టు సర్వేలో తేలిందన్నారు. వీరిలో 69 శాతం మందికి పెట్టుబడి సమస్యగా ఉందని, 25 శాతం మంది వ్యాపారాన్ని ప్రారంభించి, డబ్బులేక విరమించుకున్నారని తెలిపారు. ఇక సర్వేలో పాల్గొన్న వారిలో 92 శాతం మంది తమ తరువాతి తరం మహిళలు సొంత కాళ్లపై నిలబడితే సంతోషిస్తామని చెప్పారన్నారు.

మూడు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు విలీనం

న్యూఢిల్లీ: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (ఆర్ఆర్‌బీ)లైన పంజాబ్ గ్రామీణ బ్యాంక్, మాల్వా గ్రామీణ బ్యాంక్, సట్లేజ్ గ్రామీణ బ్యాంకులు విలీనమైనట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 1 నుంచే ఈ విలీనం అమలులోకి వచ్చింది. ఈ మూడు బ్యాంకులకు స్పాన్సర్లుగా ఉన్న జాతీయ బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వం కలిసి పలు దఫాలుగా చర్చించిన తర్వాతనే విలీనం జరిగింది. దీంతో ఈ ఆర్ఆర్‌బీలు ఒక్కటయ్యాయి. వీటికి పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్), పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

ఐటీ కంపెనీలకు

గ్లోబల్ ఇక్కట్లు

- ప్రపంచ ఆర్థికవ్యవస్థ వృద్ధిపై మేఘాలు
- తగ్గిన బీఎఫ్ఎస్ఐ ఆదాయం
- రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గించిన అంతర్జాతీయ కంపెనీలు

ముంబై: ఈ వారం నుంచి ఆర్థిక ఫలితాల వెల్లడి ప్రారంభం కానుంది. 2018లో మంచి పనితీరును కనబరిచిన దేశీయ ఐటీ కంపెనీలకు ఈ ఏడాది ప్రారంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఆంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగించవచ్చునన్న అంచనాలతో ఐటీ కంపెనీలు అయోమయంలో పడ్డాయి. వృద్ధి రేటు మందగించితే వివిధ దేశాల ఐటీ వ్యయాలు తగ్గిపోతాయని భావిస్తున్నారు. 2018 ప్రారంభంలో ఐటీ కంపెనీల్లో వృద్ధి పుంజుకోవడంతో లాభాలను ఆర్జించగలిగాయి. కానీ, ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా-చైనాల మధ్య వాణిజ్య పోరు, బ్రెగ్జిట్ కారణంగా యూరోజోన్‌లో నెలకొన్న అనిశ్చితి తదితర కారణాలతో సెంటిమెంట్ బలహీనంగా కనిపిస్తుండడంతో ఐటీ కంపెనీలు తమ ఆశావాహ దృక్పథాన్ని తగ్గించుకుంటున్నాయి. ఇప్పటికే కొన్ని ఐటీ రంగ షేర్లు చాలా వరకూ పతనం అయ్యాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ డిసెంబర్ త్రైమాసికంలో 9 శాతం నష్టపోయింది. అదే నిఫ్టీ మాత్రం నికరంగా 820 పాయింట్ల మేర గత మూడునెలల్లో లాభపడింది. వచ్చే త్రైమాసికంలో రెవెన్యూ పెద్దగా పెరుగకపోవచ్చునని ప్రముఖ గ్లోబల్ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ ప్రకటించింది. ఆ కంపెనీ బ్యాంకింగ్, బీమా విభాగాలు కేవలం 1 శాతం మేర మాత్రమే గత త్రైమాసికంలో వృద్ధి చెందాయి. అలాగే మరో అతిపెద్ద ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కూడా రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గించింది. టీసీఎస్, ఇన్ఫోసిస్ లాంటి దేశీయ కంపెనీల బీఎఫ్ఎస్ఐ విభాగం రెవెన్యూలో దాదాపు సగం అమెరికన్ మార్కెట్ నుంచే వస్తున్నది. మరికొన్ని మిడ్ క్యాప్ కంపెనీల ఆదాయం కూడా ఈ విభాగం నుంచి సగానికి పైగా లభిస్తున్నది. కాగ్నిజెంట్, యాక్సెం చర్ లాంటి దిగ్గజ కంపెనీలే రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గించిన నేపథ్యంలో దేశీయ కంపెనీల గైడెన్స్‌పై మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. బ్యాంకింగ్ రంగం నుంచి డిమాండు తగ్గిపోవడంతో పాటు అమెరికా లో కార్యకాలాపాలు నిర్వహించడం కూడా వివిధ కారణాలతో వ్యయభరితం అయింది. దీంతో ఐటీ కంపెనీల మార్జిన్లు కూడా తగ్గిపోయే ప్రమాదం ఏర్ప డింది. దేశీయ నిపుణులకు వీసాలు దొరకక పోవడం, స్థానికంగా నిపుణుల లభ్యత తక్కువగా ఉండడం వంటి కారణాలు దేశీయ ఐటీ కంపెనీలకు సవాళ్లను విసురుతున్నాయని కోటక్ ఈక్విటీస్ రీసెర్చ్ నివేదికలో పేర్కొంది.

మిడ్‌క్యాప్ ఐటీ కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ నిపుణుల కొరత కారణంగానే సెప్టెంబర్ త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితా లను ప్రక టించలేకపోయినట్టు తెలిపింది. 2019 జూన్ త్రైమాసికం వరకూ పరిస్థితులు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. అమెరికాలో నిపు ణులు కొరత గురించి దేశంలో అతి పెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్ కూడా గతంలో అనేకసార్లు ప్రస్తావించింది. పెద్ద కంపెనీల కన్నా చిన్న ఐటీ కంపెనీలే ఎక్కువ సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఎడెల్‌వైజ్ సెక్యూరి టీస్ తన నివేదికలో తెలిపింది. ఐటీ కంపెనీలు రెవెన్యూ గైడెన్స్‌ను తగ్గిస్తే గతేడాదిలో మాదిరిగా షేర్లను కొనుగోలు చేయడానికి ఇన్వె స్టర్లు ముందుకు రాకపోవచ్చు.

ఆదాయంలో వృద్ధి 4 శాతమే..

సాధారణంగా డిసెంబర్ త్రైమాసికంలో చాలా తక్కువ పనిరోజులుంటాయి. దీంతో సాధారణంగా ఫలితాల్లో జోష్ ఉండదు. ఈ నేపథ్యంలో ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పతనం నేపథ్యంలో ఐటీ కంపెనీలు ఏ మేరకు లబ్ది పొందాయో కూడా ఈ త్రైమాసిక ఫలితాలు తేల్చను న్నాయి. డిసెంబర్ త్రైమా సికంలో రూపాయి మారకం విలువ 2.7 శాతం నష్ట పోయింది. దీంతో కంపెనీల మార్జిన్లు చాలా వరకూ తగ్గిపోకుండా ఉండే అవకాశం ఉంది. దేశీయ ఐటీ రంగంలో టాప్-5 కంపెనీల నిర్వహణ మార్జిన్లు దాదాపు ఒక శాతం వరకూ పెరగవచ్చునని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆటోమేషన్‌పై దృష్టిని సారిం చడం వల్ల కూడా ఐటీ కంపెనీలు చాలా వరకు రెవె న్యూను కాపాడుకోగలిగాయి. ఇన్ఫోసిస్ లాభ మార్జిన్లు ఈ సారి కుదించుకుపోయే అవకాశాలు న్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశీయ ఐటీ కంపెనీల రెవెన్యూ సగటున 4 శాతం, అలాగే నికర లాభం 6 శాతం మేర వృద్ధి చెందవచ్చునని అంచనా. అలైట్ సొల్యూషన్స్ ఒప్పందం కారణంగా విప్రో మార్జిన్లు 23 శాతం పెరగవచ్చునని భావిస్తున్నారు. మిడ్ క్యాప్ ఐటీ కంపెనీలలో ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ అత్యధిక రెవెన్యూ వృద్ధిని సాధించవచ్చు. పెద్ద కంపెనీల కన్నా కొన్ని మిడ్‌క్యాప్ కంపెనీల లాభాలే ఎక్కువ శాతం పెరిగే అవకాశాలున్నాయి. డిజిటల్, ఏఐ, ఆటోమేషన్ సేవల కారణంగా ఈసారి మెజారిటీ ఐటీ కంపెనీలు గట్టెక్కే అవకాశాలున్నాయి.

ఆర్థిక ఇబ్బందుల్లో హెచ్ఏఎల్

- సిబ్బంది వేతనాల కోసం రూ.1,000 కోట్ల అప్పు
- భద్రతా దళాల బకాయిలు రూ.15,700 కోట్లు
- సంస్థలో 29,035 మంది సిబ్బంది
- 2017-18లో రూ.18,284 కోట్ల టర్నోవర్


బెంగళూరు: తీవ్రవాదుల గుండెలను చీల్చుకుంటూ పోయే రాకెట్లను తయారు చేసే సంస్థ అది. దేశ భద్రతకు వెన్నెముకలాంటి పరికరాలను తయారుచేసి ఇస్తున్న సంస్థకు ప్రస్తుతం రోజుగడవని పరిస్థితి దాపురించిందా అంటే నిజమేననిపిస్తున్నది. అదే ప్రభుత్వరంగ రక్షణ పరికరాల తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్). కంపెనీ చరిత్రలో తొలిసారిగా ఉద్యోగుల వేతనాలను చెల్లించడానికి అప్పు చేసింది. ప్రస్తుతం సంస్థ వద్ద మిగులు నిధులు నిండుకోవడంతో వేతనాలను చెల్లించడానికి గతంలోనే రూ.1,000 కోట్ల నిధులను రుణంగా తీసుకున్నది. దశల వారీగా వీటిని తిరిగి చెల్లింపులు జరుపనున్నది. ప్రస్తుతం సంస్థలో 29,035 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి వేతనాల రూపంలో నెలకు రూ.358 కోట్లు చెల్లిస్తున్నది. వీటితోపాటు ఇతర నిర్వహణ ఖర్చులు కలుపుకొని నెలకు సుమారుగా రూ.1,400 కోట్లు అవసరం. ఈ సందర్భంగా హెచ్ఏఎల్ చైర్మన్ ఆర్ మాధవన్ మాట్లాడుతూ..చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఓవర్‌డ్రాఫ్ట్ ద్వారా రూ.1,000 కోట్ల వరకు అప్పుగా తీసుకున్నట్లు చెప్పారు. మార్చి 31 నాటికి కంపెనీ రూ.6 వేల కోట్ల లోటు ఉండనున్నదని, ఇది భరించలేని స్థాయి అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులను నిర్వహించాలంటే రోజు రోజుకు అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సంస్థకు ఉన్న అతిపెద్ద కస్టమర్ అయిన భారత వైమానికదళం(ఐఏఎఫ్) రెండేండ్ల నుంచి ఎలాంటి చెల్లింపులు జరుపకపోవడం ఇందుకు కారణమని చెప్పారు. గడిచిన రెండు-మూడు దశాబ్దాలుగా మిగులు నగదు నిల్వలు కలిగివున్న సంస్థ తొలిసారిగా రుణం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 2017 నుంచి ఐఏఎఫ్ ఎలాంటి బకాయిలు చెల్లించలేదు. అక్టోబర్ నాటికి రూ.10 వేల కోట్లుగా ఉన్న బకాయి.. డిసెంబర్ 31 నాటికి రూ.15,700 కోట్లకు చేరుకోగా, వచ్చే మార్చి నాటికి రూ.20 వేల కోట్లు దాటనున్నదని అంచనా. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.13,700 కోట్ల బడ్జెట్‌కు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలు పగా.. పెండింగ్‌లోని చెల్లింపులు కలుపుకొని ఆ మరుసటి ఏడాదిలో దీనిని రూ.33,715 కోట్లకు పెంచారు కానీ, వీటిలో వచ్చింది రూ.20,287 కోట్లు మాత్రమే. మిగతా రూ.15 వేల కోట్లకుపైగా చెల్లింపులు జరుపాల్సి ఉన్నది. వీటిలో ఐఏఎఫ్ రూ.14,500 కోట్లు చెల్లించాల్సి ఉండగా, మిగతావి దేశీయ భద్రతా దళాలు, నౌకాదళం, కోస్ట్‌గార్డ్‌ల నుంచి రావాల్సి ఉన్నాయి. సెప్టెంబర్ 2017 నుంచి ఇప్పటి వరకు ఐఏఎఫ్ కేవలం రూ.2 వేల కోట్లు చెల్లించగా, బకాయి రూ.14,500 కోట్లుగా ఉన్నాయి. 2003-04 నుంచి 2017-18 మధ్యకాలంలో కంపెనీ ఎప్పుడు ఇంత తక్కువ బ్యాలెన్స్ షీట్‌ను కలిగివుండలేదు. 2003-04లో రూ.4,841 కోట్ల నిధులు కలిగివున్న సంస్థ.. గడిచిన ఆర్థిక సంవత్సరానికి రూ.6,524 కోట్లకు పెంచుకున్నది. కానీ సెప్టెంబర్ 30 నాటికి రూ.1,000 కోట్లకు తగ్గింది. నెల నెలా గడుస్తున్న కొద్దీ ఇబ్బందులు పెరుగుతున్నాయి తప్పా తరగడం లేదని, సంస్థ వద్ద ఉన్న ఆర్డర్ల కోసం సామాగ్రిని కొనుగోలు చేయలేకపోతున్నామని మాధవన్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం సంస్థ వద్ద రూ.61,700 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి.

ఆధార్ ఒక గేమ్ ఛేంజర్: జైట్లీ



న్యూఢిల్లీ: దేశంలో ఆధార్ ఒక గేమ్ ఛేంజర్ అని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ఆధార్ వల్ల ఎంతో లాభం జరుగుతోందని, ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. అనవసర వ్యయం తగ్గి తద్వారా మిగిలిన సొమ్ముతో 'ఆయుష్మాన్ భారత్' లాంటి మూడు భారీ సంక్షేమ పథ కాలు అమలు చేసేందుకు వీలవుతోందని అన్నారు. లక్షలమంది పేదలకు ఉచిత వైద్య సేవలందించే 'ఆయుష్మాన్ భారత్'ను అలాగే ప్రారంభిం చామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ఆధార్‌ను విజయవంతంగా అమలు చేస్తే, గతంలో కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయరాహిత్యంగా, ఇష్టం లేకుండా అమలు చేసిందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఫేస్ బుక్‌లో 'ఆధార్ ప్రయోజనాలు -నేడెక్కడ ఉన్నాయి' అనే టైటిల్‌తో ఓ పోస్ట్ చేశారు. సబ్సిడీలు నిజమైన అర్హులకు మాత్రమే ఇవ్వడం ద్వారా గత మార్చి వరకూ ప్రభుత్వం రూ.90వేల కోట్లు ఆదా చేయగలి గిందన్నారు. వివిధ పేర్లతో పలు చోట్ల లబ్ది పొందు తున్నవారు, అనర్హులను తేలిగ్గా గుర్తించగలిగామన్నారు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకా రం ఆధార్ అమలు కారణంగా ఏటా రూ.77వేల కోట్లు ఆదా అవుతు న్నాయని చెప్పారు. అలా ఆదా అయిన సొమ్ముతోనే 'ఆయుష్మాన్ భారత్' వంటి పథకాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ పథకం ద్వారా పేదల ప్రజలకు రూ.5లక్షల ఆరోగ్యబీమా అందిస్తున్నా మని, అలా 10.74కోట్ల మంది పేద లు లబ్ది పొందే అవకాశముందన్నారు. ఆధార్ వల్ల మధ్యవర్తుల జోక్యం తగ్గిందని, దీంతో ప్రయోజనా లన్నీ నేరుగా లబ్దిదారుల ఖాతాలకే చేరుతున్నాయ న్నారు. ఇలాంటి సాంకేతికతను కేవలం భారత్‌లో మాత్రమే అమలు చేస్తున్నామ న్నారు. దాదాపు 22.80 కోట్లమంది పీఏహెచ్ఏఎల్, ఉజ్వల పథకం కింద వంట గ్యాస్ సబ్సిడీ అందు తోందన్నారు. అలాగే 58.24 కోట్ల మంది రేషన్ కార్డుదారులు ఆధార్ అనుసంధానమై ఉన్నారని, 10.33కోట్ల ఎంజీఎన్ఆర్ ఈజీఏ లబ్దిదారులకు వేతనాలు వారి ఖాతాలోనే పడుతున్నాయని తెలిపారు.

విదేశీ విద్యార్థులూ ఇక్కడే ఉండండి : ట్రంప్



వాషింగ్టన్: అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకున్న విదేశీ విద్యార్థులు ఇక్కడే ఉండాలని, అమెరికన్ కంపెనీల అభివృద్ధికి దోహదపడాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. ఇటీవల మీడియాతో మాట్లాడుతూ అమెరికాలో హాస్యాస్పదమైన వలస విధానాల వల్ల ప్రతిభావంతులను కోల్పోతున్నాం అని పేర్కొన్నారు. చట్టబద్ధమైన వలస విధానాల్లో ఉన్న లొసుగులను అంతం చేయాలని.. ప్రతిభ ఆధారిత వలసలను ప్రోత్సహించాలని అన్నారు. ప్రజలు చట్టబద్ధంగా, ప్రతిభ ఆధారంగా అమెరికాకు వలస రావాలని తన యంత్రాంగం భావిస్తోందని చెప్పారు. 'నాకు గొప్ప గొప్ప టెక్ కంపెనీల నుంచి ఫోన్లు వస్తున్నాయి. దేశంలోని మంచి విద్యాసంస్థలలో చదువుకున్న వారిని ఇక్కడ ఉంచలేకపోతున్నాం అని చెపుతున్నారు. వాళ్లు తిరిగి చైనా, జపాన్, తదితర దేశాలకు వెళ్లిపోతున్నారు. వారిని ఇక్కడ ఉంచలేకపోతున్నాం. వాళ్లు ఇక్కడి అత్యుత్తమమైన విద్యాసంస్థల్లో చదువుతున్నారు. వివిధ కారణాల వల్ల వారికి ఇక్కడ ఉండే అవకాశం ఉండట్లేదు. దీంతో గొప్ప ప్రతిభావంతులను కోల్పోతున్నాం. మనం అలా చేయకూడదు' అని ట్రంప్ తెలిపారు. విదేశీ విద్యార్థులు చదువు పూర్తయిన అనంతరం అమెరికాలో ఉండి ఉద్యోగం చేసుకునే విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ట్రంప్ ప్రస్తావించారు. ఈ విషయంపై డెమోక్రటిక్ కాంగ్రెషనల్ నేతలతో చర్చించినట్లు చెప్పారు. గొప్ప కంపెనీలను, ప్రతిభావంతులను వదులుకోమని చెప్పారు. ఆశ్రయం కావాలని కోరుకునే వారికి చట్టబద్ధమైన విధానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల కాలిఫోర్నియాలో భారత సంతతికి చెందిన పోలీసు అధికారిని అక్రమ వలసదారుడు కాల్చి చంపడంపై స్పందించిన ట్రంప్.. అమెరికన్లను సురక్షితంగా ఉంచేందుకు సరిహద్దులు మరింత భద్రంగా ఉండాలని వెల్లడించారు.

లక్ష్యం చేరని జీఎస్టీ వసూళ్లు

- దాదాపు రూ.లక్ష కోట్లు తగ్గొచ్చు: నిపుణులు
- ద్రవ్యలోటు మరింత పెరిగేందుకు అవకాశం..



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఆగమేఘాలపై అమలులోకి తెచ్చిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఖజానాకు తగిన ఆదాయాన్ని ఇవ్వడం లేదు. గతేడాది జులై నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే అప్పటి నుంచి సర్కారుకు ఆశించిన రెవెన్యూ రావడం లేదు. 2018-19 బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రస్తుత ఏడాదికి రూ.13,48,000 కోట్ల పన్ను ఆదాయాన్ని జీఎస్టీ రూపంలో వసూలు చేయాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. సగటున నెలకు దాదాపు రూ.1,12,000 కోట్ల రూపాయల జీఎస్టీ ఆదాయాన్ని వసూలు చేయాలన్న మాట. అయితే పన్ను వసూళ్ల శాఖ ఏ ఒక్క నెల కూడా ఈ లక్ష్యాన్ని అందుకోలేక పోయింది. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఆశించిన రాబడిలో దాదాపు లక్ష కోట్ల రూపాయలు తగ్గొచ్చని 'కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్' అంచనా వేసింది. పర్యవసానంగా ద్రవ్యలోటు 3.5 శాతం కన్నా పెరిగే ప్రమాదం పొంచి ఉందని తెలిపింది. ద్రవ్యలోటు (రెవెన్యూ, ఖర్చు మధ్యనుండే వ్యత్యాసం)ను తగ్గించేందుకు రిజర్వ్ నిధులను అందజేయాల్సిందిగా భారతీయ రిజర్వ్ బ్యాంక్‌పై మోదీ ప్రభుత్వం ఒత్తిడి తేవడానికి ఇదీ ఒక కారణం కావొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

అధికారుల పనితీరే కారణమా..

లక్ష్యంగా పెట్టుకున్న రాబడికి, వసూళ్లకు మధ్య ఎందుకు ఇంత వ్యత్యాసం వచ్చిందో కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికీ అర్థం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వ పన్ను అధికారుల సామర్థ్యాన్ని మరోసారి సమీక్షించాల్సిందిగా కోరుతూ కేంద్ర ఆర్థిక కార్యదర్శి హష్ముక్ అధియా కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డుకు గత జూన్ నెలలో ఓ లేఖ రాశారు. కొన్ని రాష్ట్రాలు కేంద్రాని కన్నా ఎక్కువ జీఎస్టీ వసూళ్లను రాబట్టాయని, రాష్ట్రాల అధికారుల కన్నా కేంద్రం అధికారుల తీరు అధ్వాన్నంగా ఉందా? అని కూడా ఆ లేఖలో ఆయన ప్రశ్నించారు. టర్నోవర్ ఏడాదికి కోటిన్నర తక్కువుండే వ్యాపార సంస్థలపై విధించే జీఎస్టీ పన్నులో 90 శాతం రాష్ట్రాలకు వెళుతుంది. మిగతా పది శాతం కేంద్రానికి వస్తుంది. ఏడాదికి కోటిన్నర రూపాయలకు పైగా టర్నోవరుండే సంస్థలపై విధించే జీఎస్టీ పన్నులో కేంద్రానికి, రాష్ట్రానికి చెరి యాభై శాతం లభిస్తుంది. 2015-16 ఆర్థిక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని ప్రతి రాష్ట్రానికి పన్ను రాబడి ఏటా 14 శాతం పెరగాలి. అలా పెరగక తగ్గినట్లయితే ఆ వ్యత్యాసాన్ని కేంద్రం భరించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రస్తుత ఆర్థిక సంవత్సఆరినికి పలు రాష్ట్రాలకు 3,899 కోట్ల రూపాయలను చెల్లించాల్సి ఉంది. మరో రెండు నెలలు పోతే ఈ మొత్తం మరో నాలుగింతలు పెరుగుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కేంద్రం ప్రతి రెండు నెలలకోసారి రాష్ట్రానికి రాబడి వ్యత్యాసాలను చెల్లించాల్సి ఉంటుంది. గతంతో పోలిస్తే ఈ సారి రాష్ట్రాల పరిస్థితి మెరుగ్గానే ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల జీఎస్టీ రాబడి 16 శాతం తగ్గగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాబడి 13 శాతం మాత్రమే తగ్గింది.

రిటర్నుల దాఖలు అంతంతే..

వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఎగ్గొడుతూ రిటర్నులను దాఖలు చేయని వారి సంఖ్య దేశంలో క్రమంగా పెరుగుతూ వస్తోంది. జీఎస్టీకి సంబంధించిన రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య రోజురోజుకు ఆందోళనకరంగా కనిపిస్తోంది. గడిచిన ఏడాది కాలంలో జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య దాదాపు మూడు రెట్లు పెరిగింది. 2017 నవంబరులో 10.56 శాతంగా ఉన్న పన్ను రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య .. గడిచిన నవంబరు మాసానికి 28.75 శాతానికి పెరిగింది. ఈ విషయాన్ని స్వయంగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌సభకు తెలిపారు. జులై-సెప్టెంబరు మధ్య కాలంలో పన్ను రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య 25.37 శాతం పెరిగిందని ఆయన వివరించారు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఈ సంఖ్య కేవలం 15.03 శాతంగా నమోదు అయినట్టుగా ఆయన వివరించారు. ఇదే సమయంలో దేశంలో నకిలీ ఇన్వాయిస్‌లతో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను కోరుతున్న వారి సంఖ్యలో కూడా నాలుగు నుంచి 499కి పెరిగినట్టుగా మంత్రి తెలిపారు.

దగ్గును తగ్గించే శక్తివంతమైన ఔషధాలు

సాధారణంగా వచ్చే దగ్గు శ్వాస గొట్టాలలో చిరాకులను కలిగించి, శ్వాస తీసుకోటానికి ఇబ్బందిని కలుగ చేస్తుంది. దగ్గు వివిధ కారణాల వలన కూడా రావటానికి అవకాశం ఉంది. దుమ్ము వలన కలిగే అలర్జీ, కాలుష్యం, ధూమపానం, గొంతులో ఇన్ఫ్లమేషన్, అంతేకాకుండా ఉపిరితిత్తుల కాన్సర్, ఆస్తమా, సైనస్, ఫ్లూ, గుండె సంబంధిత వ్యాధులు, వాతావరణంలో మార్పుల వలన కూడా దగ్గు రావచ్చు.



దగ్గుకు చికిత్సగా దగ్గు టానిక్, డ్రాప్స్, వంటి అల్లోపతి మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. కానీ ఇంట్లో ఉండే ఔషధాలు అల్లోపతి మందుల కన్నా శక్తివంతంగా పని చేస్తాయని రుజువైంది. ఈ ఔషధాలు దగ్గుని మాత్రమే కాకుండా దాన్ని కలుగచేసే కారకాలను కూడా తొలగిస్తాయి.

'పెన్న స్టేట్ యూనివర్సిటీ' వాళ్ళు తెలిపిన దాని ప్రకారం తేనే కలిగి ఉండే యాంటీ-బాక్టీరియల్ గుణాలు, రోగకారక బ్యాక్టీరియాలను హోస్ట్ (పరాన్నజీవి) పద్దతి ద్వారా చంపి వేస్తాయి. తేనే యాంటీ-ఆక్సిడెంట్'లను కలిగి ఉండటం వలన శ్వాస గొట్టాలకు కలిగిన గాయాలను త్వరగా మాన్పించేస్తుంది.

అల్లం-వెల్లుల్లి



దగ్గుకి అల్లం, వెల్లులి మంచి ఔషధాలని చాలా మంది వైద్యులు వెల్లడించారు. అల్లం-వెల్లుల్లితో తయారు చేసిన టీ గొంతుని తడిపి, మ్యూకస్'ను తొలగించడంతోపాటు శ్వాసని సులభతరం చేస్తుంది.

బాదం గింజలు



కొన్ని బాదం గింజలను తీసుకొని వాటిని మెత్తగా దంచండి. వీటికి తేనెని కలిపి చిక్కని పేస్ట్'లా తయారుచేయండి. దగ్గు నుండి విముక్తి కోసం ఈ మిశ్రమాన్ని రోజుకి మూడు సార్లు తీసుకోండి.

పసుపు

ఇంట్లో ఉండే పసుపు దగ్గుకి శక్తివంతంగా పని చేసే ఔషధం. రోజు ఒక గ్లాసు వేడి పాలలో కలుపుకొని తాగటం చాలా మంచిది. ఇది చాతిలో గడ్డ కట్టిన పదార్థాలను, శ్లేష్మాన్ని తొలగించి, శ్వాస తీసుకోటాన్ని సులభతరం చేస్తుంది.

ఉల్లి



ఉల్లిపాయ రసం చాతిలో గడ్డ కట్టిన పదార్థాలను, ఉపిరితిత్తులలో ఉండే శ్లేష్మాన్ని తొలగించి శ్వాసలో ఇబ్బందులు లేకుండా చేస్తుంది.

సొంఫ్ విత్తనాలు



రోగి ఎక్కువగా పొడి దగ్గు వలన ఇబ్బంది పడుతున్న పుడు, సొంఫ్ విత్తనాలతో చేసిన టీ ఇంట్లో ఉండే ఔషధాలతో మంచి చికిత్స, చాతిలో ఉండే శ్లేష్మంతోపాటు గడ్డ కట్టిన పదార్థాలను తొలగిస్తుంది.

ద్రాక్ష పండ్లు

ద్రాక్ష పండ్లతో చేసిన రసం కూడా దగ్గుని తగ్గించే శక్తివంతమైన ఔషధం. 'మీకు శ్వాస గొట్టాలు చిరాకుగా అనిపించినపుడు ద్రాక్ష పండ్ల రసంలో తేనెని కలిపి తీసుకోవటం



మంచిది' అని వైద్యులు కూడా సలహా ఇస్తున్నారు. ఇది ఎక్స్పెక్టోరెంట్'గా పని చేసి గాలిని ఉపిరితిత్తులకు అందేలా చేస్తుంది.

నల్ల మిరియాలు

ఇవి దగ్గుని త్వరగా తగ్గిస్తాయి, వీటిని దగ్గు నివారణ మందుల తయారీలలో కుడా వాడతారు. ఎండిన అల్లం, నల్ల మిరియాలను సమాన పాళ్ళలో కలిపి, తేనేని కలుపుతూ పేస్టు'లా చేసి, రోజులో కొన్ని సార్లు వాడటం వలన దగ్గు నుండి త్వరగా ఉపశమనం పొందవచ్చు.



కొవ్వును కరిగించే ఆహార పదార్థాలివే..

ప్రస్తుత కాలంలో కొలెస్ట్రాల్, బెల్లీ ఫ్యాట్‌లు అందరినీ వేధించే సమస్యలుగా ఉన్నాయి. దీనికి కారణం సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, రెగ్యులర్‌గా వ్యాయామం చేయకపోవడం వలన బరువు పెరిగిపోతున్నారు. ఒక్కసారి బరువు పెరిగిన తరువాత తగ్గడం చాలా కష్టమైనపని.



కొన్ని సందర్భాల్లో కొంతమంది ఎన్ని విధాలుగా ప్రయత్నించినా.. బరువు తగ్గకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతుంటారు. అయితే శరీరంలో కొవ్వు పేరుకుపోవడానికి కారణమయ్యే ఆహారపదార్థాల గురించి తెలుసుకుంటే.. బరువు పెరగకుండా.. కొలెస్ట్రాల్‌కి దూరంగా ఉండవచ్చు.

- పండ్లు యాపిల్, గ్రేప్స్, స్ట్రాబెర్రీ, సిట్రస్ వంటి పండ్లు రోజువారీ తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొవ్వు పదార్థాల స్థాయిలు తగ్గుతాయి. అలాగే ఆహారం సులువుగా జీర్ణమవుతుంది.
- ఓట్స్ కొవ్వును తగ్గించడంలో చాలా శక్తివంతంగా పని చేస్తుంది. దీని ద్వారా రోజుకి 25 నుంచి 35 గ్రాముల ఫైబర్ పొందవచ్చు. కాబట్టి ఓట్స్‌ను రెగ్యులర్‌గా తీసుకోవడం వలన అధిక బరువుకి చెక్ పెట్టవచ్చు.
- అవకాడోలో గుండె ఆరోగ్యంగా ఉండడానికి కావలసిన మోనో శ్యాచురేటెడ్ ఫ్యాట్ కలిగి ఉంటుంది. వీటిని తీసుకోవడం వలన శరీరంలో మంచి కొవ్వు పదార్థాలను పెంచి, చెడు కొవ్వు పదార్థాలను తగ్గిస్తాయి.
- గ్రెయిన్స్ బార్లీ, ఓట్స్ వంటి ఓల్ గ్రెయిన్స్ గుండె సంబంధిత వ్యాధుల నుంచి కాపాడతాయి. గ్రెయిన్స్ వల్ల శరీరంలో చెడు కొవ్వు పదార్థాలు తగ్గుతాయి. దీని వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించుకోవచ్చు.
- బీన్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. రకరకాల రూపాల్లో లభించే బీన్స్ తీసుకోవడం వల్ల శరీర బరువు తగ్గించుకోవచ్చు. కొవ్వు పదార్థాలను కరిగించుకోవచ్చు.



చేపలు తింటే ఆరోగ్యం పదిలం

చేపలు మెదడుకు ఎంతో మేలు చేస్తాయి. మెదడుకు కీలకమైన కొవ్వు ఆమ్లాలను (ఈఎఫ్ఏ) మన శరీరం తయారు చేసుకోలేదు. వీటిని ఆహారం ద్వారానే పొందాల్సి ఉంటుంది. వీటిల్లో కీలకమైనది ఒమేగా 3 కొవ్వు ఆమ్లం. ఇది చేపల్లో, అవిసెలు, సోయాబీన్స్, అక్రోట్ల వంటి ఎండు పండ్లలో ఉంటుంది. వీటిని తరచూ తీసుకోవటం వల్ల మెదడు పనితీరే కాదు, గుండె, కీళ్ల ఆరోగ్యమూ మెరుగవుతుంది. అలాగే టమోటాల్లో లైకోపేన్ అనే రసాయనం పుష్కలంగా ఉంటుంది. ఇది మనకు మేలు చేసే యాంటీఆక్సిడెంట్. అంటే మన శరీరమంతా విశృంఖలంగా తిరుగుతూ కణాలను దెబ్బతీస్తుండే ఫ్రీ ర్యాడికల్ కణాలను అడ్డుకునే రసాయనం అన్నమాట. దీనివల్ల నాడీకణాలు కూడా దెబ్బతినకుండా ఉంటాయి. టమోటాలను ఉడికించి తింటే శరీరం లైకోపేన్‌ను మరింతగా గ్రహిస్తుంది. మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే.. చేపలు, టమోటాలతో పాటు బి విటమిన్లు ఆకుకూరలు, చికెన్, గుడ్లు తీసుకోవాలి.



అమ్మాయి ఐలవ్యూ చెప్తే..
అబ్బాయి రోడ్డుపై డ్యాన్స్ చేస్తాడా?



మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, కియారా అద్వాని జంటగా తెరకెక్కిన చిత్రం 'వినయ విధేయ రామ'. వివేక్ ఒబెరాయ్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. ప్రశాంత్, స్నేహ, ఆర్యన్ రాజేష్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా బోయపాటి ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఆయన సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలు హైలైట్‌గా ఉంటాయి. హీరో వంద మందిని మట్టికరిపించడం వంటి సీన్స్ బోయపాటి సినిమాలోనే మనకు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ఈ రోజుల్లో ఇవి వర్కవుట్ అవుతాయా? లేదా? అన్నదానిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ.. "సినిమా అనేది ఓ కల. మనం చేయాలని, చేయలేని విషయాలు కొన్నుంటాయి. అవి తెరపై కథానాయకుడు చేస్తుంటే.. ప్రేక్షకులు ఆనందిస్తుంటారు. వాళ్లేం లెక్కలేసుకుని చూడరు. లాజిక్కులు వేసుకోరు. నిజ జీవితంలో ఓ అమ్మాయి 'ఐ లవ్ యూ' చెబితే... అబ్బాయి రోడ్డు మీద అప్పటికప్పుడు డాన్స్ చేసుకుంటూ పాట పాడుతుంటాడా? ఇవేం నిజ జీవితంలో జరగవని ప్రేక్షకులకు తెలుసు. కానీ వాళ్లు ఆస్వాదిస్తున్నారంటే అర్థం ఏమిటి? యాక్షన్ కోసమే యాక్షన్ అన్నది నాకు ఇష్టం ఉండదు. సన్నివేశాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి.. నా హీరో విజృంభిస్తుంటాడు" అని చెప్పుకొచ్చారు.

సింగిల్ టేక్‌లో 7 నిమిషాల ఫైట్



కొందరిని సింగిల్ టేక్ ఆర్టిస్ట్ అంటూ పొగిడేస్తుంటారు. ఎంత పెద్ద సీన్ ని అయినా ఎంత పెద్ద డైలాగ్‌ని అయినా ఒకే టేక్‌లో పూర్తిచేస్తే అతడికి ఆన్ లొకేషన్ క్లాప్స్ పడతాయి. అలా ఎన్నోసార్లు ఎందరో స్టార్లు తమ ప్రతిభా పాటవం చూపించారు కాబట్టే పెద్ద స్టార్లుగా ఎదిగారు. నటించమంటే జీవించే ఆర్టిస్టులే మనకు ఎక్కువ. మన స్టార్ హీరోల్లో సీనియర్ హీరోలంతా ఈ తరహా ప్రతిభను చూపించారు. పీఎస్ వీ గరుడ వేగ లాంటి చిత్రంలో సీనియర్ హీరో రాజశేఖర్ యాక్షన్ కి అంతే గొప్ప పేరొచ్చింది. ఆ సినిమా కోసం డూప్ లేకుండా ఫైట్స్ చేశారాయన. సింగిల్ టేక్ ఆర్టిస్టుగా పలు సన్నివేశాల్లో నటించారు. ఎన్ఐఏ అధికారికంగా ఫెంటాస్టిక్ పెర్ఫామెన్స్ తో ఆకట్టుకున్నారు. ఈసారి కూడా అలాంటి ఫీట్ ని రాజశేఖర్ రిపీట్ చేస్తున్నారట. ఇంకా చెప్పాలంటే అంతకుమించి చేశారట. ప్రస్తుతం డా.రాజశేఖర్ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కల్కి ఆన్ సెట్స్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం ఓ కీలకమైన యాక్షన్ ఎపిసోడ్ ని ఇటీవల చిత్రీకరించారట. ఏడు నిమిషాల పాటు ఎలాంటి గ్యాప్ లేకుండా నాన్ స్టాప్ గా ఒకటే ఫైట్ సీన్. అందులో రాజశేఖర్ సింగిల్ టేక్ లో ఎలాంటి గ్యాప్ లేకుండా నటించి మెప్పించారట. ఆ క్షణం ఊపిరిసలపనంతగా.. ఆన్ లొకేషన్ క్లాప్స్ పడ్డాయని తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రాజశేఖర్ డేర్ డెవిల్ స్టంట్స్ ఆద్యంతం కుర్చీ అంచుమీద కూచోబెడతాన్న టాక్ వినిపిస్తోంది. ఏడు నిమిషాల యాక్షన్ ఎపిసోడ్ ని సింగిల్ టేక్ లో పూర్తి చేయడం అంటే అదేమంత సులువేం కాదు. రాజశేఖర్ ఎంతో డెడికేషన్ ఉన్న స్టార్ కాబట్టే ఇది సాధ్యమైందని యూనిట్ సభ్యులు తెగ పొగిడేస్తున్నారట. అ! లాంటి థ్రిల్లర్ మూవీతో ప్రయోగం చేసి విజయం అందుకున్నాడు ప్రశాంత్ వర్మ. ఈ సారి రాజశేఖర్ ని తన కెరీర్ బెస్ట్ గా చూపించే ప్రయత్నం చేస్తున్నాడట ఈ యంగ్ డైరెక్టర్. మొత్తానికి రాజశేఖర్ కి సరైనోడు తగిలాడని టాక్ వినిపిస్తోంది. కల్కి తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో పీరియాడికల్ నేపథ్యం ఉన్న చిత్రం. అందుకు తగ్గ ఆహార్యంతో రాజశేఖరుడు మైమరిపిస్తాడట.



దర్శకురాలిగా నాకిది గొప్ప ఛాలెంజ్
'మణి కర్ణిక'పై కంగనా రనౌత్



ఒక సినిమాకు దర్శకనటిగా వ్యవహరించడం అంత తేలికైన పని కాదని, అందుకు ఎంతో అంకితభావం అవసరమని నటి కంగనా రనౌత్ పేర్కొంది. జీ స్టూడియోస్, కమల్‌జెయిన్‌ల సంయుక్త నిర్మాణంలో భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న చిత్రం 'మణికర్ణిక'. టాలీవుడ్ దర్శకుడు క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ), కంగనా రనౌత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాణి మణి కర్ణికగా కంగనే నటించింది. ఈ వుమెన్ ఓరియెంటెడ్ చిత్రంలో జిస్సూసేన్ గుప్తా, సోనూసూద్, అతుల్‌కుల్‌కర్ణీ ఇతర ముఖ్యపాత్రలు పోషించారు. హిందీలో రూపొందించిన ఈ చిత్రం ఈనెల 25వ తేదీ తమిళం, తెలుగు భాషల్లో కూడా ఏకకాలంలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంబంధించిన తమిళ ట్రైలర్‌ను చెన్నైలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కంగనా రనౌత్, నిర్మాత కమల్‌జెయిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంగనా రనౌత్ మాట్లాడుతూ 'ఒక సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తూనే, దర్శకురాలిగా ఉండటం చాలా కష్టమైన పని. కానీ నా అదృష్టం కొద్ది క్రిష్ సహాయం చెయ్యడం వల్ల కథపైన ఎక్కువ దృష్టి పెట్టాను. మామూలుగా నటులు షాట్ అయిన తర్వాత కేరవన్‌లోకి వెళ్లి రిలాక్సవుతారు. కానీ దర్శకురాలిని కాబట్టి ఆ తర్వాత కెమెరా దగ్గరకు వచ్చి నుంచు నేదాన్ని' అని చెప్పింది. స్క్రిప్ గురించి మాట్లాడుతూ, 'ప్రీపొడక్షన్ దగ్గర ఎక్కువ సమయం గడిపాను. సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయ్ కథ నేపథ్యంతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం తప్పకుండా సూపర్‌హిట్టవుతుంది. సినిమా ప్రారంభంలో 50 కిలోల బరువు మాత్రమే ఉన్న నేను యుద్ధవీరు రాలి పాత్రకు సరిపోనేమోనని కంగారుపడ్డారు. కానీ క్రమంగా బరువును పెంచుకొని, రోజుకు పది-పన్నెండు గంటలు సాధన చెయ్యగలిగాను' అని వివరించింది.

పండగక్కీ బిజీనే...



సంక్రాంతి పర్వదినం అంటే కుటుంబ సమేతంగా చేసుకునే పండగ. భోగిరోజు నలుగు స్నానం.. సంక్రాంతి రోజు పూజలు పునస్కారాలు.. ముగ్గుల పోటీలు.. కనుమ రోజు కోడి పందేలు.. బూరెలు- గారెలు- జంతికలు ఆరగించడాలు.. ఇవన్నీ కుటుంబ సమేతంగా ఆస్వాదిస్తేనే కిక్కు. అయితే ఇలాంటి సంబరాల వేళ అయినా నలుగురూ కలుసుకోలేనంత బిజీ లైఫ్‌కి అలవాటు పడిపోయారంతా. ఇక సెలబ్రిటీల సన్నివేశం అందుకు మినహాయింపేమీ కాదు. ఉద్యోగ ఒత్తిళ్లు వృత్తిగతంగా ఒత్తిళ్లకు జీవితం బలైనా సెలబ్రిటీలు అప్పుడప్పుడు కుటుంబ సమేతంగా పండగలు పబ్బాలకు కలిసే ఏర్పాట్లు చేసుకోవడం చూస్తున్నాం. ఈ సంప్రదాయం అందరూ కాకపోయినా కొందరు పాటిస్తున్నారు. అందులో మెగా ఫ్యామిలీ నందమూరి ఫ్యామిలీ అక్కినేని ఫ్యామిలీ దగ్గుబాటి మంచు ఫ్యామిలీస్.. ఇలా అందరికీ టాలీవుడ్ లో సంక్రాంతి ఎంతో ప్రత్యేకమైనదే. కుటుంబ సమేతంగా ఉత్సవాలకు ఇష్టపడతారు. ఇక మెగా కాంపౌండ్ అయితే బెంగళూరు ఫామ్ హౌస్‌లో (తోట)లో సంక్రాంతి సంబరాల్ని ప్రతియేటా జరుపుకుంటున్నారు. కుటుంబంలోని హీరోలతో పాటు పిల్లలు పెద్దలు అంతా ఇక్కడ సందడి చేస్తుంటారు. అయితే ఈసారి మాత్రం సీన్ వేరేగా ఉందని తెలుస్తోంది. సంక్రాంతి సెలబ్రేషన్స్‌కు మెగాస్టార్ చిరంజీవి రామ్ చరణ్ దూరంగానే ఉంటున్నారట. చిరు సైరాతో బిజీ బిజీ. చరణ్ వీవీఆర్ ప్రమోషన్స్ ఆర్.ఆర్.ఆర్ తో బిజీ.. అందుకే ఈసారి బెంగళూరు ఫామ్ హౌస్ సెలబ్రేషన్స్ కు మెగా ఫ్యామిలీలో కొందరే అటెండ్ అవుతారట. మెయిన్ స్టార్లు మిస్సవుతున్నారని తెలుస్తోంది. చరణ్ తారక్‌ల కోసం ఆర్.ఆర్.ఆర్ షూట్‌కి రాజమౌళి బ్రేకిస్తారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. అలాగే నటసింహా నందమూరి బాలకృష్ణ కూడా ఈసారి బిజీ షెడ్యూల్స్‌తో సంక్రాంతి వేడుకల్ని కుటుంబ సమేతంగా జరుపుకునే ఆస్కారం లేదని చెబుతున్నారు. ఓవైపు ఎన్టీఆర్ - కథానాయకుడు ప్రమోషన్స్ తో బిజీ.. మరోవైపు మహానాయకుడు ప్రచారం పెండింగ్ పనులతో బిజీ. మహానాయకుడు చివరి షెడ్యూల్ ని రెండు వారాల్లో పూర్తి చేయాలంటే జనవరి 12 నుంచి బాలయ్యబాబు షూటింగ్ లో పాల్గొనాల్సి ఉంటుందిట. డెడ్ లైన్ ప్రకారం ఫిబ్రవరి 7న మహానాయకుడు రిలీజ్ కావాలంటే అంతకంటే గత్యంతరం లేదుట. అందువల్ల సంక్రాంతిని ఎన్ బీకే మిస్సవుతున్నారని తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ ఒకేసారి సాహో జాన్ చిత్రాలతో ఫుల్ బిజీ బిజీగా ఉన్నాడు. అందువల్ల అతడు కూడా సంక్రాంతికి అందుబాటులో ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. మొత్తానికి మన స్టార్లు కెరీర్ పరమైన బిజీలో పెద్ద పండక్కి దూరమవుతు న్నారు. అయితే ఈ త్యాగం అభిమానులు ఆడియెన్ ని రంజింపజేసేందుకు ఉల్లాసంగా ఉత్సాహంగా వినోదం పంచేందుకేనని అర్థం చేసుకోవచ్చు.



పూజా హెగ్డే.. అరవింద సమేత సినిమా హిట్‌తో సూపర్ జోష్‌లో ఉంది. దీంతో వెంటనే హాలీడ్ ట్రిప్‌కు ప్లాన్ చేసుకుంది. ఎలాగూ న్యూ ఇయర్ కూడా రావడంతో ఫ్యామిలీతో న్యూయార్క్ చెక్కేసింది. అక్కడ న్యూ ఇయర్ వేడుకలను బీభత్సంగా ఎంజాయ్ చేసిందట పూజ. ఈసం దర్భంగా సాక్స్ ఫిఫ్త్ ఎవెన్యూ, రాకెఫెల్లర్ సెంటర్, యూని వర్సల్ స్టూడియోస్ ప్రదేశాల్లో ఫోటోలు దిగి తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో షేర్ చేసింది.



పీడీపీకి మరో ఎదురుదెబ్బ



శ్రీనగర్ : జమ్మూకాశ్మీరులో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ(పీడీపీ)కి మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి జావేద్ ముస్తఫా మీర్ ఆదివారం పీడీపీకి రాజీనామా చేశారు. మెహబూబా ముఫ్తీ కేబినెట్‌లో ఆయన రెవెన్యూ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ఆయనను కేబినెట్ నుంచి తప్పించారు. మీర్ కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. పీడీపీ నుంచి బయటికి వెళ్లిన నాయకుల్లో మీర్ కూడా ప్రముఖుడే. మాజీమంత్రి సయ్యద్ బషరత్ బుఖారీ, హసీబ్ ద్రాబు, ఇమ్రాన్ అన్సారీలతో పాటు మీర్ పీడీపీని వీడారు. ఇద్దరు ఎమ్మెల్సీలు యాసిర్ రేష్మి, సైఫుద్దీన్ భట్ ఇప్పటికే పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఎమ్మెల్యే అబ్బాస్ వనీ కూడా ఇంతకుముందే పీడీపీకి రాజీనామా చేశారు.

ఆప్‌కు పంజాబ్ ఎమ్మెల్యే రాజీనామా



న్యూఢిల్లీ : ఆప్ పంజాబ్ శాసనసభ్యుడు సుఖ్‌పాల్ ఖైరా ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు నాయకులు ఆమ్ ఆద్మీ పార్టీని వీడారు. హెచ్‌ఎస్ ఫూల్కా ఆప్‌కు గుడ్‌బై చెప్పిన రెండు రోజుల తర్వాత ఖైరా రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఖైరా పంపారు. తన మూల సిద్ధాంతాలు, సూత్రాల నుంచి ఆప్ పక్కకు తప్పుకుంటుందని ఖైరా ఆరోపించారు. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమం స్ఫూర్తితో ఆప్ ఆవిర్భవించిందని, ఇప్పుడు ఆ మార్గాన్ని పార్టీ వదిలిపెట్టిందని నిందించారు. హెచ్‌ఎస్ ఫూల్కా సైతం ఇవే తరహా ఆరోపణలు చేశారు. పార్టీ తన మూల సిద్ధాంతాన్ని విస్మరించిందని వ్యాఖ్యానించారు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం నేపథ్యంలో 2012లో ఇతరులతో కలిసి కేజ్రీవాల్ ఆప్‌ను ఏర్పాటు చేశారు. ఫూల్కా మాదిరిగా కాకుండా ఆప్ నాయకత్వంలో ఖైరాకు బలమైన బంధం ఉంది. పంజాబ్ అసెంబ్లీలో ఆప్ పక్ష నాయకుడి పదవి నుంచి ఖైరాను జూలైలో తప్పించారు. ఆయన స్థానంలో హర్పాల్ సింగ్ చీమాను నియమించారు. ఆ తర్వాత కేంద్ర పార్టీతో సంబంధం లేకుండా పంజాబ్ ఆప్ స్వయం ప్రతిపత్తితో పనిచేస్తుందని ఖైరా ప్రకటించారు. కాగా కార్యకర్తల సదస్సుకు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలతో పాటు పంజాబ్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేల్లో 8 మంది హాజరయ్యారు.

ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల రుణమాఫీ

జైపూర్ : రాజస్థాన్‌లోని కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల రుణమాఫీకి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు అంతర్గత శాఖ ప్యానెల్ ముఖ్యమంత్రి అశోక్ గేహ్లోట్‌కు సిఫార్సులను పంపింది. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శాంతి ధరివాల్ అధ్యక్షత వహించిన కమిటీ ఆత్మహత్యలకు పాల్పడిన రైతు రుణాలు ఏ బ్యాంకులో ఎంతమేరకు ఉన్నప్పటికీ రద్దు చేసేందుకు సిఫార్సులు చేస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి పర్సది లాల్ మీనా, కమిటీ సభ్యులు వెల్లడించారు. దీనిపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటామన్నారు. కోఆపరేటివ్, ప్రభుత్వరంగ బ్యాంకుల్లోని రూ.2 లక్షల వరకు ఉన్న వ్యవసాయ రుణాలను రద్దు చేస్తామని డిసెంబరు 19న ప్రకటించిన విషయం తెలిసిందే. మరో సమావేశం జనవరి 10న జరగనుంది.

వాచ్‌మేన్‌ను కాల్చిచంపిన మావోయిస్టులు

ఫుల్బని (ఒడిశా) : మావోయిస్టులు రోడ్డునిర్మాణం జరుగుతున్న ప్రాంతంలోని వాచ్‌మెన్‌ను కాల్చివేసి, ఐదు వాహనాలను దహనం చేశారు. బాధితుడిని పోలీసుల ఇన్‌ఫార్మర్‌గా భావించి ఉంటారని పోలీసులు వెల్లడించారు. శనివారం రాత్రి ఫుల్బని సదర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగిందని కంధమాల్ ఎస్పీ ప్రతీక్‌సింగ్ వెల్లడించారు. మూడు ట్రాక్టర్లకు కూడా నిప్పంటించారు. ప్రధానమంత్రి గ్రామ్‌సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకంలో ఈ రోడ్డునిర్మాణం జరుగుతుందన్నారు. వాచ్‌మెన్ రబీంద్రమల్లిక్‌ను అడవిలోకి తీసుకెళ్లి ఈ దురాగతానికి పాల్పడ్డారన్నారు. అక్కడ వారు కొన్ని కరపత్రాలను వదిలారన్నారు. కందమాల్- కలహండి- బౌద్- నయాగర (కేకేబీఎన్)ల్లో మావోయిస్టులు ఈ పనికి పాల్పడినట్లు కరపత్రాలు వదిలారని సింగ్ వెల్లడించారు. ఈ ఘటన తర్వాత భద్రతాదళాలు కూంబింగ్ చేపట్టాయన్నారు. గతేడాది ఇదే ప్రాంతంలో మహిళా మావోయిస్టుతో సహా నలుగురిని పోలీసులు కాల్చి చంపారు.

హెచ్‌ఏఎల్‌కు లక్ష కోట్ల ఆర్డర్లా ?

- ఆ పత్రాలు చూపించు... లేదా రాజీనామా చెయ్
- రాహుల్‌గాంధీ డిమాండు
- నిర్మలా సీతారామన్ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపణ
- జీతాల కోసం అప్పుతీసుకుంటున్నారు : సూర్జేవాలా

న్యూఢిల్లీ : రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌పై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఆ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా నిప్పులు చెరిగారు. రాఫెల్ ఒప్పందం, హెచ్‌ఏఎల్‌పై నిండు సభల ఆమె పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ లేదా హెచ్‌ఏఎల్‌కు లక్ష కోట్ల రూపాయల ఆయుధ సేకరణ ఉత్తర్వులు ఇవ్వడంపై రక్షణమంత్రి అబద్ధాలు వల్లించారని ఆరోపించారు. హెచ్‌ఏఎల్‌కు సింగిల్ ఆర్డర్ కూడా ఇవ్వలేదని, తమ ఉద్యోగుల వేతనాల కోసం ఆ సంస్థ అప్పులు చేసిందని సూర్జేవాలా చెప్పారు. హెచ్‌ఏఎల్‌కు ఆర్డర్లకు సంబంధించిన పత్రాలను పార్లమెంటు ముందు పెట్టాలని లేదా తన పదవికి రాజీనామా చేయాలని నిర్మలా సీతారామన్‌ను రాహుల్ డిమాండు చేశారు. తమ ఉద్యోగులకు వేతనాలు చెల్లించడానికి హెచ్‌ఏఎల్ అప్పులు చేయాల్సి వస్తుందని, దాని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుల ఆరోపణలకు ప్రాధాన్యత ఏర్పడింది. హెచ్‌ఏఎల్‌కే ఆర్డర్లు ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ అవి ఇంకా కార్యరూపం దాల్చలేదని ఓ ఆంగ్ల పత్రిక పేర్కొన్నది. ఈ వ్యవహారంపై హెచ్‌ఏఎల్ ఇప్పటి దాకా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. 'మీరు ఒక అబద్ధం చెప్పారు. దానిని కప్పిపుచ్చుకోవడానికి అనేక అబద్ధాలు చెబుతున్నారు. రాఫెల్ కుంభకోణంపై ప్రధాని నరేంద్రమోడీ చెప్పే అబద్ధాలను సమర్థించడంలో భాగంగా రక్షణమంత్రి పార్లమెంటులో మరో అబద్ధం చెప్పారు. హెచ్‌ఏఎల్‌కు లక్ష కోట్ల రూపాయల ఆర్డర్లు ఇచ్చినట్టు రక్షణమంత్రి రేపు పార్లమెంటుకు పత్రాలు సమర్పించాలి. లేకపోతే తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలి' అని రాహుల్ ట్విట్టర్ వేదికగా



డిమాండు చేశారు. అనిల్ అంబానీకి సంబంధించిన రక్షణ సంస్థ రూకీకి లబ్ధి చేకూర్చడానికిగాను హెచ్‌ఏఎల్‌ను ప్రభుత్వం అసలు పట్టించుకోలేదని కాంగ్రెస్ నిశితంగా విమర్శించింది.

రాఫెల్‌పై చర్చ సందర్భంగా నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో మాట్లాడుతూ హెచ్‌ఏఎల్‌కు ప్రభుత్వం చాలా కాంట్రాక్టులు అప్పగించిందని చెప్పారు. యూపీఏ హయాంలో 126 యుద్ధ విమానాల కొనుగోలుకు హెచ్‌ఏఎల్‌తో చర్చలు జరిగాయని, దానిని కాదని ఎన్‌డీఏ ప్రభుత్వం 36 విమానాల కొనుగోలుకే రాఫెల్‌తో ఒప్పందం చేసుకుందని, అది కూడా యూపీఏ ప్రభుత్వం కన్నా అధిక ధర చెల్లించడానికి అంగీకరించిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇదంతా అంబానీ సంస్థకు లాభం చేకూర్చడానికే మోడీ ప్రభుత్వం అలా చేసిందని నిందించింది. యూపీఏ ఒప్పందం ప్రకారం యుద్ధ విమానాలను హెచ్‌ఏఎల్ భారత్‌లోనే తయారు చేస్తుందని వాదిస్తోంది. ఈ ఆరోపణలను బీజేపీ ప్రభుత్వం, అనిల్ అంబానీ ఖండిస్తున్నారు.

రక్షణ మంత్రి అబద్ధాలు బహిర్గతమయ్యాయని ఆరోపిస్తూ సూర్జేవాలా ట్వీట్ చేశారు. లక్ష కోట్ల రూపాయల ప్రొక్యూర్‌మెంటు ఆర్డర్లను హెచ్‌ఏఎల్‌కు ప్రభుత్వం అప్పగించినట్టు రక్షణమంత్రి చెబుతున్నారని, అయితే, ప్రభుత్వం నుంచి తమకు సింగిల్ ఆర్డర్ రాలేదని హెచ్‌ఏఎల్ మొత్తుకుంటున్నదని సూర్జేవాలా తెలిపారు. తమ ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం కోసం హెచ్‌ఏఎల్ మొదటిసారి రూ.1000 కోట్లు అప్పు తీసుకుందని వివరించారు. తన సూటుబూటు మిత్రుడికి లబ్ధి చేకూర్చడం కోసం హెచ్‌ఏఎల్‌ను నరేంద్రమోడీ బలహీనపరిచారని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వంపై డాక్టర్ల ఆగ్రహం

న్యూఢిల్లీ : డాక్టర్లు వారానికి 40 గంటలు పనిచేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంపై వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారానికి 100 గంటలు పనిచేస్తున్నామని వారు వివరించారు. కేంద్ర అధీనంలోని రామ్‌మనోహర్ లోహియా, సఫ్దర్ జంగ్ , లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజీల్లో డాక్టర్ల పనిగంటలు 40కి మించడం లేదని, కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి అశ్వనీకుమార్ చౌబే లోక్‌సభలో ప్రకటించడంపై వారు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యసేవల్లో నాణ్యతాలోపం, అలసత్వం లేదని ప్రకటిస్తూ డాక్టర్లకు అదనపు పనిగంటలు కూడా లేవని డిసెంబరు 21న ఆయన పార్లమెంటులో ప్రకటించారు. ఎయిమ్స్ డాక్టర్లు దీనిపై స్పందిస్తూ, రోగుల తాకిడి అధికంగా ఉందని, డాక్టర్ల కొరతవల్ల వారానికి 100 నుంచి 120 గంటలు పనిచేస్తున్నామన్నారు. అత్యవసర, కాన్పుల, మహిళాప్రసూతి, ఔషధ, శస్త్రచికిత్స శాఖల్లో మిగతావాటికంటే అధికంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రసూతి, మహిళా విభాగాల్లో ఉదయం 9 గంటలకు డ్యూటీకి వస్తే మరుసటి రోజు సాయంత్రం 6 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుందన్నారు. అధిక ఒత్తిడితో ఒకోసారి అలసత్వం చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. తమ మానసిక, శారీరక ఆరోగ్యం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని డాక్టర్లు వాపోతున్నారు.

పాబుక్ తుపానుకు ఆరెంజ్ హెచ్చరిక

న్యూఢిల్లీ : అండమాన్,నికోబార్ దీవులను తాకనున్న పాబుక్ తుపానుకు కేంద్రప్రభుత్వం ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాల్లో ఈ తుపాను అల్లకల్లోలం సృష్టించే అవకాశాలున్నాయని హోంశాఖ బులిటెన్‌ను విడుదల చేసింది. ప్రజలు సంసిద్ధంగా ఉండాలని ఆరెంజ్ హెచ్చరిక సూచిస్తుంది. అండమాన్, నికోబార్ రాజధాని పోర్టు బ్లేయర్‌కు ఈశాన్యంగా 11.0 ఉత్తర అక్షాంశ, 95.5 రేఖాంశంలో ఈశాన్య దిశలో ఈ తుపాను ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రికి ఇది ఆగ్నేయంగా ప్రయాణిస్తుందని దీంతో 65 నుంచి 75 కిమీల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించారు. ఈశాన్యంగా ప్రయాణించి మయన్మార్ తీరాన్ని తాకుతుందని బులిటెన్ పేర్కొంది.

రెక్కల అతిథులతో 'చిలికా' కళకళ

1.5లక్షలకుపైగా పెరిగిన పక్షుల సంఖ్య



బెర్హంపూర్ : ఆసియాలోనే అతిపెద్ద ఉప్పునీటి సరస్సుగా ఉన్న చిలికా రెక్కల అతిథులతో కళకళలాడుతోంది. శీతాకాలంలో విదేశాల నుంచి వచ్చే పక్షిజాతులు వేసవి వరకు సరస్సులోని నలబానా పక్షి అభయారణ్యంలో ఆశ్రయం పొందుతుంటాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వచ్చిన పక్షుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు అటవీ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం చేపట్టిన పక్షి గణన ఆధారంగా పక్షుల సంఖ్య ఈ ఏడాది 1.55లక్షలకుపైగా పెరిగిందన్నారు. చిలికా వైల్డ్‌లైఫ్ డివిజన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా పక్షుల గణన జరుగుతుంది. దీని ప్రకారం ఈ ఏడాది 181 భిన్నజాతులకు చెందిన 10,47,868 పక్షులు చిలికాలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. వీటిలో 105 వాటర్ ఫౌల్స్ జాతులతో పాటు 76 జాతుల నీటి పక్షులు ఉన్నట్టు చిలికా వణ్యప్రాణి శాఖ అధికారి బికాశ్ రంజన్ దాస్ చెప్పారు. గత శీతాకాలంలో 147 జాతులకు చెందిన 8,93,390 పక్షులు సరస్సులోని నలాబనా ద్వీపకల్పంలో ఉన్నట్టు తెలిపారు. ఇది వారికి ఇష్టమైన ప్రాంతమని అన్నారు. 15.59 చదరపు అడుగులలో విస్తరించిన ఉన్న ఈ అభయారణ్యంలో విదేశీ పక్షులు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. గతేడాది 3,20,826 పక్షులు రాగా, ఈ ఏడాది 3,93,541 విదేశీ పక్షులు వచ్చాయని, పక్కనే ఉన్న మంగలజోడిలో 60వేల పక్షులు ఉన్నాయని అన్నారు. నాలుగేళ్ల తర్వాత లెస్సర్ ఫ్లెమింగోలు రావడంతో పక్షుల శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తంచేశారు. పక్షుల గణన సందర్భంగా 13 రకాల లెస్సర్ ఫ్లెమింగోలను గుర్తించినట్టు రంజన్ దాస్ తెలిపారు. ఈ ఏడాది నార్తన్ పిన్‌టెయిల్స్ అత్యధికంగా వచ్చాయని, వాటి సంఖ్య 2,57,880గా ఉందని చెప్పారు. అక్రమ రొయ్యల సాగుపై చిలికా అభివృద్ధి యంత్రాంగం (సీడీఏ) ఉక్కుపాదం మోపడంతో ఖాళీ స్థలం పెరగడం కూడా విదేశీ పక్షుల రాకకు దోహదపడిందని దాస్ అన్నారు. స్వస్థలాల్లో హిమపాతం కూడా పక్షుల వలసలకు ఒక కారణంగా శాస్త్రవేత్తలు తెలిపారు. వణ్యప్రాణుల సంరక్షణ సంఘాల అధికారులు, కార్యకర్తలు, ముంబైలోని బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్) నుంచి పక్షుల శాస్త్రవేత్తలు సహా 100 మంది పక్షుల గణనలో పాల్గొన్నారు. క్యాస్పియన్ సీ, లేక్ బైకల్, రష్యాలోని మారుమూల ప్రాంతాలు, మధ్యాసియా, ఆగ్నేయాసియా, లడఖ్, హిమాలయాల నుంచి పక్షులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ పక్షులన్నీ వేసవిలో తిరుగు ప్రయాణమవుతాయన్నారు.

ఇకపై రైల్వేస్టేషన్లలోనూ సెక్యూరిటీ చెక్

- ఎయిర్‌పోర్టుల తరహాలో 20 నిమిషాల ముందే బోర్డింగ్
- ఇప్పటికే ప్రయాగ్‌రాజ్, హుబ్లీ స్టేషన్లలో అమలు
- త్వరలో మరో 202 స్టేషన్లల్లో ..



న్యూఢిల్లీ : దేశంలోని రైల్వేస్టేషన్లు త్వరలోనే విమానాశ్రయాలను తలపించనున్నాయి. అదే తరహా ఆంక్షలు, నిమయ నిబంధనలను అమలు చేసే యోచనలో రైల్వే శాఖ ఉంది. దీంతో చివరి నిమిషంలో రైలు ఎక్కే వెసులుబాటు ప్రయాణికులకు ఉండదు. రైలు బయలుదేరే సమయానికి కనీసం 15-20 నిమిషాలు ముందుగానే ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకొని ఎయిర్‌పోర్టుల తరహాలో సెక్యూరిటీ చెక్‌ను ముగించుకొన్న తర్వాతే రైలు ఎక్కాల్సి ఉంటుంది. అత్యాధునిక సాంకేతికతో భద్రతా ఏర్పాట్లు చేసే యోచనలో రైల్వే ఉంది. కుంభమేళా దృష్ట్యా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, కర్నాటకలోని హుబ్లీ స్టేషన్లలో తనిఖీల కోసం అత్యాధునిక యంత్రాంగాలను ఏర్పాటు చేశారు. మరో 202 స్టేషన్లలో ఈ పద్ధతి అమలునకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. రైల్వే రక్షణ దళం డైరెక్టర్ జనరల్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్లను పూర్తిగా సీల్ చేయాలని భావిస్తున్నాం. ప్రవేశ మార్గాలను గుర్తించి, వాటిలో ఎన్నింటిని మూసివేయాలన్నది నిర్ణయిస్తాం. అవసరాన్ని బట్టి కొన్నింటిని శాశ్వతంగా మూసివేస్తాం. అంటే ఆయా చోట్ల గోడలు నిర్మిస్తాం. మిగతా చోట్ల ఆర్పీఎఫ్ పహారాను ఏర్పాటు చేస్తాం. ప్రతి ఎంట్రీ పాయింట్ వద్ద సెక్యూరిటీ చెక్ ఉంటుంది. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వెళ్లినట్లు గంటల ముందే స్టేషన్‌కు చేరుకోవాల్సిన అవసరం లేదు. వారు కేవలం 20 నిమిషాల ముందు రైల్వేస్టేషన్‌కు వస్తే సరిపోతుంది. తాము ఎక్కాల్సిన రైలు సమయాన్ని బట్టి వారు ముందస్తుగా వస్తే భద్రతా సిబ్బంది తనిఖీల కారణంగా ఆలస్యం కాకుండా ఉంటుంది' అని అన్నారు. ఈ క్రమంలో భద్రత పెరుగుతుంది కానీ భద్రతా సిబ్బంది పెరగరని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతుండటంతో సిబ్బంది తగ్గుతారని కుమార్ చెప్పారు. అంచెలంచెలుగా భద్రతాపరమైన తనిఖీలను నిర్వహించడమే కాకుండా రద్దీవేళల్లో స్టేషన్లలోకి ప్రవేశించకముందే ప్రయాణికులను తనిఖీ చేసే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నట్టు ఆయన తెలిపారు. రియల్ టైమ్ ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) సాఫ్ట్‌వేర్ కూడా ఉంటుందని, తద్వారా నేరస్తుల విషయంలో ఆర్పీఎఫ్ కమాండ్ అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం కలుగుతుందని అన్నారు. కాగా, 2016లో ఆమోదం పొందిన ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్ (ఐఎస్ఎస్)లో భాగంగా ఈ భద్రతా ప్రణాళిక రూపొందుతోంది. 202 రైల్వేస్టేషన్లలో నిఘా యంత్రాంగాన్ని పటిష్టపర్చే ఐఎస్ఎస్ ప్రాజెక్టు కోసం రూ.385.06 కోట్లు ఖర్చు అవుతుందన్న అంచనా ఉంది.

జేఎన్‌యూలో పరిస్థితి బాగోలేదు : కవితాసింగ్



బెంగళూరు : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో పరిస్థితులు బాగోలేదని ఇన్ఫోసిస్ 2018 అవార్డు గ్రహీత, వర్సిటీ ప్రొఫెసర్ కవితా సింగ్ అన్నారు. అవార్డు అందుకోవడానికి సెలవు కోరగా, నిరాకరించారని తెలిపారు. బెంగళూరుకు చేరిన తర్వాత ఈ విషయం తెలిసిందన్నారు. శనివారం రాత్రి ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అవార్డును అందుకున్నారు. జేఎన్‌యూలో 17 ఏళ్ల నుంచి పనిచేస్తున్నానని తెలిపారు. వేతనాలు, సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయన్నారు. గతంలో అత్యున్నత అధ్యాపక బృందం ఉండేదని, విద్యావిషయాల్లో స్వేచ్ఛ ఉండేదని ఆమె తెలిపారు. సెలవు మంజూరూ కాకపోవడంతో తన ఈ పర్యటన అనధికారికమౌతుందని ఆమె వివరించారు. సింగ్ జేఎన్‌యూ ఆర్ట్స్ అండ్ ఆస్థటిక్స్‌లో ప్రొఫెసర్, డీన్‌గా వ్యవహరిస్తున్నారు. మొఘల్, రాజ్‌పుట్, దక్కన్ కళల అధ్యయనానికి గాను ఆమెకు ఈ అవార్డు లభించింది. వేర్వేరు రంగల్లో విశేష కృషి చేసిన ఆరుగురిని ఇన్ఫోసిస్ అవార్డు వరించింది.

మోడీ వన్‌మేన్ షోతో మిత్రుల అసంతృప్తి

- బీజేపీ మునిగిపోతున్న నావ అంటున్న భాగస్వాములు
- ప్రధాని నియంతృత్వంపై ఆగ్రహ జ్వాల
- పీటీఐ ఇంటర్వ్యూలో శశి థరూర్



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిరంకుశత్వంతో ఎన్‌డీఏ మిత్రపక్షాలలో నిరాశా, నిస్పృహలు పెరిగిపోతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ చెప్పారు. బీజేపీని మునిగిపోయే నావగా మిత్రులు భావిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో అంతా 'వన్‌మేన్ షో' నడుస్తోందని ఆవేదన చెందుతున్నట్టు పేర్కొన్నారు. 'మీ మిత్రులు మీతో సంతోషంగా లేరు. ఈ విషయం బీజేపీ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మీ పనితీరు, పాలనపై యావత్ దేశం వ్యతిరేకంగా ఉంది' అని బీజేపీని ఉద్దేశించి థరూర్ అన్నారు. 'మోడీ ఏకపక్ష నిర్ణయాల పట్ల ఎన్‌డీఏ మిత్రుల్లో అసహనం పెరుగుతోందనడానికి ఆధారాలు ఉన్నాయి. మోడీ ప్రభుత్వంలో దీనిని మేము స్పష్టంగా చూశాం. ఎన్‌డీఏలో అంతా బాగుందనడానికి వీల్లేదని మిత్రులే చెవులు కొరుక్కుంటున్నారు' అని థరూర్ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. యూపీఏ సంకీర్ణ ప్రభుత్వానికి సమష్టి, సమర్థవంత నాయకత్వం ఉంది. నిర్ణయాలు సమష్టిగా ఉన్నాయి. అందరి వాణి వినిపించేది. అందరి ఆందోళన, అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నారని చెప్పారు. ఎన్‌డీఏలో దీనికి పూర్తి భిన్న వైఖరి నడుస్తుం దని అన్నారు. ఎన్‌డీఏలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ వన్‌మేన్ షో కొనసాగుతోందని, సంకీర్ణ ధర్మాన్ని పాటించడం లేదన్న ఆవేదన కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని తిరువనంతపురం ఎంపీ థరూర్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు కొద్ది నెలల ముందు బీజేపీ ఇద్దరు మిత్రులను దూరం చేసుకుంది. అందులో ఒకటి టీడీపీ కాగా మరొకటి ఉపేంద్ర కుశ్వాహా నాయకత్వంలోని రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ (ఆర్ఎల్ఎస్‌పీ) ఉన్నాయి. టీడీపీ మార్చిలో, ఆర్ఎల్ఎస్‌పీ డిసెంబరులో బీజేపీని వీడాయి. ఉత్తరప్రదేశ్‌లోని తన మిత్రపక్షాలు అప్నాదళ్ (ఎస్), సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్‌పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) నుంచి కాషాయ పార్టీ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నది. మోడీ నాయకత్వంపై ఆ పార్టీలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నాయి. ఎన్‌డీఏ నుంచి టీడీపీ, ఆర్ఎల్ఎస్‌పీ బయటికి వెళ్లడాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు ముక్తార్ అబ్బాస్ నక్వీ చాలా తక్కువ చేసి చూపుతున్నారు. వ్యక్తిగత రాజకీయ కారణాలతో ఎన్‌డీఏ నుంచి బయటికి వెళ్లే వారిని ఆపలేమని వ్యాఖ్యానించారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు మిత్రపక్షాల నుంచి తమ పార్టీకి ఎలాంటి ఒత్తిడి ఉండబోదని చెప్పుకొచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ భాగస్వామ్యపక్షాల అసంతృప్తిపై వస్తున్న వార్తలను ప్రస్తావించగా అప్నాదళ్, రాజ్‌భర్ పార్టీలు బహిరంగంగానే బీజేపీపై ఒత్తిడిని తీవ్రతరం చేయడం ఆశ్చర్యంగానే ఉందని థరూర్ వ్యాఖ్యానించారు. మరోవైపు బీజేపీపై శివసేన నిత్యం దాడి చేస్తోందని, రాఫెల్ కుంభకోణంపై పార్లమెంటులో సైతం బీజేపీని శివసేన నిశితంగా విమర్శించిందని గుర్తుచే శారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో కొత్తగా కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు రుణమాఫీ చేశాయి కదా అని అడుగగా 'మనది అతిపెద్ద వ్యవసాయ ఆర్థిక దేశం. రుణమాఫీ అనేది దీర్ఘకాలిక పరిష్కారమని నేనూ భావించడం లేదు. అయితే, ఎవరికైనా గాయం తగిలితే ముందుగా మనం వారికి ప్రథమ చికిత్స చేస్తాం. గాయానికి మందేస్తాం. ఆ తర్వాత పూర్తిస్థాయి చికిత్స అందజేస్తాం' అని థరూర్ చెప్పారు.

'కాంగ్రెస్ నిరుపయోగ శక్తి'

- బీజేపీని ఓడించేందుకు సిద్ధం
- మాయావతితో పొత్తుపై ఎస్పీ నేత కిరణ్మోయ్ నందా



కోల్‌కతా : బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్‌పీ)తో కలిసి తమ పార్టీ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని ఓడించేందుకు సిద్ధంగా ఉందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పీ) నాయకుడు ఆదివారం తెలిపారు. ఇందుకోసం కాంగ్రెస్ వంటి ఒక 'నిరుపయోగ' శక్తి అవసరం లేదని అన్నారు. అయితే యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీలు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ, అమేథీ నియోజకవర్గాల్లో ఎస్పీ-బీఎస్పీ కూటమి పోటీ చేయకపోవచ్చని కిరణ్మోయ్ నందా సూచనప్రాయంగా తెలిపారు. 'ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ఒక 'నిరుపయోగ శక్తి', అందువల్ల ఆ పార్టీని కలుపుకోవడం లేదా మినహాయించడం గురించి మేము ఆలోచించడం లేదు. బీజేపీని అడ్డుకునేందుకు ఎస్పీ-బీఎస్పీ కూటమి ఒక ప్రధాన శక్తి. కాంగ్రెస్ ఒకటి లేదా రెండు స్థానాల్లో మాత్రమే ఉండవచ్చు. కాంగ్రెస్ తనకు ఏది కావాలో అది నిర్ణయించుకుంటుంది' అని ఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు నందా పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో బీఎస్‌పీ అధినేత్రి మాయావతి, ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్‌లు శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. సీట్లు పంచుకునే విషయమై ఇద్దరు నేతలు చర్చించిన రెండు రోజుల తర్వాత నందా ఈ వ్యాఖ్యలు చేశారు. 'కూటమి రాజకీయ మంత్రానికి సర్దుబాటుకు కాంగ్రెస్ ఇంకా వేచి ఉందని భావిస్తున్నా. బలంగా ఉన్న రాష్ట్రాల్లో తన కూటమి భాగస్వాములకు ఒక అంగుళాన్ని కూడా విడిచిపెట్టడానికి కాంగ్రెస్ పార్టీ ఇష్టపడలేదు. కానీ ఆ పార్టీ బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో ఇతరుల నుంచి భాగస్వామ్యాన్ని ఆశిస్తుంది' అని ఆయన వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను కూటమికి దూరంగా ఉంచడం బీజేపీకి లాభిస్తుందా అన్న ప్రశ్నకు నందా సమాధానమిస్తూ, 'గత అనుభవా లను చూస్తే, ఎస్పీ-బీఎస్పీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ తన అభ్యర్థులను పోటీలో ఉంచింది. అయితే బీజేపీని ఓడించే విషయంలో మేము ఎటువంటి సమస్యా ఎదుర్కోలేదు. కాంగ్రెస్ ఓటు వాటా పూర్తిగా నిరుపయోగం' అని తెలిపారు. ఫుల్పూర్, గోరఖ్‌పూర్ లోక్‌సభ ఉప ఎన్నికలే ఇందుకు నిదర్శనమని ఆయన అన్నారు.

ఇటీవల ఐదు రాష్ట్రాల ఉప ఎన్నికలను ప్రస్తావిస్తూ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో కాంగ్రెస్ ఒక కూటమిని సృష్టించింది. దీంతో ఆ రెండు రాష్ట్రాల్లో బీజేపీ పూర్తి స్థాయిలో పరాజయం పాలయ్యిందని నందా చెప్పారు. ఇదిలాఉండగా, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో ఎస్పీ-బీఎస్పీతో ముందస్తు ఎన్నికల పొత్తుకు కాంగ్రెస్ వెళ్లి ఉంటే అని ప్రశ్నించగా, దానికి సమాధానం లేదన్నారు. కాంగ్రెస్ ప్రతి ఒక్కరి నుంచి ప్రయోజనం ఆశిస్తుంది. కానీ తాను ఒక అవకాశం పొందినప్పుడు మాత్రం, ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడదు' అని తెలిపారు. 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ పొత్తు ఒక గేమ్ ఛేంజర్‌గా ఉంటుందని పశ్చిమబెంగాల్ మాజీ మత్స్య శాఖ మంత్రి పేర్కొన్నారు. 'ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ కూటమి లోకసభ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యాన్ని సాధిస్తుందని ప్రస్తుత పరిస్థితి ద్వారా స్పష్టమవుతుంది. బీజేపీకి ఓటమి తప్పదు. కేంద్రంలో తదుపరి ప్రభుత్వ ఏర్పాటులో ఎస్పీ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ మేము ప్రధానమంత్రి రేసులో లేము' అని నందా చెప్పారు. కాగా 2014 లోక్‌సభ ఎన్నికల్లో తన మిత్రులతో కలిసి బీజేపీ 73 స్థానాలు గెలుచుకుంది. ఎస్పీ ఐదు, కాంగ్రెస్ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. అయితే శివపాల్ సింగ్ యాదవ్‌కు చెందిన ప్రగతిశీల సమాజ్ వాది పార్టీ(లోహియా) ఎస్పీ-బీఎస్పీ కూటమిని విచ్ఛిన్నం చేయవచ్చన్న వాదనను నందా ఖండించారు. 'ఉత్తరప్రదేశ్‌ల రాజకీయంగా సున్నితమైన లోక్‌సభ ఎన్నికల్లో కొత్త పార్టీలు ముందుగా వస్తాయి. కానీ అవి ఎటువంటి ప్రభావాన్ని చూపలేవు' అని తెలిపారు. ప్రధాన మంత్రి అభ్యర్థిత్వం అంశం ఎన్నికల తర్వాతే ఏకాభిప్రాయం ఆధారంగా నిర్ణయించబడుతుందన్నారు.



సంక్రాంతిలోపే మధ్యంతర భృతి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్

విశాలాంధ్ర - అనంతపురము : సంక్రాంతి లోపే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా పామిడి పట్టణంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని స్కూల్ అసిస్టెంట్ స్థాయి ఉపాధ్యాయులందరికీ జూనియర్ కళాశాలల్లో ఖాళీ లెక్చరర్ పోస్టుల్లో 40 శాతం ప్రమోషన్ కల్పించాలన్నారు. మున్సిపాలిటీలోని పాఠశాలల్లో సమస్యలతోపాటు రూ. 398 వేతనంతో పనిచేసిన వారికి ఇంక్రిమెంట్లు, సాంఘిక సంక్షేమ శాఖ, గురుకుల, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. అంతర్ జిల్లా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టి ఎన్నికల కోడ్ రాక మునుపే రిలీవ్ చేయాలన్నారు. వీరికి న్యాయం చేయడానికి నిరంతరం కృషి జరుగుతుందన్నారు. జేఏసీ తీర్మానం మేరకు సీపీఎస్ రద్దు వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేమయ్య యాదవ్, ఎస్టీయూ నాయకులు షణ్ముర్తి, జిల్లా అధ్యక్షులు జె.రామన్న, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, రాష్ట్ర నాయకులు గోవిందు, రమణారెడ్డి, జిల్లా నాయకులు కేశవరెడ్డి, చంద్రశేఖర్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్

గందళ్ల శ్రీరాములు డిమాండ్

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రవ్యాప్తంగా అత్యంత పేదరికంలో మగ్గుతున్న యానాదుల సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యానాది (గిరిజన) సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గందళ్ల శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం యానాది సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ యానాదులకు మత్స్యశాఖ సొసైటీలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి కల్పించాలన్నారు. యానాది కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రాజధాని అమరావతిలో రాష్ట్ర యానాది భవనము నిర్మించాలన్నారు. మైదాన ప్రాంతంలో ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల ఏడుకొండలు, కన్వీనర్ బాపట్ల నాగేశ్వరరావు, మహిళా నాయకులు బజ్జ భారతి, ముఖ్య సలహాదారులు తిరుపీదుల వెంకట్రావ్, కృష్ణాజిల్లా అధ్యక్షులు సవరం శ్రీరాములు, గుంటూరు జిల్లా అధ్యక్షులు అల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధే ధ్యేయం

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే ధ్యేయంగా అనారక్షిత్ సమాజ్ పార్టీ ప్రజల ముందుకు వస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు రాజేష్ అగ్నిహోత్రి అన్నారు. విజయవాడలోని ఓ హొటల్‌లో ఆదివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షునిగా ఎం. వెంకట చలపతిని నియమిస్తూ ఆయన నియామకపత్రం అందజేశారు. అనంతరం రాజేష్ అగ్నిహోత్రి మీడియాతో మాట్లాడుతూ దేశంలో కుల, మత రాజకీయాలు పెచ్చరిల్లాయని, వీటికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలతోపాటు 25 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసేలా పార్టీని విస్తరించాలన్నారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన అన్ని వర్గాల అభివృద్ధికి పాలకులు కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటచలపతి మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పెరిగిపోతుందన్నారు. నిరుద్యోగ భృతి పేరుతో ప్రభుత్వం నిరుద్యోగులను సోమరిపోతులుగా తయారు చేస్తుందన్నారు. తమ పార్టీ ప్రత్యేక విజన్‌తో అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో అనారక్షిత్ సమాజ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రస్తోగి, సౌత్ ఇండియా అధ్యక్షులు రాకూర్ భజరంగ్‌సింగ్ పాల్గొన్నారు.



యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో 18 శాతం జనాభా కలిగిన యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు డిమాండ్ చేశారు. యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద న్యాయపోరాట దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ విద్యార్థులపై హత్యాయత్నాలు హేయమైన చర్య అన్నారు. కృష్ణాజిల్లా గంపల గూడెం, కొణిజర్ల గ్రామంలో డిగ్రీ విద్యార్థిని జోనబోయిన ఝాన్సీపై హత్యాకాండ, మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి గోళ్ల రామకృష్ణ యాదవ్‌పై ర్యాగింగ్ ఘటన, విశాఖపట్నం చోడవరం మండలంలో పిల్లల పద్మావతిపై హత్యా ఘటలనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు జి.అయ్యన్న యాదవ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి జిల్లాలో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంటు సీటును యాదవులకు కేటాయించాలని కోరారు. 50 ఏళ్లు నిండిన పశువుల కాపరులకు నెలకు మూడు వేల రూపాయల చొప్పున పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కాపరులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఈ దీక్షలో సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి జి.మద్దిలేటి యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లక్ష్మీయాదవ్ ప్రసంగించారు. యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జాజుల శ్రీనివాసులు, రాష్ట్ర యువజన కార్యదర్శులు గోపి యాదవ్, శేషుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టు పెట్టొద్దన్నందుకు ఏఐఎస్ఎఫ్ నేతల అరెస్టు



విశాలాంధ్ర - విజయవాడ (కృష్ణలంక) : దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా విజయవాడలో భవిష్య అకాడమీ ఆదివారం నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌ను అడ్డుకున్న అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులను పెనమలూరు పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న, విజయవాడ నగర కార్యదర్శి పి.చరణ్‌సాయి మాట్లాడుతూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసే టాలెంట్ టెస్ట్‌ల నిర్వహణను నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ టాలెంట్ టెస్టులు నిర్వహించడం తగదన్నారు. ఈ టెస్టులో పాస్ అయిన వారికే కళాశాలలో సీటు ఇస్తామని భయభ్రాంతులకు గురిచేస్తూ విద్యార్థుల ఆత్మహత్యలకు యాజమాన్యాలు కారణమవుతున్నాయన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యాశాఖాధికారిని విధుల నుంచి తప్పించడంతోపాటు భవిష్య అకాడమీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, బాలరాజు, తిరుపతిరెడ్డి, రవి, రమేష్ పాల్గొన్నారు.

క్యాట్‌లో సిక్కోలు కుర్రోడి సత్తా



విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జాతీయ స్థాయి క్యాట్ పరీక్షలో 99.7 శాతం మార్కులు సాధించి సిక్కోలు విద్యార్థి ఉరిటి విజయకుమార్ మరో మారు సత్తా చాటాడు. 2017 గేట్ పరీక్షలోనూ 40వ ర్యాంకు సొంతం చేసుకున్న విజయకుమార్ ప్రస్తుతం ఐఓసీయల్ లో గ్రేడ్-బి అధికారిగా పనిచేస్తున్నారు. తండ్రి రమణ మూర్తి ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉప ఖజానా అధికారిగా, తల్లి ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. కుమారుని విజయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కొల్లేరులో పక్షుల కనువిందు

రకరకాల దేశ, విదేశీ పక్షుల సందడి

విశాలాంధ్ర - మండవల్లి : కొల్లేరు మహాసరస్సు విదేశీ పక్షులతో కనువిందు చేస్తోంది. ప్రకృతి రమణీయతకు నిలయమైన సరస్సుకు దేశ విదేశీ పక్షులు పెద్దఎత్తున తరలిరావడంతో పర్యాటకుల ఆనందాలకు అవధుల్లేవు. కొద్దిరోజులుగా ఎటుచూసినా ఆకాశంలో ఎగిరే పక్షులు చూపరులను అబ్బురపరుస్తున్నాయి. ఫెలికాన్ పక్షులు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. ఫెలికాన్‌తోపాటు పెయింటెడ్ స్టార్క్స్, తెల్లకంకణాలపిట్ట, ఎర్రకాళ్లఉలస, పరజలు వంటి పక్షులు కొల్లేరు ప్రాంతంలో చక్కర్లు కొడుతున్నాయి. ఏటా దేశ విదేశాల నుంచి వేల కిలోమీటర్ల మేర ప్రయాణిస్తూ కొల్లేరుకు చేరుకుని సంతానోత్పత్తి తర్వాత మళ్లీ మార్చి నెలలో స్వస్థలాలకు వెళ్లిపోతాయి.

ఈ ఏడాది నీటి స్థాయి పరిమితంగా ఉండటంతో పక్షుల సంతతి పెరిగింది. పొడవాటి ముక్కులతో కూడిన పక్షులు గుంపులు గుంపులుగా సందడి చేస్తున్నాయి. సూర్యాస్తమయం వేళ అందచందాలతో పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. కొల్లేరులో అక్రమ సాగును నియంత్రిస్తే వన్యప్రాణులకు ఆహారం పుష్కలంగా లభించటంతోపాటు రానున్న రోజుల్లో పక్షుల రాక మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.



పెదెడ్లగాడి వద్ద విదేశీ పక్షుల గుంపు

కొల్లేరు పరిరక్షణ అందరి బాధ్యత



కొల్లేరు సంపద పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. సరస్సు పరిరక్షణకు ప్రత్యేక చట్టాలున్నప్పటికీ అమలులో అధికారుల చిత్తశుద్ధి కొరవ డింది. కొల్లేరులో అక్రమ సాగు ప్రమాదకరంగా మారింది. వన్యప్రాణులకు ఆహారం దొరకని పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. పర్యావరణవేత్తలు ఉద్యమిస్తేనే కొల్లేరు మనుగడ సాధ్యమవుతుంది.

లావేటి వీర శివాజీ
సామాజిక కార్యకర్త, కొల్లేరు



సీమకు ఏం చేశారు

చంద్రబాబుపై ఎమ్మెల్సీ సోమువీర్రాజు ఫైర్

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : కరవు కోరల్లో చిక్కుకున్న రాయలసీమకు రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేసిందో చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు సవాల్ విసిరారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీమలో చెరువులు తవ్విన డబ్బుతో కర్నూలు జిల్లాలో చిన్నచిన్న ప్రాజెక్టులు నిర్మించవచ్చన్నారు. రూ. 16 వేల కోట్ల మట్టి తవ్వే పనులతో తెలుగుతమ్ముళ్లు సొమ్ము చేసుకున్నారన్నారు. చంద్రబాబుకు తన కుమారుడు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడం లక్ష్యమన్నారు. బీజేపీ నాయకులు సుధాకర్, రంగస్వామి, కపిలేశ్వరయ్య, సత్యమూర్తి, మురహరరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రాక్షస పాలనను అంతం చేద్దాం



విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాష్ట్రంలో రాక్షస పాలనను అంతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని వైసీపీ నాయకులకు, కార్య కర్తలకు ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ విజయ సాయిరెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. అధికార టీడీపీ ఎత్తులను చిత్తుచేసే విధంగా క్షేత్ర స్థాయిలో వైసీపీ కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన కొన సాగిస్తున్న టీడీపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడంతోపాటు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, వాటి లబ్ధి గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు బీవై రామయ్య, శిల్పా చక్రపాణి రెడ్డి, ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్ రెడ్డి, గౌరు చరిత, బాలనాగిరెడ్డి, గుమ్మనూరు జయరాం, పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఐజయ్య, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు గంగుల నాని, ఎర్రకోట సి.చెన్నకేశవ్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ఆ ముగ్గురే అడ్డంకి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ప్రధాని మోడీ, తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర రావు, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలు కలిసి కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి విమర్శించారు. ఆదివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ తనపై ఉన్న సీబీఐ కేసుల నుంచి బయటపడేందుకు మోడీతో అంటకాగుతున్నారని, తెలంగాణ సీఎం ఒడిశా ముఖ్యమంత్రితో కలిసి పోలవరాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, వారికి వారి స్వప్రయోజనాలే ముఖ్యం తప్ప ప్రజల ప్రయోజనాలు పట్టవన్నారు. సుప్రీం కోర్టుకు అన్నీ అసత్యాలు సమర్పించి రాఫెల్ ఒప్పందంలో బయటపడాలని మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈసీ, సీబీఐ, ఐటీ, ఈడీ, ఆర్బీఐ న్యాయవ్యవస్థలను తన చెప్పుచేతుల్లోకి తీసుకొని ప్రతిపక్షాలను అణగదొక్కడం ద్వారా దేశాన్ని ఏలాలని ప్రయత్నిస్తున్నారన్నారు. గుజరాత్ రాష్ట్రమే వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందాలన్న ఎజెండాతో ప్రధాని పని చేస్తున్నారని, దేశంలోని అన్ని రాష్ట్రాలకు ప్రధానిగా కాకుండా గుజరాత్‌కు మాత్రమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న కక్ష సాధింపు చర్యలను ఎదుర్కొనేందుకే టీడీపీ, బీజేపీయేతర కూటమిని ఏర్పాటు చేసిందని, బీజేపీ వ్యతిరేక ఓట్లు చీల్చడానికి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ అనే పల్లవిని ఎత్తుకున్నారని విమర్శించారు. దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి ఖాయమన్నారు. నాలుగున్నరేళ్లలో పేద, మధ్య తరగతి ప్రజలకు, విద్యార్థి, యువత, రైతులకు, వెనుకబడిన వర్గాలు అభివృద్ధి చెందడానికి, రాష్ట్రం ఆర్థిక పరిపుష్టికి దోహదం చేసే పారిశ్రామిక రంగ అభివృద్ధి కోసం టీడీపీ ప్రభుత్వం ఏమి చేసిందో పది శ్వేతపత్రాల ద్వారా ప్రజలకు వివరించామన్నారు. దేశంలో మేధావులు, ప్రజలు ఆలోచించే పనిచేసే ప్రభుత్వానికే మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, కేడీసీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఈ కృష్ణమూర్తి

పుస్తక పఠనంతో విజయసాధన

బీవీ పట్టాభిరామ్



విశాలాంధ్ర - విజయవాడ(గుణదల) : మంచిపుస్తకాలు చదవడం ద్వారా మనిషి దృక్పథం మారి విజయసాధకులు అవుతారని ప్రముఖ రచయిత బివి.పట్టాభిరాం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న విజయవాడ పుస్తక మహోత్సవంలో యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వేదికపై ఆదివారం బివి.పట్టాభిరాం రచించిన పట్టాభి రామబాణం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పిల్లల్లో సృజనాత్మ కతను పెంపొందించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాల న్నారు. పిల్లలకు చదువు ఒక్కటే కాకుండా కళలను కూడా నేర్పించడం ద్వారా వికాసం కలుగు తుందని పేర్కొన్నారు. ప్రతి ఏడూ పుస్తక మహోత్స వంలో తాను రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉంద న్నారు. ఈ ఏడాది పట్టాభిరామబాణం పుస్తకాన్ని కృష్ణాజిల్లా పూర్వ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను చైతన్య పర్చే విధంగా పట్టాభిరాం రచనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మానసిక వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఎమెస్కో విజయకుమార్, సాహితీవేత్తలు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, మహ్మద్ ఖదీర్‌బాబు, దేంపల్లి షరీఫ్, సిద్దషాజిదా పాల్గొన్నారు. పుస్తక మహోత్సవంలోని మరో వేదికపై ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు ఘన సన్మానం జరిగింది.

రేషన్ డిపోల్లోనే సంక్రాంతి కానుకలు

విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : విశాఖ జిల్లాలోని రేషన్ కార్డుదారులకు సంక్రాంతి కానుకల పంపిణీ గందరగోళంగా మారింది. రేషన్ డిపోల్లో ఇప్పటికే సంక్రాంతి కానుకలు మూలుగుతున్నా జన్మభూమి జాతరతో పేదోడి ఇంటికి కానుక చేరని పరిస్థితి నెలకొంది. ఈ నెల రెండవ తేదీ నుంచి సంక్రాంతి చంద్రన్న కానుకలు ఇస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించినా అమలు కావడం లేదు. రేషన్‌డిపోల్లో సాధారణ సరకులు మాత్రమే ఇస్తుండడంతో కార్డుదారులు మండి పడుతున్నారు. జిల్లాలో 12 లక్షలకు పైగా రేషన్ కార్డులుండగా, క్రైస్తవ కుటుంబాలకు 1.40 లక్షల వరకు తెల్లకార్డులున్నాయి. డిపోల ద్వారా ఈ నెల 15 వరకు సాధారణ రేషన్ సరకుతో పాటు సంక్రాంతి కానుక కింద కిలో గోధుమపిండి, అర కిలో పామాయిల్, అర కిలో కందిపప్పు, అర కిలో బెల్లం, వంద గ్రాముల నెయ్యి, అర కిలో వేరుశనగ పప్పు ఇవ్వాల్సి వుంది. రంజాన్ తోఫా అందుకున్న ముస్లిం కుటుంబాలకు కూడా సంక్రాంతి కానుక ఇస్తామని పౌర సరఫరాలశాఖ అధికారులు ప్రకటించారు. జన్మభూమి గ్రామసభల్లో ఎమ్మెల్యే ద్వారా కానుకలు పంపిణీ చేయాలన్న తెలుగుదేశం పార్టీ నిర్ణయంతో కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. రేషన్ డీలర్లు ఈ పోస్ మిషన్లు పట్టుకుని జన్మభూమి సభలకు వెళ్ళడంతో డిపోల్లో కార్డు దారులు పడిగాపులు కాస్తున్నారు. గ్రామ సభల్లో మొక్కుబడిగా ఒకరిద్దరికి మాత్రమే సరకులు ఇచ్చి దులిపేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిగిలిన వారు డిపోలకు వెళ్లి తీసుకోండని చెప్పడంతో కార్డుదారులకు పాలుపోని పరిస్థితి. డిపోల్లో సరకులు ఎలుకల దాడికి ఎక్కడ దెబ్బతింటాయోనని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. విశాఖలో స్థిరపడిన శ్రీకాకుళం, విజయనగరం, ఉభయగోదావరి, ఇతర జిల్లాల ప్రజలు సంక్రాంతి పండక్కి స్వస్థలాలకు వెళు న్నారు. డిపోల్లో నిత్యావసర సరకులకు ఓసారి, సంక్రాంతి కానుకకు మరోసారి వెళ్లాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. జన్మభూమి గ్రామసభ జరిగే వార్డుల్లో ఆ రోజు నుంచే కానుకలు పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించడంతో నేటికీ కనీసం 10 శాతం కార్డుదారులకు కూడా కానుకలు చేరని దుస్థితి నెలకొంది.

మహిళల హాకీ విజేత విశాఖ



షీల్డు అందుకుంటున్న విశాఖ జట్టు



ద్వితీయ స్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జట్టు

తూర్పుగోదావరి, కడప జట్లకు ద్వితీయ, తృతీయ స్థానాలు

విశాలాంధ్ర - భీమవరం : ఆంధ్రప్రదేశ్ తొమ్మిదో సీనియర్ ఉమెన్ హాకీ ఛాంపియన్ షిప్-2019లో విశాఖపట్నం జట్టు సత్తా చాటి మొదటి స్థానం కైవసం చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా జట్టు ద్వితీయ, కడప జిల్లా జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. హాకీ అసోసియేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్వర్యంలో భీమవరం జీవీఐటీ విద్యా సంస్థల ప్రాంగణంలో నాలుగు రోజులుగా హోరా హోరీగా జరుగుతున్న పోటీలు ఆదివారంతో ముగిశాయి. అత్యంత ఉత్కంఠగా సాగిన ఫైనల్స్‌లో విశాఖ మహిళల జట్టు తూర్పుగోదావరి జిల్లా పై 2-1 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. అంతకు ముందు తృతీయ స్థానం కోసం సాగిన పోరులో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై కడప జట్టు 3-1 తేడాతో గెలుపొందింది.

విజయవాడ ఆర్టీసీ జోన్ చైర్మన్ మెంటే పార్థసారథి విజేతలకు టోర్నీ కప్‌లు, మెడల్స్ అందజేశారు. క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తితో మంచి ఆటతీరు కనపర్చారని పార్థసారథి ప్రశంసించారు. హాకీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఎం.నిరంజన్‌రెడ్డి మాట్లా డుతూ ఈ పోటీల్లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనపర్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకున్న క్రీడాకారులు కేరళలో జరగబోయే జూనియర్ నేషనల్స్‌లో, హర్యానాలో జరిగే సీనియర్ నేషనల్స్‌లో పాల్గొంటారన్నారు. వీరికి తిరుపతి, కాకినాడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామన్నారు. హాకీ అసోసియేషన్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు ఆరేటి ప్రకాశ్, హాకీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్రంధి సురేష్, సరిపిడకల రామారావు, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎన్.వి.ఆర్.దాస్, టౌన్‌హాల్ ఉపాధ్యక్షులు కామన నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గాలి పటాల పోటీలు

విశాలాంధ్ర - నెల్లూరు(సిటీ) : యాంత్రికయుగంలో మన సమాజం, సంస్కృతి, సాంప్రదాయాలను నేటి యువత మరిచి పోతున్న నేపథ్యంలో వాటిని తెరమీదకు తెచ్చే ప్రయత్నంలో సంక్రాంతి పండక్కి మన గాలి పటాల జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ కైట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోడూరు రవీంద్రారెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత అయిదు సంవత్సరాలుగా కైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలలో పాల్గొనేవారు సెల్ నంబరు 3670864449లో సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో వి శ్రీనివాసులు, డివి పవన్‌కుమార్, రామాయణం మహేష్, పి సరిత, నాగరాజారావు, గౌతమ్, మురళీమోహన్, సాత్విక్, గోపి కృష్ణ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాత పరీక్షలకు 3,46,284 మంది హాజరు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలీసుశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం కానిస్టేబుల్ అభ్యర్థులకు ఆదివారం ప్రాథమిక రాత పరీక్షను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,92,785 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 3,46,284 మంది అభ్యర్థులు హాజరైనారు. దీంతో 88.16 శాతంగా హాజరు నమోదు అయ్యింది. 46,532 మంది వివిధ కారణాల వలన గైర్హాజరైనారు. రాష్ట్రవ్యాప్తంగా 704 కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. అభ్యర్థుల సౌకర్యం నిమిత్తం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడిపింది. మొత్తంగా 721 బస్సులను వివిధ రూట్‌లలో నడిపారు. దీనిలో పోలీసు కానిస్టేబుల్(సివిల్), కానిస్టేబుల్(ఏఆర్), కానిస్టేబుల్(ఏపీఎస్పీ), జైళ్లశాఖలో వార్డర్స్, అగ్నిమాపకశాఖలో ఫైర్‌మెన్ పోస్టులున్నాయి. పరీక్షలు విజయవంతంగా నిర్వహించినట్లు స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ కుమార్ విశ్వజిత్ వెల్లడించారు.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

హైకోర్టు జడ్జి టి.రజని



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని ఏపీ హైకోర్టు జడ్జి టి.రజని పేర్కొన్నారు. అమరావతిలోని విఐటీ- ఏపీలో విటోపియా-2019 ఇంటర్నేషనల్ క్రీడా సాంస్కృతి కోత్సవాలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రజని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ క్రీడా సాంస్కృతికోత్సవాలకు 5 రాష్ట్రాల నుంచి 50 కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. సాంస్కృతిక పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా విఐటీ-ఏపీ నిలిచింది. ఈ కార్యక్రమంలో హీరోయిన్ లావణ్య త్రిపాఠి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావ్యాపారానికి నిరసన

రేపు విద్యాసంస్థల బంద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యావ్యవస్థ పట్ల మోడీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఏఐఎస్ఎఫ్ రాష్ట్రప్రధానకార్యదర్శి రంగన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి సూర్యారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాదికి రెండుకోట్ల మందికి ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి మోడీ ప్రభుత్వం మోసం చేసిందని వారు విమర్శించారు. ప్రభుత్వ విద్యాలయాలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటు విద్యాసంస్థలను ప్రోత్సహించడం ద్వారా విద్యను వ్యాపారంగా మార్చారని ధ్వజమెత్తారు. స్వయంప్రతిపత్తిగల సంస్థలైన యూజీసీ, ఆర్‌బీఐ, సీబీఐ వ్యవహారాల్లో కేంద్రం జోక్యం చేసుకుని వాటిని దెబ్బతీస్తున్నదని విమర్శించారు. ఈ నెల 8, 9వతేదీల్లో దేశవ్యాప్తంగా కార్మికసంఘాలు చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. 8వతేదీన జరిగే విద్యాసంస్థల రాష్ట్ర బంద్‌లో విద్యార్థులతోపాటు అన్నివర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డీఎస్సీ-మ్యూజిక్ టీచర్ల ప్రతిభా పరీక్షల షెడ్యూలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డీఎస్సీ-2018 మ్యూజిక్ విభాగం టీచర్లకు ఈ నెల 6నుంచి 12వరకు ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తారు. విజయవాడ ఘంటసాల సంగీత కళాశాలలో ప్రతిరోజు ఉదయం సెషన్-9 గంటలు, మధ్యాహ్నం సెషన్-2 గంటలకు ఏర్పాటు చేస్తారు. అభ్యర్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు హాజరవ్వాలి. 13జిల్లాల నుంచి 641మందిని ప్రతిభా పరీక్షలకు ఎంపిక చేశారు. డీఎస్సీతోపాటు ప్రతిభా పరీక్షల మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

బైక్-ఆర్డీసీ బస్సు ఢీ ముగ్గురి మృతి

విశాలాంధ్ర - బనగానపల్లె : కర్నూలు జిల్లా మండల పరిధిలోని యాగంటి క్షేత్రం సమీపంలో ఆదివారం సాయంకాలం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న సంఘటనలో కర్నూలులోని ఓమెగా వైద్యశాలలో పని చేస్తున్న ముగ్గురు మృతి చెందారు. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఓమెగా వైద్యశాలలో పని చేస్తున్న తాండ్రపాడుకు చెందిన సుమన్ (23), కుమారి (20), శిరీష (21) బైక్‌పై యాగంటి వచ్చినట్లు తెలిపారు. వారు స్వామిదర్శన అనంతరం తిరిగి కర్నూలుకు వెళుతుండగా, యాగంటి- పాతపాడు మార్గమధ్యలో బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న తెలంగాణా రాష్ట్రం గద్వాల డిపోకు చెందిన ఏపీ29 జెడ్527 అనే నెంబర్ గల ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో సుమన్, కుమారిలు అక్కడికక్కడే మృతి చెందగా, శిరీష తీవ్రంగా గాయపడిందన్నారు. శిరీషను చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా, మృతి చెందిందన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



అరకొర సౌకర్యాలతో ఏర్పాటు చేసిన వైద్యశాల



ప్రాజెక్టు ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులు

బంగారు కలకు బానిసలం

విశాలాంధ్ర - పోలవరం : పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం వేలాది మంది కార్మికులు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చారు. వీరంతా రోజుకు 12 నుంచి 15 గంటలపాటు మట్టి తవ్వకాలు, కాంక్రీట్ మిక్సింగ్, రాడ్ బెండింగ్ పనులు చేస్తూ కష్టపడుతున్నారు. నాలుగేళ్లుగా ప్రాజెక్టు పనుల్లో రాత్రిపగలు తేడాలేకుండా పనిచేస్తున్నారు. ప్రాజెక్ట్ పనుల వేగానికి అత్యాధునిక భారీ యంత్రాలతోపాటు కార్మికులు కీలక సేవలందిస్తున్నారు. ఉదయం నుంచి చీకటి పడే వరకు దుమ్ము, ధూళిలోనే పనిచేస్తున్నా తగిన వేతనం అందని పరిస్థితి. కార్మికులను కాంట్రాక్టు ఏజెన్సీలు యంత్రాల్లా వాడుతున్నాయే తప్ప మనుషులుగా చూడడం లేదు. రోజుకు రెండు షిఫ్టుల్లో పనులు చేయిస్తున్న కార్మికులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. జార్ఖండ్, బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికుల జీవనోపాధి కోసం సుమారు ఐదు వేల మంది కార్మికులు పొట్ట చేతపట్టుకుని ఇక్కడకు వచ్చారు. ఎంతో కష్టపడి పనులు చేస్తున్నా, కనీస సౌకర్యాలు, వేతనాలకు నోచుకోవటంలేదని కార్మికులు వాపోతున్నారు. ప్రాజెక్టు నిర్మాణాలలో పని చేసే కార్మికులకు దాదాపు సైట్‌లోనే తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేస్తారు. పోలవరం చుట్టు పక్కల నుంచి రోజువారీ వెయ్యి మంది వస్తుండగా, ఇతర రాష్ట్రాలకు చెందిన ఐదు వేల మంది కార్మికులు పనుల కోసం వచ్చారు. వీరందరికీ పాత చేగొండపల్లిలో తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. రేకులతో ఏర్పాటు చేసే షెడ్‌లలో కనీసం గాలి, వెలుతురు సరిగా లేదు. వేసవిలో వీరి బాధలు వర్ణనాతీతం. మరుగుదొడ్లు, స్నానాలకు బాత్‌రూమ్‌లు ఉండవు. అంతా ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకోవాలి. తాగునీటి కోసం కార్మికులు నానా తంటాలు పడుతున్నారు. స్వచ్ఛమైన నీరు లభించక, కలుషిత నీటినే తాగాల్సిన పరిస్థితి ఉంది. ఫలితంగా కార్మికులు పలు వ్యాధుల బారిన పడుతున్నారు. వీరి నివాసాలకు అత్యంత సమీపంలోనే 350 క్రషర్లు పనిచేయడంతో వీటి నుంచి వచ్చే దుమ్ము, వాయు కాలుష్యంతో కార్మికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

కష్టపడుతున్నా... అర్ధాకలే

రాష్ట్రం కోసం రేయింబవళ్లు కష్టపడుతున్న వేలాది మంది కార్మికులు అర్ధాకలితో కాలం వెళ్లదీస్తున్నారు. వారికి నాసిరకం భోజనం పెడుతుండటంతో తినలేక నెలల తరబడి పస్తులుంటున్నారు. అదేమని ప్రశ్నిస్తే ఎక్కడ ఉద్యోగం ఊడుతుందోన్న ఆందోళన వారిని వేధిస్తోంది. సరిగా ఉడికీ ఉడకని అన్నం, నీళ్లలాంటి సాంబరుతో భోజనం చేయలేక పోతున్నామని ప్రాజెక్టు పనులు చేస్తున్న కార్మికులు నాగేశ్వరరావు, సతీష్, అనిల్ వాపోయారు. వారానికి రెండుసార్లు బిర్యానీ పెడతారని, అది తింటే అనారోగ్యానికి గురవుతున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరగడంతో ఎక్కువ గంటలు పనిచేయిస్తున్నారని, దీనివల్ల తాము మానసికంగా, శారీరకంగా తీవ్ర మనో వేదనలకు గురవుతున్నట్లు చెప్పారు.

కనీస వేతనాలు శూన్యం

పోలవరం ప్రాజెక్ట్ పనుల్లో పని చేస్తున్న ఆరు వేల మంది కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవటంలేదు. టిప్పర్, డంపర్, వివిధ వాహనాల డ్రైవర్లు, ట్రాఫిక్ నియంత్రణ గార్డులు రోజుకు 12 గంటలపాటు పని చేస్తున్నారు. ఇంతా చేస్తే తమకు నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేలకు మించి ఇవ్వటంలేదని పలువురు కార్మికులు తెలిపారు. వారాంతపు సెలవులు లేవు. అనారోగ్యానికి గురై పనికి వెళ్లకపోతే ఆ రోజు వేతనం ఇవ్వరు. కనీస సౌకర్యాలు, వేతనాలు లేకుండా ఏజెన్సీలు తమ శ్రమను దోపిడీ చేస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలను రెండు మూడు నెలలకు ఒకసారి చెల్లించటంతో ఇతర రాష్ట్రాల కార్మికులను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి.

ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాలేవీ...

ఇతర రాష్ట్రాల నుంచి వందలాది కుటుంబాలకు వలస వచ్చాయి. ఆయా కుటుంబాలలో చంటి పిల్లలు, గర్భిణీ మహిళలూ ఉన్నారు. వీరి కోసం నివాస ప్రాంతంలోనే ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. జలవనరులశాఖగానీ, ఏజెన్సీలుగానీ వీటిని ఏర్పాటు చేయలేదు. పౌష్టికాహారం లేకపోవటంతో పిల్లలు, గర్భిణీలు అనారోగ్యానికి గురవుతున్నారని కార్మికులు తెలిపారు.

భద్రతా చర్యలూ శూన్యం

ప్రాజెక్టులో కార్మికులు అత్యంత ప్రమాదకర ప్రదేశాల్లో పని చేస్తున్నారు. కానీ ఎలాంటి భద్రతా చర్యలు లేకపోవటం శోచనీయం. స్పిల్ వే, ఎత్తైన సిల్ బేసిన్‌పై నుంచి ఊస కట్టడాలు, వెల్డింగ్ వంటి ప్రమాదకర పనులను చేస్తున్నారు. గోదావరి మధ్యలో కాఫర్ డ్యామ్ నిర్మాణం ప్రమాదకంతో కూడుకుంది. అనేక మంది కార్మికులు తరచూ గాయాలపాలవుతూనే ఉన్నారు. ప్రాజెక్ట్ పనుల్లో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతున్నా సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. నామమాత్రంగా చిన్న వైద్యశాల ఏర్పాటు చేసినా అక్కడ సరైన సౌకర్యాలు లేవని కార్మికులు చెబుతున్నారు. జాతీయ ప్రాజెక్టు నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులను నిర్లక్ష్యం చేయటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

ఇకనైనా పట్టించుకోరూ..

పోలవరం ప్రాజెక్టు కోసం అహర్నిసలు కష్టపడుతున్నానని చెప్పుకునే సీఎం చంద్రబాబు కనీసం ఒక్కటంటే ఒక్కసారి కూడా కార్మికుల బతుకులపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. కష్టపడే కార్మికులు కన్నెర చేస్తే పనులన్నీ ఆగిపోయే అవకాశం లేకపోలేదు. సోమవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న సందర్భంగానైనా కార్మికుల సౌకర్యాలపై అధికారులు, ఏజెన్సీ నిర్వాహకు, కార్మికులతో చర్చించాలని పలువురు కోరుతున్నారు.

సర్వేపై కాంగ్రెస్ వేటు

ఉత్తమ్, కుంతియాపై విమర్శలే సస్పెన్షన్‌కు కారణం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి కుంతియాపై చేసిన వ్యాఖ్యల కారణంగానే సర్వేపై క్రమశిక్ష చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆదివారం గాంధీభవన్‌లో సికింద్రాబాద్, మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గాలపై టీపీసీసీ సమీక్షించింది. కుంతియా, ఉత్తమ్‌తో పాటు మాజీ ఎంపీ అంజన్‌కుమార్ హాజరయ్యారు. మల్కాజ్ గిరిపై సమీక్షలో పాల్గొన్న సర్వే సత్యనారాయణ ఉత్తమ్, కుంతియాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమికి కారకులైనవారే సమీక్ష చేయడమేంటని ప్రశ్నించారు. ఈ క్రమంలో టీపీసీసీ ప్రధాన కార్య దర్శి బొల్లు కిషన్, సర్వే సత్యనారాయణకు మధ్య వాగ్వాదం జరిగింది. సర్వే మరింత ఆగ్రహానికి గురై కిషన్‌పై వాటర్ బాటిల్ విసిరి సమావేశం మధ్యలోనే అలిగి వెళ్లిపోయారు. ఆ వెంటనే మీడియాతో మాట్లాడిన సర్వే.. రౌడీ మూకలను తెలంగాణ కాంగ్రెస్ పెంచిపోషిస్తోం దన్నారు. దారినపోయే దానయ్యలకు ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టిందని విమర్శించారు. దళిత బిడ్డను కాబట్టి వారు నన్ను చులకనగా చూశారని ఆరోపించారు. పార్టీని మళ్లీ అధికారంలోకి ఏ విధంగా తీసుకురావాలి? వాస్తవాలు మాట్లాడి, ఎందుకు నష్టపోయాం, ఏం కష్ట నష్టాలొచ్చాయి అనేది చెబుతుంటే రుచించని వారు తనపైకి రౌడీ మూకను పంపారని సర్వే ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఉత్తమ్‌ను తొలగించాలిలని సర్వే డిమాండు చేశారు. పార్టీకి నష్టం చేసినవాళ్లే మళ్లీ రివ్యూలు చేస్తే ఎలా? అని అడిగారు. సర్వే వ్యాఖ్యలు, ప్రవర్తనను సీరియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఆదేశాలు జారీ చేసినట్టు పార్టీ నేతలు తెలిపారు.

మీ భరతం పడతా... సర్వే హెచ్చరిక

'నేను ఏఐసీసీ సభ్యుడిని. నన్ను సస్పెండ్ చేసే అధికారం టీపీసీసీలో ఎవ్వరికీ లేదు. వారి భరతం పడతాను. పదవులన్నీ ఊడపీకిస్తాను' అని సర్వే హెచ్చరించారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే తనపైకి రౌడీమూకలు పంపారని, వారికి గట్టిగా సమాధానం చెప్తానన్నారు. పార్టీలో ఏం జరుగుతుందో సోమవారం చెబుతానని సర్వే ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తమ్, కుంతియా టికెట్లు అమ్ముకున్నారని, టీఆర్ఎస్‌కు కోవర్టులుగా పనిచేశారని ఆరోపించారు. పూర్తి ఆధారాలతో రెండు రోజుల్లోగా అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని సర్వే తెలిపారు.

పోరాటంతోనే రాజకీయ మార్పు సాధ్యం

రెండు జిల్లాల సమీక్షలో పవన్ కల్యాణ్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : పోరాటంతోనే రాజకీయ మార్పు సాధ్యమని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పార. యువత ఆగ్రహిస్తే, అది సమాజానికి చేటు చేస్తుందని హెచ్చరిం చారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విజయ నగరం, అనంతపురం జిల్లాల నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, ఇద్దరు వ్యక్తులు విజయనగరం జిల్లాను తమ గుప్పిట్లో పెట్టుకున్నారని విమర్శించారు. స్థానిక నేతల వల్లే ఆ జిల్లా వెనుకబడిందని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అశోక్ గజపతిరాజు విజయానికి కృషి చేస్తే, తానెవ్వరో తెలియదనటం శోచనీయమన్నారు. కులాల మధ్య సఖ్యత అవశ్యమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా మార్పు తేవాలని జనసేన కోరుకుంటుందేగానీ, కులాల ద్వారా ఎంతమాత్రం కాదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో రాణించాలంటే నాయకులు, కార్యకర్తలకు ఓపిక, సహనం ఉండాలన్నారు. యువత భవిష్యత్ కోసమే పార్టీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుకుంటున్నారని, రాజకీయాల్లోకి కొత్త రక్తం వస్తేనే మార్పు సాధ్యమన్నారు. సినిమాలో నటించినప్పుడు అభిమాన సంఘాలు పెట్టలేదనీ, సినిమా ఫంక్షన్లకు రమ్మని ఎవరినీ రమ్మనలేదన్నారు. ఇప్పుడు రాష్ట్రం కోసం, దేశంకోసం పార్టీ స్థాపించినందున సమావేశాలకు రావాలని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన 175 స్థానాల్లో పోటీచేసి విజయం సాధిస్తుందని తెలిపారు. అనంతపురం గొప్ప చైతన్య జిల్లా అని, గొప్ప పేరున్న గ్రంథాలయాలతో సరస్వతీ నిలయంగా ఉందన్నారు. జిల్లా పేరు చెప్పగానే అందరికీ ఫ్యాక్షన్ గుర్తుకొస్తుందనీ, తనకు మాత్రం తరిమెల నాగిరెడ్డి గుర్తుకు వస్తారని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న కరవును ఒక్క రోజులో పరిష్కరించలేమన్నారు. కేవలం రాజకీయ వెనకబాటు తనం వల్లే జిల్లాలో కరవు నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి వనరులే లేని ఇజ్రాయిల్‌లో గొప్ప ఆలోచనలతో పుష్కలంగా పంటలు పండించినప్పుడు, అనంతపురంలో ఆ ప్రయోగం ఎందుకు చేయలేమని ప్రశ్నించారు. పాలకులకు సంకల్పం లేకే దీనిపై దృష్టిపెట్టలేదని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్, రావెల కిషోర్‌బాబు, గంగాధరం, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.



అవినీతిలో చంద్రబాబు వరల్డ్ రికార్డ్

'అవినీతి చక్రవర్తి' పుస్తకావిష్కరణలో వైఎస్ జగన్

విశాలాంధ్ర - సోంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదివారం సిక్కోలు జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతిపై 'అవినీతి చక్రవర్తి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేట మండలం పలాసపురం గ్రామం వద్ద రాత్రి బస చేసిన స్థలంలో ఈ పుస్తకాన్ని వైసీపీ నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి తదితరులతో కలిసి జగన్ ఆవిష్కరించారు. సుమారు 200 పేజీలతో కూడిన పుస్తకంలో గడచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని రంగాల వారీగా ప్రచురించారు. అన్ని రంగాల్లో కలిపి 6.17 లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు ఆరోపించారు. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖలో వాస్తవ అంచనాల కంటే అనేక రెట్లు అధికంగా పెంచి బాబు అనుయాయులకు కాంట్రాక్టు రూపంలో దోచిపెట్టారని ఆరోపించారు. అలాగే చంద్రబాబు కుమారుడు లోకేష్ అనుచరులకు చెందిన వివిధ డొల్ల కంపెనీలకు రాష్ట్రంలో కోట్లాది రూపాయల విలువైన భూములను లక్షల రూపాయలకు కట్టబెట్టి దోపిడీ పర్వాన్ని కొనసాగించారని ఆరోపించారు. రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాలకు కోట్ల రూపాయల విలువైన స్థలాలను లక్షల రూపాయలకు కట్టబెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణం చేపట్టాల్సి ఉండగా వేర్వేరు చోట్ల రాజధాని నిర్మిస్తున్నట్లు ప్రణాళికబద్ధంగా ముందస్తు లీకులు చేపట్టి ప్రజల్లో గందరగోళం సృష్టించారని అన్నారు. అమరావతి ప్రాంతంలో తమ అనుయాయులకు, పార్టీ నేతలకు కారుచౌకగా భూములు కొనుగోలు చేసే కుట్రకు తెరలేపారని పేర్కొన్నారు. దీనివల్ల రాజధాని ప్రాంత రైతులు అతి తక్కువ ధరలకు భూములు అమ్ముకోవాల్సి వచ్చిందని అన్నారు. అన్ని వర్గాలను మోసగించి తన అవినీతి విశ్వరూపాన్ని ప్రదర్శించి ప్రపంచంలోనే అవినీతి చక్రవర్తిగా చంద్రబాబునాయుడు రికార్డు సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే కళావతి, దువ్వాడ శ్రీకాంత్, రెడ్డి శాంతి, పిరియా సాయిరాజ్, నర్తు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన కేరళలో

ఉద్రిక్తతలు పెంచుతున్నారు..

బీజేపీపై చంద్రబాబు ఫైర్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రశాంతమైన కేరళ రాష్ట్రంలో బీజేపీ ఉద్రిక్తతలు పెంచుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాంబులతో దాడులకు పాల్పడుతూ అల్లర్లు చేసి భయోత్పాతాన్ని సృష్టిస్తోందని ఆయన దుయ్య బట్టారు. జన్మభూమి ఐదవ రోజు ఆదివారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ బీజేపీ నాయకులు దేశంలో దుష్ట రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. అఖిలేష్, మాయావతి పొత్తు పెట్టుకుంటే మరుసటి రోజే సీబీఐ కేసులు పెట్టడం దారుణమన్నారు. బీఎస్పీ, ఎస్పీ నేతలపై దాడులు చేయిస్తూ పద్ధతి లేని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ ప్రజల హక్కులను కాలరాస్తూ నిధులు ఇవ్వడంలేదని ఆయన ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ నేతలు పనిచేయరని, పని చేయమంటే కేసులతో బెదిరింపులకు పాల్పడుతు న్నారని ఆయన తెలిపారు. లాలూచీ రాజకీయాలు చేస్తున్నప్పటికీ వాటిని అధిగమించి పనులు చేస్తున్నా మన్నారు. 'ధర్మం మన వైపే ఉంది, అందుకే అన్నీ సానుకూల ఫలితాలు ఇస్తున్నాయి.. జాతీయంగా, అంతర్జాతీయంగా అవార్డులు వస్తున్నాయి' అని చంద్రబాబు అన్నారు.

పండగకు అదనంగా మరో రోజు సెలవు

ఆదివారం కూడా జన్మభూమి కార్యక్రమంలో ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని, సంక్రాంతి పండగకు మరో రోజు అదనంగా సెలవు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. తిత్లీ తుపాను బాధితుల సేవల్లో చూపిన స్ఫూర్తే జన్మభూమి కార్యక్రమంలో కూడా చూపుతున్నారని ప్రశంసిం చారు. ప్రజల భాగస్వామ్యం నాలుగో రోజున బాగా పెరిగిందన్నారు. మండల కేంద్రాల్లో 7.18 లక్షలు, గ్రామాల్లో 25.46 లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు దాదాపు 5 లక్షల మంది పాల్గొన్నారన్నారు. మొత్తం 1,31,408 ఫిర్యాదులు వచ్చాయని, వైద్య శిబిరాలతోపాటు వెటర్నరీ క్యాంప్‌లకు మంచి స్పందన వస్తోందన్నారు. గ్రామ సభల్లో పశుగ్రాస కొరత, తాగునీటి కొరతపై చర్చించాలన్నారు. పరిష్కార మార్గాలను అక్కడికక్కడే అన్వేషించాలని ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, నోడల్ అధికారులకు చంద్రబాబు సూచించారు.

రేపు ఢిల్లీకి బాబు

సీఎం చంద్రబాబు మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో టీడీపీ ఎంపీలతో సమావేశం కానున్నారు. కేంద్రంతో పోరాటంపై ఎంపీలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధాని మోడీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు, పోలవరం, వెనుకబడిన జిల్లాల నిధులపై ఎంపీలతో చర్చించనున్నారు. అలాగే బీజేపీయేతర పక్షాలతోను చర్చలు జరిగే అవకాశం ఉంది. గత నెలలో జరిగిన మహాకూటమి సమావేశం కొనసాగింపుగా ఈ భేటీ జరగనున్నది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఎన్‌సీపీ నేత శరద్‌పవార్‌తో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఇష్టపడిచేస్తేనే ఫలితం
- సంస్కారంతో కూడిన విద్య అవశ్యం
- స్వర్ణభారత్ ట్రస్టు వార్షికోత్సవంలో వెంకయ్య



విశాలాంధ్ర- ఉంగుటూరు/ గన్నవరం : జీవితంలో ప్రతిపనిని ఇష్టపడి, కష్టపడిచేస్తే అందుకు సార్ధకత లభించి ప్రతిఫలం దక్కుతుందని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం అత్కూరు గ్రామంలో గల స్వర్ణభారత్ ట్రస్టు మూడో వార్షికోత్సవం ట్రస్టు అవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, ప్రతి మనిషి ఎదుగుదలలో కసి,పట్టుదల మిళితమై ఉంటుందని పేర్కొన్నారు. దేశంలోనే అత్యంత సమర్ధవంతంగా పనిచేస్తున్న ట్రస్టులలో స్వర్ణభారతి ట్రస్టు ఒకటిగా నిలవడం తనకెంతో గర్వకారణంగా ఉందని అన్నారు. ఎన్ని ఆర్థిక ఒడిదుడుకులు ఎదురైనా సేవలకు నిరంతరాయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. సమాజానికి కొంతైనా సేవచేయాలనే సంకల్పంతో హితులు, శ్రేయోభిలాషులు, కుటుంబసభ్యుల సహకారంతో ఈ ట్రస్టుని నెలకొల్పినట్లు చెప్పారు. ప్రభుత్వ, విదేశీ సాయం పొందకుండా ట్రస్టు కార్యక్రమాలను నిర్వహించడం తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను మరువరాదన్నారు. సంస్కారంతోకూడిన విద్య నేటి యువతకు ఎంతో అవసరం అన్నారు. విమర్శలు ఎప్పుడూ సహేతుకంగా ఉండాలన్నారు. దురదృష్టవశాత్తు అది శృతిమించుతోందని అవేదన వ్యక్తం చేశారు. యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. బ్రతుకుదెరువుకు విదేశాలకు వెళ్లినా మాతృభూమిని మరువరాదన్నారు. బాలల హక్కులకోసం ఉద్యమిస్తున్న కైలాష్‌సత్యార్థి దేశానికి గర్వకారణం అని. ఆయన సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. 18వేల మంది బాలకార్మికులకు బానిసత్వం నుంచి విముక్తిచేసిన మహావ్యక్తి సత్యార్థి అని కొనియాడారు.

నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ, నేటి సమాజంలో పిల్లల దృక్పదంలో మార్పులు రావాలని అన్నారు. యువత లక్ష్యసాధన దిశగా స్పందించాలన్నారు. దేశంలో వందల స్థాయిలో సమస్యలున్నా మిలియన్ స్థాయిలో పరిష్కారం చూపగలిగిన స్థాయిలో దేశ యువత ఉండాలన్నారు. యువత కలలు కని, వాటికి పరిష్కారం కనుక్కొని, సాకారం చేయాలన్నారు. వీటితో పాటుగా కరుణ, ధైర్యం, పట్టుదల ఉండాలన్నారు. యువత నిరాశక్తతను విడనాడాలన్నారు. డీఆర్‌డీఓ చైర్మన్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, స్వయంసంవృద్ధి సాధన దిశగా రక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ రక్షణ రంగంలో సూపర్ సోనిక్ క్షిపణి బ్రహ్మోస్ స్థాయి క్షిపణులు కలిగిన దేశం ఒక్క భారతదేశమేనన్నారు. ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతిక క్రూజ్ మిసైల్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారు చేయగల అతికొద్ది దేశాల సరసన మన దేశం ఉందన్నారు. దేశంలో ప్రతిభకు కొదవలేదన్నారు. సృజనాత్మకతో కూడిన పరిశోధనలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. అనంతరం కైలాష్ సత్యార్థి, సుశీలా సత్యార్థి, జి.సతీష్‌రెడ్డిలను ట్రస్టు అద్వర్యంలో వెంకయ్యనాయుడు ఘనంగా సత్కరించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విశాలాంధ్ర

క్రీడలు



తిప్పేశారు

- ఫాలోఆన్‌తో ఆసిస్ ఎదురీత
- ఐదు వికెట్లు తీసిన కుల్దీప్
- వరుణుడు కరుణిస్తే విజయం టీమిండియాదే

సిడ్నీ:
ఆసీస్‌తో జరుగుతున్న చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా బౌలర్లు విజృంభించారు. దీంతో 300 పరుగులకే ఆసీస్ ఆలౌట్ అయింది. 236/6 ఓవర్ నైట్ స్కోరుతో ఆసీస్ నాలుగో రోజు బ్యాటింగ్ ప్రారంభించింది. అయితే, వర్షం కారణంగా మ్యాచ్ మూడు గంటల ఆలస్యంగా మొదలైంది. నాలుగో రోజు 20 ఓవర్లు ఆడి 64 పరుగులు మాత్రమే జోడించి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. కుల్దీప్ యాదవ్ ఐదు వికెట్లు తీయగా, షమీ, జడేజా చెరో రెండు వికెట్లు తీశారు. బుమ్రా ఖాతాలో ఒక వికెట్ పడింది. భారత్ 322 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆసీస్ ఫాలోఆన్ ఆడుతోంది.

ఆరు ఓవర్లలో మూడు వికెట్లు..

నాలుగో రోజు ఆసీస్ ఇన్నింగ్స్ త్వరగా ముగించాలన్న టీమిండియా కోరికకు వరుణుడు అడ్డుతగిలాడు. వర్షం కారణంగా మ్యాచ్ మూడు గంటల ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ టీమిండియా బౌలర్లు మాత్రం పట్టు వదల్లేదు. మ్యాచ్ ప్రారంభమైన ఆరు ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టి టెయిలెండర్లపై ఒత్తిడి పెంచారు. 85వ ఓవర్లో షమీ వేసిన బంతికి పాట్ కమిన్స్(25) బౌల్డ్ అయ్యాడు. తర్వాత హాండ్స్‌కాంబ్ (37)ను బుమ్రా బౌల్డ్ చేసి పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాతి ఓవర్లోనే ఆసీస్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది. 91వ ఓవర్లో కుల్దీప్ వేసిన బంతికి లైయన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి ఫైన్ సేన 258 పరుగులు చేసింది.

చివర్లో పోరాటం

తొమ్మిది వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆసీస్‌కు టెయిలెండర్లు ఊతమిచ్చారు. వికెట్ కోల్పోకుండా నిలకడగా ఆడారు. 10 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 42 పరుగులు జోడించారు. క్రీజులోకి వచ్చిన తర్వాత రెండు సార్లు టీమిండియా బౌలర్ల చేతిలో తప్పించుకున్న హేజిల్‌వుడ్ ఈసారి కుల్‌దీప్ బుట్టలో పడ్డాడు. 105వ ఓవర్లో చైనామన్ వేసిన బంతిని అంచనా వేయలేకపోయిన హేజిల్‌వుడ్(21).. ఎల్బీగా వెనుదిరిగాడు. ఫలితంగా ఆసీస్ 300 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 322 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

30 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఫాలో ఆన్

ఆసిస్ తన సొంతగడ్డపై ఫాలోఆన్ ఆడటం 30 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. 1988లో చివరిసారి ఇదే సిడ్నీ మైదానంలో ఇంగ్లండ్‌తో ఫాలో ఆన్ ఆడిన ఆసీస్.. మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇక విదేశాల్లో 2005లో చివరగా ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫాలో ఆన్ ఆడిన ఆసీస్ పరాజయం పాలైంది.

ఫాలో ఆన్ ఇవ్వడం మొదటిసారి

దాంతో పాటుగా భారత్‌కు ఆసియా వెలుపల అత్యల్ప టార్గెట్‌తో ఫాలో ఆన్ ఇవ్వడం కూడా ఇదే మొదటిసారి. గ్రాస్‌లెట్ వేదికగా 2006లో వెస్టిండీస్ 373 పరుగుల వద్ద, లీడ్స్ వేదికగా 2002లో ఇంగ్లండ్‌కు 355 పరుగుల వద్ద, నార్త్ సౌండ్ వేదికగా 2003లో 323 పరుగుల వద్ద, సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ వేదికగా 2018/19లో ఆస్ట్రేలియాకు 322 పరుగుల వద్ద, ఓవల్ స్టేడియం వేదికగా 2007లో 319 పరుగుల వద్ద, కింగ్‌స్టన్ స్టేడియం వేదికగా 2016లో 304 పరుగుల వద్ద వెస్టిండీస్‌పై తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది.

విమర్శలతోనే మార్పు



సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయానికి టీమిండియా అత్యంత చేరువలో ఉంది. ఈ ఘనత సాధించిన తొలి కెప్టెన్, తొలి కోచ్‌గా నిలవడానికి విరాట్ కోహ్లి, రవిశాస్త్రి తహతహలాడుతున్నారు. అయితే ఈ సమయంలో మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కోచ్ రవిశాస్త్రికి ఓ సూపర్ పంచ్ వేశాడు. తొలి టెస్టు గెలిచిన తర్వాత రవిశాస్త్రి చేసిన కామెంట్స్‌కు సునీల్ గవాస్కర్ కౌంటర్ వేశాడు. సోషల్ మీడియా వేదికగా రవిశాస్త్రిపైన సహజంగానే నెటిజన్లు సాకు కోసం చూస్తూ ఉంటారు. అలాంటిది గవాస్కర్ చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా నిలిచి రవిశాస్త్రి ఏకిపారేశారు. ఆసీస్ గడ్డపై తొలిటెస్ట్‌లో గెలిచేసరికి శాస్త్రి కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది.

వేల కిలోమీటర్ల దూరం విమర్శల నుంచే...

ఈ సందర్భంగా మాట్లాడిన కోచ్.. వేల కిలోమీటర్ల దూరంలో ఉండి విమర్శలు చేయడం చాలా ఈజీ అని తేల్చపడేశాడు. ఇదే విషయాన్ని గవాస్కర్ ప్రస్తావించాడు. ఆదివారం సిడ్నీ టెస్టు నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత మురళీ కార్తీక్‌తో కలిసి మ్యాచ్‌పై విశ్లేషణ చేసిన సందర్భంగా సన్నీ చేసిన కామెంట్స్ ఆసక్తికరంగా ఉన్నాయి. పెర్త్ టెస్ట్‌లో ఓటమి టీమిండియాకు ఓ మేలుకొలుపులా పనిచేసిందని మురళీ కార్తీక్ అన్నాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న గవాస్కర్ మాట్లాడుతూ.. మరి ఆ మేలుకొలుపు ఎలా వచ్చింది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న వాళ్ల విమర్శల నుంచే వచ్చింది. ఆ విమర్శల సడితోనే ఈ జట్టు మేల్కొందని గవాస్కర్ అన్నాడు.

కుల్దీప్ ఇంకా మాయచేయగలడు : భరత్

సిడ్నీ: టీమిండియా మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ యాదవ్‌పై బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఇంగ్లండ్ పర్యటనతో పోలిస్తే మరింత మెరుగయ్యాడని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టులో కుల్దీప్ విజృంభించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 99 పరు గులిచ్చి 5 వికెట్లు తీశాడు. దీంతో ఆసీస్ 300 పరు గులకు కుప్పకూలి ఫాలోఆన్ ఆడుతోంది. 'నైపుణ్య మున్న బౌలర్ అని కుల్దీప్ నిరూపించుకున్నాడు. వన్డేల్లో విజయవంతమయ్యాడు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో చాలా తక్కువమంది చైనామన్ బౌలర్లు ఉన్నారు. అందులో కుల్దీప్ ఎంతో ప్రత్యేకం. అతడు గూగ్లీలు అద్భుతంగా విసురుతాడు. క్రీజును ఉపయోగించుకొనే విధానం వినూత్నంగా ఉంటుంది. అతడిలో చాలా వైవిధ్యం ఉంది. ఈ యువకెరటం నుంచి ఇంకెంతో రాబట్టు కోవచ్చు. ఇంగ్లండ్‌లో కలిసిరాలేదు. ఈ మ్యాచ్ ఆత్మవిశ్వాసం ఇచ్చింది. సిడ్నీ మైదానం స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. అందుకే ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగాం. విదేశాల్లో మా బౌలింగ్ దాడి మెరుగైంది' అని అరుణ్ అన్నాడు.

ఆనర్స్ బోర్డుపై పుజారా, పంత్ సంతకాలు



సిడ్నీ: అంతర్జాతీయంగా ఉన్న కొన్ని ప్రతిష్ఠాత్మక క్రికెట్ మైదానాల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆటగాళ్ల పేర్లను హానర్స్ బోర్డుపై లిఖిస్తారు. ఈ మైదానంలో ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీ లేదా 5 వికెట్లు లేదా 2 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసిన ఆటగాళ్లను గౌరవించడం ఎస్‌సీజీ ఆనవాయితీ. ఇందులో భాగంగా మైదానంలోని ఆనర్స్ బోర్డుపై ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల పేర్లు చేర్చి వారి సంతకాలు తీసుకుంటారు. ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా అద్భుతంగా రాణిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో పూజారా, పంత్‌లు అరుదైన గౌరవం దక్కించుకున్నారు.

అద్భుతమైన ఇన్నింగ్స్‌తో

తొలి ఇన్నింగ్స్‌లో పుజారా, రిషబ్‌పంత్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో సెంచరీలు నమోదు చేసిన విషయం తెలిసిందే. సిడ్నీ క్రికెట్ మైదానం(ఎస్‌సీజీ)లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో పుజారా 193 పరుగులు చేయగా.. పంత్ 159 నాటౌట్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 622 పరుగుల భారీ స్కోరుకు బాటలు వేసిన పుజారా, పంత్.. ఈ బోర్డుపై తమ సంతకాలు చేశారు.

ప్రాంతీయ పార్టీలే నిర్ణేతలు

- కూటమేతరులకు 140 స్థానాలు
- ఎన్‌డీఏకు 257, యూపీఏకు 146
- ఎస్పీ, బీఎస్పీ, టీఎంసీ, వైసీపీ, టీఆర్ఎస్, బీజేడీ, లెఫ్ట్ కీలకం
- తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ:
కేంద్రంలో ఈసారి ప్రాంతీయ పార్టీలే నిర్ణేతలుగా వ్యవహరించనున్నాయా...అంటే అవుననే సంకేతాలే వస్తున్నాయి. నాలుగైదు రాష్ట్రాల్లో బలమైన ప్రాంతీయ పార్టీలతోపాటు వామపక్షాలు, ఇతర చిన్న చితకా పార్టీలే ఢిల్లీ పీఠాన్ని శాసించే సూచనలు కనిపిస్తున్నాయి. అధికార, ప్రతిపక్షాల కంటే ఇతర పార్టీలకే మెజార్టీ ఓటింగ్ శాతం లభించే అవకాశాలు స్పష్టంగా కనినిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమికి పాలనా పగ్గాలు దక్కాలంటే ప్రాంతీయ పార్టీలు, చిన్న పార్టీలపై ఆధారపడక తప్పేటట్టు లేదు. ఈ ఏడాది ఏప్రిల్ లేదా మేలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏకు 257 సీట్లు, యూపీఏకు 146 స్థానాలు రానుండగా, ఇతర పార్టీలు ఏకంగా 140 చోట్ల గెలుపొందే అవకాశాలు ఉన్నాయి. సర్వే అంచనా ప్రకారం ఎన్‌డీఏకు 37.15 శాతం ఓట్లు, యూపీఏకు 29.92 శాతం ఓట్లు రానుండగా, ఇతరులకు 32.93 శాతం ఓట్లు లభించే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటులో ఇతరులే కింగ్ మేకర్‌గా నిలవనున్నట్లు స్పష్టమవుతోంది. గతేడాది డిసెంబరు 15 నుంచి 25 తేదీల మధ్య నిర్వహించిన ఒక సర్వేలో ఇది వెల్లడైంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌డీఏకు 272 స్థానాలుండగా, రానున్న ఎన్నికల్లో బీజేపీ కూటమి 15 స్థానాలను కోల్పోనున్నట్లు సర్వే తెలిపింది. కూటమేతర పార్టీలు సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ), అన్నా డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజూ జనతాదళ్, వైసీపీ, వామపక్షాలు ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించే అవకాశాలు ఉన్నట్లు సర్వేలో తేలింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమిలో ప్రస్తుతం ఆర్‌జేడీ, డీఎంకే, టీడీపీ, ఎన్‌సీపీ, జేడీఎస్, ఆర్ఎల్‌డీ, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్ఎస్పీ, జేఎంఎం, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (మణి), ఆర్ఎల్ఎస్పీ పార్టీలు ఉన్నాయి. నవంబరులో నిర్వహించిన ఒక సర్వేలో ఎన్‌డీఏ కూటమి 281 సీట్లతో అధికారంలోకి వస్తుందని తెలిపింది. గతేడాది నవంబరు, డిసెంబరులో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎన్‌డీఏ ప్రభ తగ్గింది. ఈ నేపథ్యంలో మరోసారి సర్వే నిర్వహించగా, ఇతరులు అధికశాతం ఓట్లను సాధించి ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించనున్నట్లు తేలింది. 543 పార్లమెంట్ స్థానాల్లోని 1,086 అసెంబ్లీ స్థానాల్లో సర్వే నిర్వహించారు. 18 నుంచి 60 ఏళ్ల వయస్సునన 27,832 పురుషులు, 26,408 మహిళల అభిప్రాయాలను సర్వే బృందం పరిగణనలోకి తీసుకుంది.

ఎన్‌డీఏ కూటమి

257 స్థానాలు (బీజేపీకి - 223, శివసేనకు - 8, జేడీయూ - 11, అకాలీదళ్ - 5, ఎల్‌జేపీ - 3, పీఎంకే - 1, ఏఐఎన్ఆర్‌సీ - 1, ఎన్‌పీపీ - 1, ఎస్‌డీఎఫ్‌కు - 1, అప్నాదళ్ - 1, ఎంఎన్ఎఫ్ - 1)

యూపీఏ కూటమి

146 స్థానాలు (కాంగ్రెస్ - 85, డీఎంకే - 21, ఆర్‌జేడీ - 10, ఎన్‌సీపీ - 9, జేడీఎస్ - 4, ఆర్ఎల్‌డీ - 2, ఆర్ఎల్ఎస్పీ - 1, ఆర్ఎస్‌పీ - 1, జేయూఎంఎల్ - 2, టీడీపీ - 4, ఎన్సీ - 2, కేరళ కాంగ్రెస్ (ఎం) - 1

ఇతరులు

140 స్థానాలు (టీఎంసీ - 26, ఎస్పీ - 20, బీఎస్పీ - 15, వైసీపీ - 19, టీఆర్ఎస్ - 16, బీజేడీ - 13, అన్నా డీఎంకే - 10, ఏఎంఎంకే - 4, వామపక్షాలు - 10, ఆమ్ ఆద్మీ పార్టీ - 2, ఏఐయూడీఎఫ్ - 2, పీడీపీ - 1, జేవీఎం (పీ) - 1, ఎంఐఎం -1

రాష్ట్రాలలో పార్టీలకు వచ్చే సీట్ల వివరాల అంచనా

ఉత్తరప్రదేశ్ : బీజేపీ - 40, బీఎస్పీ - 15, ఎస్పీ - 20, కాంగ్రెస్ - 2, ఆర్ఎల్‌డీ - 3, అప్నా దళ్ - 1
ఉత్తరాఖండ్ : బీజేపీ - 4, కాంగ్రెస్ - 1
రాజస్థాన్ : బీజేపీ - 15, కాంగ్రెస్ - 10
పశ్చిమ బెంగాల్ : టీఎంసీ - 26, బీజేపీ - 10, కాంగ్రెస్ - 2, వామపక్షాలు - 4
ఒడిశా : బీజేడీ - 13, బీజేపీ - 8
మధ్యప్రదేశ్ : బీజేపీ - 18, కాంగ్రెస్ - 11
ఛత్తీస్‌గఢ్ : బీజేపీ - 5, కాంగ్రెస్ - 6
పంజాబ్ : కాంగ్రెస్ - 7, అకాలీదళ్ - 5, ఆప్ - 1
హర్యానా : బీజేపీ - 8, కాంగ్రెస్ - 2
బీహార్ : బీజేపీ - 13, ఆర్‌జేడీ - 10, జేడీయూ - 11, కాంగ్రెస్ - 2, ఎల్‌జేపీ - 3, ఆర్ఎల్ఎస్పీ - 1
జార్ఖండ్ : బీజేపీ - 7, జేఎంఎం - 4, కాంగ్రెస్ - 1
తమిళనాడు : డీఎంకే - 21, అన్నా డీఎంకే - 10, ఏఎంఎంకే - 4, కాంగ్రెస్ - 3, పీఎంకే - 1
ఆంధ్రప్రదేశ్ : వైసీపీ - 19, టీడీపీ - 4, కాంగ్రెస్ - 2
తెలంగాణ : టీఆర్ఎస్ - 16, ఏఐఎంఐఎం - 1
కర్ణాటక : బీజేపీ - 15, కాంగ్రెస్ - 9, జేడీఎస్ - 4
కేరళ : కాంగ్రెస్ - 8, వామపక్షాలు - 5, ఐయూఎంఎల్ - 2, బీజేపీ - 1, కేసీ (ఎం) - 1, ఆర్ఎస్పీ 1, ఇతరులు - 2
జమ్మూ అండ్ కాశ్మీర్ : బీజేపీ - 2, ఎన్‌సీ - 2, కాంగ్రెస్ - 1, పీడీపీ -1
అసోం : బీజేపీ - 12, ఏఐయూడీఎఫ్ - 2
అరుణాచలప్రదేశ్ : బీజేపీ - 2
మిజోరం : ఎంఎన్ఎఫ్ -1
మణిపూర్ : బీజేపీ - 2
మేఘాలయ : కాంగ్రెస్ - 1, ఎన్‌పీపీ - 1
త్రిపుర : బీజేపీ -1, వామపక్షాలు (సీపీఎం) - 1
నాగాలాండ్ : ఎన్‌డీపీపీ - 1, ఎన్‌పీఎఫ్ - 1
సిక్కిం : ఎస్‌డీఎఫ్ - 1
ఢిల్లీ : బీజేపీ - 5, ఆప్ - 1, కాంగ్రెస్ -1
చండీగఢ్ : బీజేపీ - 1
అండమాన్ అండ్ నికోబార్ : బీజేపీ - 1
దాద్రా, నగర్ హవేలి : బీజేపీ - 1
దామన్ అండ్ దయ్యూ : బీజేపీ - 1
లక్షదీప్ : కాంగ్రెస్ - 1
పుదుచ్చేరి : ఐఎన్ఆర్‌సీ - 1

మరో రైతు ఉద్యమం

- 10న ఢిల్లీ - డెహ్రాడూన్ హైవే దిగ్బంధనం
- ఉత్తరప్రదేశ్‌లోనూ పలు ప్రాంతాల్లో ధర్నా
- డీజిల్ ధర, చెరకు రైతుల సమస్యలపైనే
- ప్రభుత్వ వాహనాలకూ ఎన్‌జీటీ నిబంధనలను
- రెండో విడత ఆందోళనకు బీకేయూ పిలుపు



న్యూఢిల్లీ:
ఢిల్లీ కేంద్రంగా మరో రైతు ఉద్యమం జరగనుంది. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం దేశ రాజధాని ఢిల్లీ - డెహ్రాడూన్ హైవే దిగ్బంధనంతోపాటు ప్రభుత్వ వాహనాలను అడ్డుకోవాలని, భవన నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) పిలుపనిచ్చింది. అందులో భాగంగానే ఈ నెల పదిన ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాలలో ధర్నా, రాస్తారోకో, నిరసన ప్రదర్శనలు చేపట్టాలని బీకేయూ వ్యవస్థాపకుడు మహేంద్ర సింగ్ తికాయిత్, అధికార ప్రతినిధి రాకేష్ తికాయిత్ పిలుపునిచ్చారు. రైతు సమస్యలను పరిష్కరిస్తామని మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయటంలో వైఫల్యం చెందటంతో మరోసారి ఢిల్లీని షేక్ చేయాలని బీకేయూ నేతలు నిర్ణయించారు. రైతుల రుణ మాఫీతోపాటు డీజిల్ దరలు తగ్గించాలని, ఉత్తరప్రదేశ్‌సహా ఇతర రాష్ట్రాల్లో చెరకు రైతుల బకాయిలను తక్షణమే చెల్లించాలని, దేశ రాజధాని న్యూఢిల్లీలో పదేళ్లుపైబడిన ప్రైవేటు వాహనాలతోపాటు ప్రభుత్వ వాహనాలను నిషేధించాలనే డిమాండ్లతో 10న ఢిల్లీ - డెహ్రడూన్ జాతీయ రహదారి దిగ్బంధనం చేయనున్నట్లు వారు తెలిపారు. తాజాగా రైతులు పండించిన పంటలను పరిమితంగానే కొనుగోలు చేయాలన్న నిబంధనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. రాజధానిలో అత్యంత రద్దీ రహదారిని దగ్బంధనం చేయటం వల్ల కేంద్రం దిగివస్తుందని రైతు సంఘం నాయకులు భావిస్తున్నారు. ఢిల్లీతోపాటు ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ పూర్ తదితర ముఖ్య ప్రాంతాల్లోని రోడ్లపై రాకపోకలను అడ్డుకోవాలని బీకేయూ నేతలు పిలుపునిచ్చారు. మూడు నెలల క్రితం పది రాష్ట్రాల నుంచి రెండు వేల ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై తరలివచ్చిన రైతులు పార్లమెంట్‌ను ముట్టడించారు. ఆ సమయంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ పోలీసులు ఆటంకాలు సృష్టించినా, టియర్‌గ్యాస్, నీటి ఫిరంగులను ప్రయోగించినా ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటాన్ని నిరసిస్తూ జాతీయ రహదారులను దిగ్బంధనం చేయాలని నిర్ణయించినట్లు మహేంద్ర సింగ్ తికాయిత్, అధికార ప్రతినిధి రాకేష్ తికాయిత్ తెలిపారు.

భవన నిర్మాణ పనులనూ...

జాతీయ రహదారుల దిగ్బంధనతోపాటు రాజధాని, ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాలలో భవన నిర్మాణ పనులను అడ్డుకోనున్నట్లు తెలిపారు. ఢిల్లీ - డెహ్రాడూన్ జాతీయ రహదారి పక్కనే ఖతౌలి ప్రాంతంలో పలు ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి వేలాది ఎకరాలను భూమిని ప్రభుత్వం సేకరించింది. కానీ, నేటి వరకు రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదు. అందుకే నిర్మాణాలను కూడా నిలుపుదల చేయనున్నట్లు నాయకులు వెల్లడించారు. కాలుష్యం పేరుతో పదేళ్లపైబడిన వాహనాలను రద్దు చేయాలన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వాహనాలను, బస్సులను కూడా అడ్డుకోవాలని నిర్ణయించారు. ప్రభుత్వ బస్సులు, ఇతర వాహనాల విషయంలో ఎందుకు మినహాయింపు ఇవ్వాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు అమలు చేసే నిబంధనలు ప్రభుత్వానికి వర్తించవా అని రాకేష్ తికాయిత్ ప్రశ్నించారు. కాలుష్యం విషయంలో అందరికీ ఒకే విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండు చేశారు. జాతీయ రహదారులపై ప్రభుత్వ వాహనాలను గుర్తించి, వెంటనే నిలుపుదల చేస్తామన్నారు.

పేరుకుపోతున్న చెరకు బకాయిలు

ఉత్తరప్రదేశ్ చెరకు ఫ్యాక్టరీలు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఏటా పేరుకుపోతున్నాయి. గతేడాది సీజన్‌లో రూ.22 వేల కోట్లకుపైగానే బకాయి పడ్డాయి. 2017-18 సీజన్‌లోనే రైతులకు ఈ బకాయిలను చెల్లించాల్సి ఉంది. పశ్చిమ యూపీ ప్రాంతంలో ఈ విషయంలో బీజేపీ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఫలితంగానే గతేడాది మేలో జరిగిన కైరానా ఉప ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిని రైతులు ఓడించారు. అనంతరం చెరకు రైతుల బకాయిలు, ఇతర రైతాంగ సమస్యలపై అక్టోబరులో బీకేయూ ఆధ్వర్యంలో పార్లమెంట్ ముట్టడి జరిగింది. దీంతో ఒక్కసారిగా ప్రభుత్వంలో కదలిక వచ్చింది. 2018-19 నవంబరు క్రషింగ్ సీజన్ ప్రారంభానికి ముందే బకాయిలు క్లియర్ చేసింది. అయినప్పటికీ ఈ సీజన్‌కు సంబంధించి రైతులకు రూ.6 వేల కోట్లను పంచదార మిల్లులు బకాయిపడ్డాయి. చెరకు రైతులు ముందుగానే మిల్లులకు చెరకును అందిస్తున్నారని రాకేష్ తెలిపారు. కానీ, మిల్లు యాజమాన్యాలు మాత్రం రైతులకు ఏళ్లతరబడి బకాయిపడటం శోచనీయమన్నారు. సకాలంలో చెల్లింపులు చేయకపోవటంతో రైతులు అప్పులపాలవుతున్నారని తెలిపారు.

నిబంధనల ఉల్లంఘన

చట్ట ప్రకారం రైతులు చెరకును ఫ్యాక్టరీలకు తోలిన 14 రోజుల్లోగా యాజమానార్యలు డబ్బులు చెల్లించాల్సి ఉందని రాకేష్ తికాయిత్ తెలిపారు. నిర్ణీత కాలంలోగా చెల్లించకపోతే సాలీనా 15 శాతం వడ్డీతో బకాయిలను చెల్లించాలన్నారు. ఏళ్లతరబడి బకాయిలున్నా, ఏ ఒక్క కంపెనీ కూడా వడ్డీని చెల్లించిన దాఖలాలు లేవని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో పాత బకాయిలను వడ్డీతోసహా చెల్లించాలని ఆయన డిమాండు చేశారు. చెరకు రైతుల బకాయిల విషయంలో ఇతర రైతు సంఘాలు కూడా ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. భారతీయ కిసాన్ ఆందోళన్‌సహా మరో 12 రైతు సంఘాలు ఉత్తరప్రదేశ్‌లోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంట మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, షరతులు విధించటం సరికాదని భారతీయ కిసాన్ ఆందోళన్ నాయకులు కుల్దీప్ త్యాగి డిమాండు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.